


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## నేడు ఏపీ క్యాబినెట్ సమావేశం

4



- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు
- వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్ల చట్టమే
- వారు రాసింది రక్త చరిత్ర- మాది అభివృద్ధి సంకల్పం
- ఫొటోల పిచ్చిని రాజముద్రతో పూర్తిగా తుడిచేశాం
- భూ వివాదాలు లేని రాష్ట్రమే మా సంకల్పం
- 22ఏ జాబితా నుంచి రైతులకు విముక్తి కల్పిస్తున్నాం
- బనగానపల్లె సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ 2027 మార్చికి 9833 గ్రామాల్లో 72 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామని చెప్పారు. భూ వివాదాలు లేని రాష్ట్రమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చి సమస్యలను జఠిలం చేసింది. తాము వచ్చాక భూ వివాదాలను పరిష్కరిస్తున్నామని వివరించారు.

## పెట్టుబడులకు ఏపీ నమ్మకమైన కేంద్రం



- త్రీఎస్ విధానంతో పారిశ్రామికంగా రక్షణ కవచం
- ఏపీ- కొరియా డెస్క్ ఏర్పాటుకు చొరవ చూపండి
- కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయండి
- సంయుక్త శిక్షణా అకాడమీల ఏర్పాటుకు సిద్ధం
- ఆ దేశ విదేశాంగ శాఖ ఉపమంత్రితో లోకేష్ చర్చలు
- ఐదోరోజు దక్షిణకొరియా పర్యటనలో బిజీ బిజీ
- కియా మోటార్స్ ఉన్నతస్థాయి బృందంతోనూ సమావేశం


ఐదో రోజు దక్షిణకొరియా పర్యటనలో భాగంగా దక్షిణకొరి యా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్ -హే సిసిలియా చుంగ్‌తో మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమయ్యారు. ఏపీలో అమలుచేస్తున్న త్రీఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన కేంద్రంగా పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఫ్యాక్టరీల ప్రారంభానికి ముందే కొరియన్ వర్క్ స్టాండర్డ్స్, లాంగ్వేజ్, కల్చర్‌పై యువతను సిద్ధం చేసేందుకు ఏపీలో కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఐదోరోజు పర్యటనలో భాగంగా దక్షిణ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉప మంత్రి కామ్హున్ కాంగ్, కియా మోటార్స్ ఉన్నతస్థాయి బృందం, సునిక్ సిస్టమ్ కో లిమిటెడ్ ప్రతినిధులతోనూ భేటీ అయ్యారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

## 22ఏ సంకెళ్లు తెంచిన ప్రభుత్వం



- గుటుపల్లి రైతులకు ఎట్టకేలకు మోక్షం
- 2,074 ఎకరాలకు విముక్తి..897 మందికి ఊరట
- బనగానపల్లెలో 101 ఎకరాలకూ మోక్షం
- తహసీల్దార్ కార్యాలయంలో ప్రక్రియ పూర్తి
- ఉత్తర్వులను అందజేసిన సీఎం చంద్రబాబు

చిక్కుల్లో ఉన్న భూములకు విముక్తి కలిగించి వందలాది మంది రైతులకు సీఎం చంద్రబాబు ఊరట కలిగించారు. వేలాది ఎకరాలను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించారు. మూడునెలల క్రితం తన దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించాలని ఆదేశించిన సీఎం అందుకు అనుగుణంగా రాష్ట్రస్థాయిలో చర్యలు చేపట్టారు. బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామంలో 897 మంది రైతులకు చెందిన 2,074 ఎకరాలను 22-ఏ నుంచి తొలగించారు. అలాగే బనగానపల్లెకు చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబి తా నుంచి విముక్తి కలిగించారు. బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు 22ఏ జాబిజా తొలగింపు ఉత్తర్వులను రైతులకు అందజేశారు.



## మత విద్వేషాలు రెచ్చగొడితే వదిలిపెట్టం

- కుట్రలతో సమాజాన్ని విడగొట్టాలని
- గొడ్డలి పార్టీ కుతంత్రాలు పన్నుతోంది
- సంఘ విద్రోహ శక్తులను ప్రోత్సహించొద్దు
- హే రామ్ అంటూ రావణుడికి సమర్ధనా
- తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తి అవసరమా?
- ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం

కుట్రలు కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతం, వర్గాలతో సమాజాన్ని విడగొట్టాలని గొడ్డలి పార్టీ ప్రయత్నం చేస్తోంది.. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేస్తే కూటమి ప్రభుత్వం క్షమించదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.




# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

- **2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు**
- **వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్ల చట్టమే**
- **వారు రాసింది రక్త చరిత్ర- మాది అభివృద్ధి సంకల్పం**
- **ఫొటోల పిచ్చిని రాజముద్రతో పూర్తిగా తుడిచేశాం**
- **భూ వివాదాలు లేని రాష్ట్రమే మా సంకల్పం**
- **22ఏ జాబితా నుంచి రైతులకు విముక్తి కల్పిస్తున్నాం**
- **బనగానపల్లె సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ**

బనగానపల్లె (చైతన్యరథం): ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి- మీ హక్కు కార్యక్ర మంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపి ణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందు తోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూములను గత పాలకులు 22ఏ కింద చేర్చారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. ప్రజల ఆస్తులను కాజేసేలా భయాందోళనలు సృష్టించారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తేవటమే సమస్యను మరింత జఠిలం చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేశాం. భూ వివాదాల పరిష్కారానికి ధృఢ సంక ల్పంతో ముందుకువెళు తున్నాం. గత పాలకులు ప్రజల భూమి పత్రాలు, సర్వే రాళ్లపైనా ఫొటోలు ముద్రించుకున్నారు. ఆ ఫొటోల పిచ్చిని తుడిచేసేందుకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లను పెట్టి తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ఇదో ఉద్యమంగా, పవిత్రమైన కార్యక్రమంగా చేపట్టి భూ యజమానులకు హక్కులు కల్పిస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72,70,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తాం. ఏపీని ఎలాంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. విలేజ్ ఇనామ్ భూములను కూడా 22ఏలో పెట్టేశారు. వీటిని 1971 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశాం. ఆటో మ్యుటేషన్ ద్వారా వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తు న్నాం. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరులోని వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుందిలో చాలా ఏళ్లుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించాం. డోన్ నియోజకవర్గంలో ఉన్న 2074 ఎకరాల వక్ఫ్ భూములను కూడా 22ఏలో గత పాలకులు పెట్టారు. ఆ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు.

**వారిది రక్తచరిత్ర- మాది అభివృద్ధి సంకల్పం**


రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలు పరిష్కరించటంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నాం. రాయలసీమ ముఖ చిత్రాన్ని మారుస్తున్నాం. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, అమ్కా డిఫెన్స్ ఫైటర్ జెట్ ప్లాంట్ ఏర్పాటు అవుతోంది. డిఫెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాయలసీమలో తయారైన ఎన్ ఫీల్డ్ బుల్లెట్‌లు దేశ మంతా తిరుగుతాయి. రూ.40 వేల కోట్లు ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా మారు తుంది. నగరాలు, పట్టణాల కంటే కడప జిల్లా లింగాల వంటి ప్రాంతాల్లోనే తలసరి ఆదాయం ఎక్కువ ఉంది. నంద్యాలలోనూ హార్టికల్చర్ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నీటిని పొదుపుగా వినియో గించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే జలధార కార్యక్రమా న్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. నంద్యాల జిల్లాలో 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్‌డ్యామ్‌లు నిర్మించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. వర్షపునీటిని భూగర్భజలాలుగా మార్చుకుంటే నీటి భద్రత సాధ్యం అవుతుంద న్నారు. రాయలసీమలో వారు రక్తచరిత్ర రాస్తే మేం అభివృద్ధి సంకల్పం చేస్తున్నామని తెలిపారు.

**ప్రజాభిప్రాయంతో ప్రజలకు అత్యుత్తమ సేవలు**

ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రజాప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. ప్రజలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు



తెలుసుకుని దానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకుంటున్నాం. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తు న్నాం. ఎవరు అఘాయిత్యానికి పాల్పడినా అదే వారికి చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో అత్యుత్తమ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్య, జీవన ప్రమాణాలు అందించాలని ఆలోచన చేస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వెదురుతో తయారుచేసిన ఆభరణాలను ఆసక్తిగా పరిశీలించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరిట మార్కెటింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూఖ్, ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు.





# 22ఏ సంకెళ్లు తెంచిన ప్రభుత్వం





- గుటుపల్లి రైతులకు ఎట్టకేలకు మోక్షం
- 2,074 ఎకరాలకు విముక్తి.. 897 మందికి ఊరట
- బనగానపల్లెలో 101 ఎకరాలకూ మోక్షం
- తహసీల్దార్ కార్యాలయంలో ప్రక్రియ పూర్తి
- ఉత్తర్వులను అందజేసిన సీఎం చంద్రబాబు











బనగానపల్లె (చైతన్యరథం): నంద్యాల పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వందలాది మంది రైతులకు ఊరట కలిగించారు. వేలాది ఎకరాలను 22-ఏ నుంచి విముక్తి కలిగించారు. అలాగే మరో 100 ఎకరాలను చుక్కల భూమి జాబితా నుంచి తప్పించారు. మూడునెలల క్రితం తన దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించాలని గతంలోనే అధికారు లను ఆదేశించిన ఆయన అందుకు అనుగుణంగా రాష్ట్రస్థాయిలో చర్యలు చేపట్టారు. నంద్యాల పర్యటనలో భాగంగా జిల్లాస్థాయిలో చేపట్టాల్సిన ప్రక్రియను దగ్గరుండి చేయించి.. చిక్కుల్లో ఉన్న భూములకు విముక్తి కల్పించి రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. నంద్యాల జిల్లా బనగాన పల్లెలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. ఈ పర్యటన సందర్భంగా మూడునెలల క్రితం డోన్ పర్యటనలో తనను కలిసిన బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామ రైతులను బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించుకు న్నారు. ఈ ఏడాది మార్చి 9వ తేదీన డోన్ పర్యటన సందర్భంగా గుటుపల్లి రైతులు సీఎం చంద్రబాబును కలిసి తమకు చెందిన భూములను 22-ఏ జాబితాలో కలిపారని.. వాటికి విముక్తి కల్పిం చాలని కోరారు. తాను స్వీకరించిన అర్జీని పరిశీలించి పరిష్కరించ మని ఆదేశించారు.

ఈ మేరకు రాష్ట్రస్థాయిలో చేపట్టాల్సిన చర్య లను చేపట్టామని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన బేతంచర్ల రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. సదరు భూముల ను 22-ఏ జాబితా నుంచి తొలగించే ప్రక్రియ ఎంతవరకు వచ్చిం దని జిల్లా రిజిస్ట్రార్‌ను కూడా అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి తనకు అధికారిక తొలగింపు ఉత్తర్వులు ఇంకా అందకపోవడంతో ఆన్‌లైన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభం కాలేద ని జిల్లా రిజిస్ట్రార్ వివరించారు. దీంతో ముఖ్యమంత్రి సమక్షంలో జిల్లా కలెక్టర్ తొలగింపు ఉత్తర్వులను జిల్లా రిజిస్ట్రార్‌కు అందజేశా రు. వాటిని స్వీకరించిన జిల్లా రిజిస్ట్రార్ త్వరలోనే ప్రక్రియను పూర్తి చేస్తామని సీఎంకు తెలిపారు. త్వరలో కాదు ఇప్పుడే పూర్తి చేయాలని చెప్పడంతో అక్కడిక్కడే జిల్లా రిజిస్ట్రార్ సంబంధిత భూములను 22ఏ నుంచి తొలగించారు. దీంతో పాటు మరో అర్జీని క్లియర్ చేశారు. బనగానపల్లెకు చెందిన 101 ఎకరాలను కూడా చుక్కల భూమి జాబితా నుంచి జిల్లా రిజిస్ట్రార్ తప్పించారు.

ఈ భూములకు విముక్తి కలగడంతో బేతంచర్ల మండలం గుటు పల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతులకు ఊరట లభిం చింది. ఈ రైతులకు చెందిన 2,074 ఎకరాలు 22-ఏ నుంచి విముక్తి పొందాయి. అలాగే బనగానపల్లెకు చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి బయటపడ్డాయి.

ఈ మేరకు సదురు భూములను 22-ఏ నుంచి విముక్తి కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు అందించారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయ భూములను వైసీపీ ప్రభుత్వం అన్యా యంగా 22ఏ జాబితాలో చేర్చడంతో వ్యవసాయ రుణాలు పొందలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక, ఇతర భూ లావాదేవీలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని వివరించారు. తమ సమస్య ఇంత త్వరగా పరిష్కారం అవుతుందని తాము ఊహించ లేదని ఆనందం వ్యక్తం చేశారు.

## పెండింగులో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం

బేతంచర్ల భూముల తరహాలోనే రాష్ట్రంలో మరిన్ని భూ వివా దాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెడుతోంది. ఇప్పటికే తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్య లకు పరిష్కారం చూపింది. ఇప్పుడు బేతంచర్ల మండలం గుటుపల్లి రైతులకు కూడా అదే తరహాలో ప్రభుత్వం న్యాయం చేసింది. రీ సర్వే పేరుతో భూములను గత ప్రభుత్వం 22-ఏలో చేర్చి రైతులకు తెచ్చిపెట్టిన ఇబ్బందులను ప్రజా ప్రభుత్వం తొల గిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో 22ఏ నుంచి లక్షలాది ఎకరాలకు విముక్తి కలిగి వేలాదిమంది రైతుల కళ్లలో సంతోషాన్ని నింపుతోంది. 2019-24 మధ్యనున్న ప్రభుత్వం చేసిన నిర్వాకంతో భూమి తమ పేరుమీదే ఉన్నా దానిని అమ్ముకోలేక, అవసరమైన సమయంలో రుణాలు పొందలేక రైతు లు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇలా ఉన్న సమస్యల్లో అత్యధిక శాతం గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా ఉత్పన్నమైనవే. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి రెవెన్యూ ప్రక్షాళన మీద దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం.. దానికి అనుగుణంగా చర్య లు తీసుకుంటోంది. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తూ పట్టా దార్ పాస్ పుస్తకాలను కొత్తవి ముద్రించి ఇవ్వడంతో పాటు... సుదీర్ఘకాలం పెండింగులో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తోంది. అన్ని రకాల పరిశీలనలు జరిపించి నిషేధిత 22-ఏ జాబితాలో చిక్కుకున్న భూములకు విముక్తి చేస్తూ ప్రభుత్వం రైతులకు ప్రయో జనం చేకూరుస్తోంది.

చైతన్యరథం





## బనగానపల్లెలో సీఎంకు ఘనస్వాగతం

నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో మీ భూమి – మీ హక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపి ణీలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్‌షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘన స్వాగతం పలికారు.
























చైతన్యరథం

# మత విద్వేషాలు రెచ్చగొడితే వదిలిపెట్టం



- **సంఘ విద్రోహ శక్తులను ప్రోత్సహించొద్దు**
- **కుట్రలతో సమాజాన్ని విడగొట్టాలని**
- **గొడ్డలి పార్టీ కుతంత్రాలు పన్నుతోంది**
- **హే రామ్ అంటూ రావణుడికి సమర్థనా**
- **తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తి అవసరమా?**
- **ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం**

బనగానపల్లె(చైతన్యరథం): కుట్రలు కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతం, వర్గాలతో సమాజాన్ని విడగొట్టాలని గొడ్డలి పార్టీ ప్రయత్నం చేస్తుందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. బనగానపల్లెలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ సభలో ఆయన మాట్లాడుతూ గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు, రౌడీయిజాన్ని వైసీపీ ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో విధ్వంసం చేస్తోంది. అంతర్వేది రథం దహనం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం చేసినా గత పాలకులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వ్యాఖ్యానించారు. గత పాలకులు తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని కల్తీ చేశారు. హిందువుల మనోభా వాలను దెబ్బతీశారు. ఇలాంటి ఘోరాలు చాలా చేశారు. ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. రెండురోజుల క్రితం ఆదోనిలో శివాలయంలోని దీపంలో ఓ దుర్మార్గుడు సిగరెట్ వెలిగించి అపచారం చేశాడు. వెంటనే కేసు పెట్టి నిందితుడిని అరెస్టు చేశాం. మత విద్వేషాలు రగిలించేలా ఎవరు దుశ్చర్యకు పాల్పడినా కూటమి ప్రభుత్వం క్షమించదని హెచ్చరించారు.

### దుర్మార్గులకు గొడ్డలి పార్టీ ఫండింగ్

సామాజిక మాధ్యమాల్లో కొందరు దుర్మార్గాలకు పాల్పడుతు న్నారు. రావణ్ అనే వ్యక్తి పురాణాలను దూషిస్తాడు. మన రాముడు, సీతపై నీచంగా మాట్లాడతాడు. తీవ్రవాదాన్ని, పాకిస్తాన్‌ను సమర్థిస్తాడు. అలాంటి వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం అందిస్తుంది. ఎంతటి బరితెగింపు ఇది. ప్రజలు దీనిని గుర్తించాలి. వారి పోకడలు ఏమిటో తెలుసుకోవాలి. ముఖ్యమం త్రి స్థాయి వ్యక్తినే దూషిస్తున్న వారికి సామాన్య ప్రజలు ఏం లెక్క. తిరుమలకు వెళ్లి డిక్లరేషన్ ఇమ్మంటే వాటిని తిరస్కరించి జగన్‌రెడ్డి అపచారం చేశారు. నేను చర్చికి వెళ్లినా, మసీదుకు వెళ్లినా అక్కడి మతాచారాలను గౌరవిస్తాను. హే రామ్ అంటూ రావణుడిని ప్రోత్సహిస్తున్న వ్యక్తులను ఏమనాలో తెలియడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇలాంటి వింతలు విచిత్రాలు జరుగుతాయని చెప్పారు. మతవిద్వేషాలు ఎవరు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకోం. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన వాడే అని తెలిసి తోక ముడిచారు. ఓట్లు కోసం తండ్రికి పూజలు చేస్తున్నాడు. బతికి ఉన్న తల్లికి మాత్రం ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు మన సమాజా నికి అవసరమా. తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు మనకు ఎందుకు? అని ప్రశ్నించారు.














# నేడు ఏపీ క్యాబినెట్ సమావేశం

## సీఆర్‌డీఏ నిర్ణయాలకు ఆమోదముద్ర వేసే అవకాశం



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్ష తన రాజధాని అమరావతి సచివాలయంలో శుక్రవారం ఉద యం 10.30 గంటలకు క్యాబినెట్ సమావేశం కానుంది. ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఈ క్యాబినెట్ సమావేశంలో శుభవార్త చెప్పనున్నారు. రాజధానికి కొత్తగా భూములిచ్చే వారికి నాన్ జరీబుకు ఎకరానికి ఏడాదికి రూ.40 వేల యాన్యుటీ ఇచ్చేందుకు ఆమోదం తెలపనున్నారు. జరీబుకు ఎకరానికి రూ.60 వేలు ఇచ్చేందుకు ఆమోదముద్ర వేయను న్నారు. అలాగే ట్రంక్ రోడ్ల నిర్మాణంలో భూములు, ఇల్లు కోల్పో యిన వారికి నెలకు రూ.10 వేల అద్దె భత్యానికి కూడా ఆమోదం తెలపనున్నారు. ఇక కొత్త పూలింగ్ గ్రామాల రైతులకు రూ.1.50 లక్షల వరకు రుణమాఫీపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇంటర్నే షనల్ స్పోర్ట్స్ సిటీ పరిధిలోని 307 ఎకరాల ఇనాం, దేవాదాయ శాఖ భూముల బదిలీ కోసం ఆ శాఖకు రూ.159 కోట్ల పరిహారం చెల్లించేందుకు సీఆర్డీఏకి క్యాబినెట్‌లో అనుమతి ఇవ్వనున్నారు. అమరావతిలో ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక అక్వేరియంతో పాటు కార్యాలయం నిర్మాణానికి రెండు ఎకరాల భూమి కేటా యింపునకు ఆమోదం తెలపనున్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు మొత్తం 7.42 ఎకరాలు కేటాయింపునకు ఆమోద ముద్ర వేయ నున్నారు. ఈషా ఫౌండేషన్‌కు భూమితో పాటు పార్కు వినియోగ హక్కులు, నిర్వహణ బాధ్యతలు అప్పగించే నిర్ణయానికి కూడా ఆమోదం తెలపనున్నారు. సీఐఐకు నాలుగు ఎకరాల భూమి కేటా యిస్తూ సీఆర్డీఏ తీసుకున్న నిర్ణయానికి ఈ కేబినెట్‌లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. 19వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన 11 ప్రాజెక్టుల పెట్టుబడులకు కూడా ఆమోదం తెలపనున్నారు. ఈ కేబినెట్ భేటీలో రూ.9,076 కోట్ల పెట్టుబడులు, 10,531 ఉద్యో గాల కల్పనపై చర్చించనున్నారు.

# పీ4 స్ఫూర్తితో పుట్టిన గడ్డకు చేయూత



- వత్సవాయి గ్రామానికి ఎన్ఆర్ఐ రాంబాబు సేవలు ఎనలేనివి
- టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు టీడీ జనార్దన్ ప్రశంసలు
- గురుకుల పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన





నందిగామ(చైతన్యరథం): వత్సవాయి గ్రామాభివృద్ధికి గ్రామానికి చెందిన ప్రవా స భారతీయులు చిరుమామిళ్ల రాంబాబు చేస్తున్న సేవలు ఎనలేనివని టీడీపీ జాతీ య ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ తెలిపారు. ప్రవాస భారతీయులు చిరుమామిళ్ల రాంబాబు తన సొంత నిధు లతో గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను పూర్తిస్థాయిలో అభి వృద్ధి చేస్తున్నారు. జరుగుతున్న పనులను పరిశీలించేందుకు గురువారం సాయం త్రం వత్సవాయికి వచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను నాలుగునెలల క్రితం ఈ గురుకుల పాఠశాలను సందర్శించిన సమయంలో ఫోన్‌లో చిరుమామిళ్ల రాంబాబుతో మాట్లా డటం జరిగిందని తెలిపారు. వెంటనే ఆయన స్పందించి ముఖ్యమంత్రి చంద్రబా బు తలపెట్టిన పీ4 పథకం స్ఫూర్తితో తాను జన్మించిన ఈ వత్సవాయి గ్రామం లో గురుకుల పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించ డానికి పెద్దఎత్తున తన సొంత నిధులు వెచ్చించడం అభినందించదగ్గ విషయమని ప్రశంసించారు. విద్యార్థులకు పడక సౌక ర్యం లేకపోవడంతో ముందుగా రూ.40 లక్షల అంచనాతో డార్మెంటరీ నిర్మించాలని భావించినట్లు తెలపారు. విద్యార్థులకు భోజన వసతిసౌకర్యం కల్పించడం కోసం దాదాపు మరో రూ.30 లక్షలు వెచ్చించి డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, జల్లు స్నానా లు, పాఠశాల సుందరీకరణ తదితర పనులు చేపట్టడం రాంబాబు దానగుణం, సమాజంపై ఆయనకున్న బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**50 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లి..**

గ్రామంలో 50 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లిన ఏకైక వ్యక్తి చిరుమామిళ్ల రాంబాబు అని గుర్తుచేస్తూ..తాను ఈ హైస్కూల్లో విద్యను అభ్యసించేటప్పుడు ఈ విషయాన్ని పదేపదే గుర్తుతెచ్చుకున్న వారిమేనని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో గ్రంథాల యం, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం తన స్థలాలను కేటాయించడం, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి కార్యక్ర మాలతో రాంబాబు చేస్తున్న సేవలపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం టీడీ జనార్ధన్ గురుకుల పాఠశాల గురుకుల పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిరుమామిళ్ల రాంబాబు మార్గదర్శకత్వంలో గురుకుల పాఠశాల అభివృద్ధి పనులను పర్యవేక్షించిన సామి నేని శ్రీనివాసరావు, కొంగర వెంకటేశ్వర రావు, నరమనేని సుబ్బారావులను అభినం దిస్తూ శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, సహకార సంఘ అధ్యక్షుడు నెల్లూరి శ్రీనివాసరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కనతాల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ది రామారావు కట్ట వేణు, ఉప్పుగండ్ల వెంకటేశ్వర్లు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జరీనా, సిబ్బంది పాల్గొన్నారు.







# కియా మోటార్స్ కార్యకలాపాలు విస్తరించండి

**ఇంటిగ్రేటెడ్ ఈవీ, హైబ్రిడ్ వాహనాల - తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి - సంస్థ ఉన్నతస్థాయి బృందంతో లోకేష్ భేటీ**







సియోల్ (సౌత్ కొరియా): ఐదో రోజు దక్షిణకొరియా పర్యటనలో భాగంగా కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్ లీ, ఇతర ఉన్నతస్థాయి బృందంతో మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమయ్యారు. కియా మోటార్స్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన పీబీవీ వాహనాలతో సహా ఇంటిగ్రేటెడ్ ఈవీ, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఏపీలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించా లని కోరారు. ప్రపంచ మార్కెట్లకు సేవలు అందించడానికి విశాఖ పట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంట ర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ-జీఎంపీ ప్లాట్‌ఫామ్ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్‌లు, ఈవీ ఛార్జింగ్ ఎలక్ట్రానిక్స్ కోసం ఒక ఈవీ కాంపోనెంట్ల తయారీ కేంద్రాన్ని స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. పవర్ ట్రెయిన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, వెహికల్ హోమోలోగేషన్ కోసం ఒక ఈవీ పవర్ ట్రెయిన్ టెస్టింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

## చర్చించి నిర్ణయం తీసుకుంటాం

కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్ లీ మాట్లాడుతూ కియా మోటార్స్ ఇండియా లో 2017లో అనంతపురంలో స్థాపితమై 2019లో భారీస్థాయి ఉత్పత్తి ప్రారంభించిందని తెలిపారు. కియా మోటార్స్ ప్రయాణీకు ల, వాణిజ్య, వినోద వాహనాల తయారీతో పాటు "ప్లాన్ ఎస్", ప్లాట్‌ఫామ్ బియాండ్ వెహికల్ ఇనీషియేటివ్, ఈవీ, అటానమస్ మొబిలిటీని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. మాతృసంస్థ హ్యుందయ్ మోటార్స్ తర్వాత దక్షిణకొరియాలో రెండో అతిపెద్ద ఆటో మొబైల్ సంస్థగా కియా మోటార్స్ అవతరించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ ప్లానింగ్) యూయ్ చుల్ జియోంగ్ (Mr. Eui Chul Jeong), సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) సాంగ్ ఉన్ చో (Mr. Sang Un Cho), వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ ఆపరేషన్స్) హీ సామ్ కిమ్ (Mr. Hee Sam Kim), వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే కున్ యాంగ్ (Mr. Tae Kun Yang), కియా ఇండియా సీనియర్ లీగల్ అడ్వయిజర్ జుంగో యాన్ (Mr. Jungho An), ప్రిన్సిపల్ అడ్వయిజర్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.





# కొరియన్ కంపెనీలకు ఏపీ ఆహ్వానం

- పెట్టుబడిదారులకు నమ్మకమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్
- త్రీఎస్ విధానం పారిశ్రామికవేత్తలకు రక్షణ కవచం
- ఏపీ- కొరియా డెస్క్ ఏర్పాటుకు చొరవ చూపండి
- కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయండి
- సంయుక్త శిక్షణా అకాడమీల ఏర్పాటుకు సిద్ధం
- ఆ దేశ విదేశాంగ ఉపమంత్రితో లోకేష్ చర్చలు



సియోల్ (సౌత్ కొరియా): దక్షిణకొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తో మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమయ్యారు. ఏపీలో అమలుచేస్తున్న త్రీఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరి యా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత స్థిరమైన, నమ్మకమైన కేంద్రంగా చేసు కునేలా పరిశ్రమదారులను ప్రోత్సహించాలని కోరారు. ఏపీలో అందించే పన్ను రాయితీలు, తక్కువ ధరకే భూమి, సబ్సిడీలు పరిశ్రమదారులకు మద్దతుగా నిలుస్తాయని తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేప థ్యంలో తూర్పుతీరంలో సురక్షితమైన, నమ్మకమైన, స్నేహపూర్వక ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని వివరించారు. దీనివల్ల ప్రపంచ సప్లయ్ చైన్ నష్టాలను కూడా తగ్గించడానికి ఆస్కారమేర్పడుతుందని చెప్పారు. కేవలం భారీ పరిశ్రమలే కాకుండా గ్రీన్ ఎనర్జీ, వినియోగ వస్తువులు, మోడరన్ రిటైల్, టూరిజం, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కొరియన్ పెట్టుబడు లకు ఏపీ స్వాగతం పలుకుతుందని తెలిపారు. ఫ్యాక్టరీల ప్రారం భానికి ముందే కొరియన్ వర్క్ స్టాండర్ట్స్, లాంగ్వేజ్, కల్చర్‌పై స్థానిక యువతను సిద్ధం చేసేందుకు దక్షిణకొరియాతో కలిసి సంయుక్త శిక్షణా అకాడమీలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలు సంసిద్ధంగా ఉన్నాయని వివరిస్తూ ఏపీలో కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

## తక్కువ ఖర్చుతో ఎగుమతులకు లాంచ్ ప్యాడ్

భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సొంతమైన రెండో అతి పొడవైన తీరప్రాంతం, ప్రధానమైన డీప్ వాటర్ పోర్ట్స్ (విశాఖ పట్నం, కృష్ణపట్నం, కొత్తగా రాబోయే 4 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు) వల్ల తక్కువ ఖర్చుతో ఎగుమతులకు లాంచ్ ప్యాడ్ అయ్యే అవకాశ ముందని వివరించారు. కొరియా వ్యాపారాలకు భారతీయ మార్కెట్‌లో ప్రవేశం కల్పించి తద్వారా మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా, ఐరోపా దేశాలకు విస్తరించేందుకు వీలు కల్పిస్తుందని తెలిపారు. భారత్-కొరియా వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుబంధంగా ప్రత్యేకమైన ఆంధ్రప్రదేశ్-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, ఇరు ప్రాంతాల నడుమ వార్షిక ఆర్థిక భాగస్వామ్య చర్చలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. శాశ్వత వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, విశాఖపట్నం-బుసాన్/ఇంచియాన్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీల్లో కొరియన్ లాంగ్వేజ్ సెంటర్లు, డైరెక్ట్ ఎయిర్ కనెక్టివిటీకి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.



# శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్

- జాయింట్ వెంచర్ కోసం సహకారం అందిస్తాం
- సునిక్ సిస్టమ్స్ సీఈవోతో భేటీలో లోకేష్ విజ్ఞప్తి




సియోల్ (సౌత్‌కొరియా): సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ, పెరోవ్ స్కైట్ డిపాజిషన్ పరికరాల తయారీలో పేరెన్నికగన్న సునిక్ సిస్టమ్ కో, లిమిటెడ్ (దక్షిణకొరియా) సీఈవో ఎస్‌డబ్ల్యూ చుంగ్ , సంస్థ ఉన్నతస్థాయి బృందంతో మంత్రి నారా లోకేష్ సియోల్ లో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ డిస్ ప్లే పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో యూనిట్ ఏర్పాటుకు ముందుకు వస్తే జాయింట్ వెంచర్ కోసం సహకారం అందిస్తాం. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0తోపాటు ఏపీ సెమీ కండక్టర్, డిస్ ప్లే ఫ్యాబ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు అందిస్తాం. సెమీకాన్ టెక్‌పై నైపుణ్యాభి వృద్ధి శిక్షణ అందించడానికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, విశ్వ విద్యాలయాలతో కలిసి పనిచేయాలని కోరారు. సునిక్ సిస్టమ్స్ సీఈవో చుంగ్ మాట్లాడుతూ మూడు విభాగాలలో వాక్యూమ్ థిన్-ఫిల్మ్ డిపోజిషన్ పరికరాలను తాము తయారుచేస్తున్నట్లు చెప్పారు. తమ ఉత్పత్తుల్లో ఓఎల్ఈడీ డిస్‌ప్లే ఎవాపరేషన్ (AMOLED, OLEDoS, 8.6-CÉHŽ, స్పుటర్ / CVD /ఎచర్/థిన్-ఫిల్మ్ ఎన్‌క్యాప్సులేషన్ ప్రాసెస్ మాడ్యూల్స్, పెరోవ్ స్కైట్ సోలార్, డిస్‌ప్లే డిపోజిషన్ పరికరాలు ఉన్నాయని తెలిపా రు. ప్రస్తుతం ఏపీలో తమ సంస్థ ఎటువంటి కార్యకలాపాలు నిర్వ హించడం లేదని చెబుతూ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సునిక్ సిస్టమ్స్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ జెహెచ్ లీ, సేల్స్ జనరల్ మేనేజర్ హెచ్.వై.చో, సీఎస్ సీవో కేసీ మ్యూన్, మీడియా ఇన్ఫోకామ్ సీఈవో సెవోన్ చో, క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్ సీటీవో రమణారావు మాగంటి పాల్గొన్నారు.






# నాలెడ్జ్ ఎకానమీగా ఆంధ్రప్రదేశ్

- దక్షిణకొరియా సహకారం అందించాలి
- 10 జీడబ్ల్యూ డేటా సెంటర్‌లో భాగస్వామ్యం కండి
- స్వర్ణాంధ్ర-2047 లక్ష్యానికి చేయూత అందించాలి
- ఫ్యూచర్ స్కిల్ వర్క్‌ఫోర్స్‌గా యువతను తీర్చిదిద్దాలి
- కొరియా పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయండి
- కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉపమంత్రి కామ్హాన్ కాంగ్‌తో లోకేష్ సమావేశం
- గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం









సియోల్ (సౌత్ కొరియా): ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు దక్షిణకొరియా సహకారం అందించాలని మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. దక్షిణ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్ట్‌మెంట్స్ ఉపమంత్రి కామ్హాన్ కాంగ్‌తో మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. యువతను భవిష్యత్తుకు సిద్ధమయ్యే డీప్‌టెక్ వర్క్‌ఫోర్స్‌గా తయారు చేయడానికి కొరియా విశ్వవిద్యాల యాలు సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యానికి మద్దతుగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, పాదరక్షల తయారీ, నౌకా నిర్మాణ రంగాల్లో కొరియా నైపుణ్య సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉమ్మడి పరిశోధనలకు సహకారం ఇచ్చిపుచ్చుకుందాం

స్టూడెంట్/ ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లు, కరిక్యులమ్ డెవలప్‌మెంట్ కోసం ఆంధ్రప్రదేశ్-కొరియా విశ్వవిద్యాలయాల ను అనుసంధానించాలి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మా ణం, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థలు, ఏఐ, క్వాంటం కంప్యూ టింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లీన్-టెక్, హెల్త్-టెక్ రంగాలలో సాంకేతిక పరిజ్ఞాన బదిలీపై పరస్పరం సహకరించుకోవాలి. వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే ఏపీ దార్శనికతను ముందు కుతీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్‌టీఐహెచ్, యూనివర్సి టీలు-దక్షిణకొరియా పరిశోధనా సంస్థలు, ఆవిష్కరణల కేంద్రాల (మాగోక్ సైన్స్ పార్క్, నానో ఫ్యాబ్ సెంటర్ వంటివి) నడుమ ఉమ్మడి పరిశోధన, అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

## ఏపీలో కొరియా పారిశ్రామిక పార్క్‌కు ప్రతిపాదన

ఆంధ్రప్రదేశ్‌లోని కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా ఒక కొరియా పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందుకు అవసరమైన భూమిని ఏపీఐఐసీ ల్యాండ్ బ్యాంకు ద్వారా అందిస్తామని లోకేష్ తెలిపారు. ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు, ప్రత్యేక సింగిల్-విండో క్లియరెన్స్ యంత్రాంగం, ఆర్థిక ప్రోత్సాహకాలు, విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ కనెక్టివిటీ వంటి పటిష్టమైన, ప్రత్యేక విధాన ప్యాకేజీతో పాటు పూర్తిస్థాయి సౌక ర్యాల కోసం ఒక కొరియా డెస్క్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 10 జీడబ్ల్యూ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ప్రాజెక్టులను అమలు చేయడాని కి అవసరమైన ఇంధన-మౌలికసదుపాయాల ప్రణాళికలు, నియంత్రణ విధానాలను రూపకల్పనలో సహకరించేలా రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రభుత్వంతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఆహ్వానించారు.

## మౌలికసదుపాయాల కల్పనకు సహకరించండి

ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలో అగ్రగామి పెట్టుబడి గమ్యస్థా నంగా నిలిపేందుకు మౌలిక సదుపాయాల నిర్మాణంలోకి కొరియన్ దిగ్గజాలను లోకేష్ ఆహ్వానించారు. ప్రస్తుతం ఏపీలో ఉన్న 6 పోర్టులు, 7 విమానాశ్రయాలకు అదనంగా 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, కొత్త విమానాశ్రయాలు రాబోతున్నాయని వివరించారు. ఇవి హెచ్‌డీ కేఎస్ఓఈ, శాంసంగ్ షిప్పింగ్, హన్వా ఓషన్ వంటి కొరియన్ సంస్థలకు గణనీయమైన అవకాశాలను అందిస్తాయని చెప్పారు. ఏపీలో అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాల వల్ల గత రెండేళ్లలో గూగుల్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, క్యారియర్, బీపీసీఎల్, రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో సహా 240 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇవి 2026 ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు మొత్తం పెట్టుబడులలో 25.3 శాతంగా ఉన్నాయని తెలిపారు.

## గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టండి

ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే సుమారు 14 జీడబ్ల్యూ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2030 నాటికి 160 జీడబ్ల్యూ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారతదేశ 500 జీడబ్ల్యూ జాతీయ లక్ష్యంలో సుమారు 32 శాతానికి సమానం. సోలార్, పవనశక్తి, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ విద్యుత్ ఉత్పత్తి తయారీ రంగాలలో పెట్టుబడులు పెట్టేం దుకు ఎస్‌కే ఎనర్జీ, ఎల్‌జీ ఎనర్జీ, హన్‌వా వంటి కొరియా సంస్థ లకు ఆహ్వానం పలుకుతున్నాం. దక్షిణప్రాంతం/ ఆగ్నేయాసియా లో ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన లాజిస్టిక్స్, జలరవాణా, నౌకా నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయం. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యా న్ని చేరుకునేందుకు మౌలిక సదుపాయాలు, సుస్థిరాభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన కొరియా వ్యూహాత్మక ప్రణాళిక సహకారాన్ని కోరుకుంటున్నామని తెలిపారు.




ఎవరికి ఎంత ప్రయోజనం:

| తరగతి | లబ్ధి పొందుతున్న విద్యార్థులు | ప్రస్తుత డైట్ చార్జీలు (రూ.లలో) | 10 శాతం పెరిగాక (రూ.లలో) |
|---|---|---|---|
| 3-4 తరగతులు | 15,220 | 1,150 | 1,265 |
| 5-10 తరగతులు | 4,61,108 | 1,400 | 1,540 |
| ఇంటర్ ఆపై చదివే విద్యార్థులకు | 1,75,858 | 1,600 | 1,760 |

# బందరులో ప్రతి గడపకూ తాగునీటి కుళాయి

- అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- ఓటు వేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటాను
- ప్రతి ఇంటికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ
- క్యాంబెల్‌పేటలో తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభించిన మంత్రి



మచిలీపట్నం (చైతన్యరథం): బందరు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించడమే తన లక్ష్యమని రాష్ట్రగనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం క్యాంబెల్ పేట పరిధిలో తాగునీటి పైపులైన్ అభివృద్ధి పనులను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. మచిలీపట్నంలోని ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, అందుకు గత ప్రభుత్వ హయాంలో నాసిరకమైన వస్తువుల వినియోగం కారణం అన్నారు. 20 సంవత్సరాలు ఉండాల్సిన విద్యుత్ వైర్లు నాలుగేళ్లకే పాడైపోవడం వారి దోపిడీకి నిదర్శనం. మొత్తం వైర్లను త్వరలోనే మెరుగుపరుస్తాం. రోడ్లు మొత్తం కూడా అభివృద్ధి చేస్తాం. మాటలు చెప్పడంకాదు చేతల్లో చేసి చూపిస్తాం. కాలనీల్లోని రోడ్లకు కూడా త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తాం. ఫిషింగ్ హార్బర్ వరకు ఉన్న రోడ్డును సాస్కి పథకంలో భాగంగా అభివృద్ధి చేశాం. కల్వర్టును అభివృద్ధిచేశాం. రూ. 2కోట్లతో రోడ్డు పనులు కూడా చేపడుతున్నాం. మెడికల్ కాలేజీ ముందుండే రోడ్డు పనులు కూడా ప్రారంభించాం. వీలైనంత త్వరగా పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. ప్రస్తుతం ఉన్న రోడ్డును రెండు వరుసలకు విస్తరించేందుకు కూడా ప్రతిపాదనలు పంపించాం. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా మచిలీపట్నానికి రూ.200 కోట్లు మంజూరయ్యాయి. ఆ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుచేస్తాం. నియోజకవర్గంలో రూ.37 కోట్ల వ్యయంతో 50 కి.మీల మేర రోడ్లు నిర్మించాం. గరాలదిబ్బ నుండి పోలాటితిప్ప మధ్య బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. గతంలో కూటమిప్రభుత్వమే ప్రతిపాదించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనే పనులుపూర్తి కాబోతున్నాయని మంత్రి రవీంద్ర అన్నారు.

## రాజధానిపై జగన్ రోజుకో మాట

రాష్ట్రాన్ని సంక్షేమం,అభివృద్ధిబాటలో నడిపిస్తున్నాం. రాష్ట్ర విభజన తరువాత అమరావతే రాజధాని అని జగన్ అన్నాడు. కనీసం 50 వేల ఎకరాలుండాలి అన్నాడు. అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడాడు. న్యాయం కోరిన రైతుల్ని రక్తాలు కారేలా కొట్టాడు. ఎన్ని రకాలుగా హింసించాలో అన్ని రకాలుగా దుర్మార్గాలకు పాల్పడ్డాడు. 2024 ఎన్నికల్లో జగన్ రెడ్డిని భూస్థాపితం చేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా నడిపిస్తుంటే.. ఇప్పుడు మావిగన్ అంటూ డ్రామాలాడుతున్నాడు. రాష్ట్ర ప్రజలతో పాటు పొరుగు రాష్ట్ర ప్రజలు కూడా వెక్కిరించే పరిస్థితికి తీసుకొచ్చారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలిచ్చే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఇప్పుడు కూడా మంత్రి నారా లోకేశ్ రోజుకో దేశానికి వెళ్లి ఏపీకి పెట్టుబడులు తీసుకురావడానికి అలుపెరుగకుండా శ్రమిస్తున్నారు.

ఎవరేంటో, ఎవరి సత్తా ఏంటో ఎన్నికల్లో చూద్దాం. కానీ ఇప్పుడు నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేద్దాం. చిత్తశుద్ధితో పని చేస్తున్న టీడీపీ నేతలపై అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తున్నా.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తున్నాను. బందరులో చోటా బచ్చాలు కూడా నీతులు మాట్లాడుతున్నారు. గతంలో తప్పుడు కేసులతో జైళ్లలో పెట్టి పైశాచిక ఆనందం పొందారు. వారి అరాచకాన్ని గుర్తించి వారిని ఇంట్లో కూర్చోబెట్టి.. మాకు అవకాశం కల్పించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మంచి చేయడం నా కర్తవ్యం. విజయవాడ - బందరురోడ్డు,మెడికల్ కాలేజీ, బందరు పోర్టు గతంలో ప్రారంభించాం.. త్వరలోనే పూర్తిచేసి చూపిస్తాం. పోర్టు అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. చిన్నాపురం సమీపంలో కెమికల్‌కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. బందరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరందుకుందని మంత్రి రవీంద్ర చెప్పారు.

## పక్కాగా సంక్షేమ పథకాలు

ఎన్ని ఇబ్బందులున్నా.. సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తున్నాం. ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్‌లు అందిస్తున్నాం. అన్న ఎన్టీఆర్ రూ.30తో ప్రారంభించిన పెన్షన్లు ప్రస్తుతం రూ.4000 చేశాం. జగన్ రెడ్డి రూ.3000 పెన్షన్ పేరుతో హామీ ఇచ్చి దగా చేశాడు. కానీ మేము హామీ మేరకు పెన్షన్ పెంచి అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల సేవలో లాంటి అనేక సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నాం.

ఏపీలో పెట్టుబడులు పెట్టొద్దు అనేలా జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడు. కులం, మతం, ప్రాంతం పేరుతో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడు. తల్లిని, చెల్లిని గౌరవించని వ్యక్తి జగన్ రెడ్డి లాంటి అరాచక శక్తులు రాష్ట్రానికి అవసరమా? రాష్ట్రం కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి, పోలవరం ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయి. విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. గూగుల్, అర్సెలార్ మిట్టల్ లాంటి ప్రఖ్యాత కంపెనీలు ఏపికి వచ్చాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ మచిలీపట్నం మీదుగా కేబుల్స్ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనతో వచ్చాయి. ఆ ప్రాజెక్టు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. బందరు నియోజకవర్గం మొత్తానికి తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపి తీరుతానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# నాణ్యమైన వైద్య విద్య బోధనకు పటిష్టమైన చర్యలు

- రాష్ట్రంలోని 5 వైద్య కళాశాలలు టాప్ 100లో ఉండాలి
- ప్రొఫెసర్ల కొరత తీర్చేందుకు పదవీ విరమణ వయసు పెంపును పరిశీలిస్తాం
- వైద్య విద్యార్థుల హాజరు ఆన్ లైన్ ద్వారా పర్యవేక్షణ
- 2026-27 రెండో త్రైమాసికంలో బడ్జెట్, కేంద్ర సాయం వినియోగం 50%కు చేరాలి
- వైద్య విద్య నాణ్యత, బడ్జెటు వినియోగంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సుదీర్ఘ సమీక్ష

అమరావతి(చైతన్యరథం): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అతి కీలకమైన ప్రొఫెసర్ల పోస్టుల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉండడంతో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపును పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ వైద్య సంఘం (ఎన్ఎంసీ) ప్రమాణాల మేరకు ఒక ప్రొఫెసర్ పోస్టుకు మూడు పీజీ సీట్లను కేటాయిస్తున్నారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 70సంవత్సరాలుగా ఉండడంతో ప్రొఫెసర్ల లభ్యత పెరిగి పీజీ సీట్లు ఎక్కువగా పొందుతున్నాయి. రాష్ట్రంలోని 17ప్రభుత్వ వైద్య కళాశాలల్లో దాదాపు 800 ప్రొఫెసర్ల పోస్టులకుగాను 200 ఖాళీగా ఉంటుండడంతో దీని ప్రభావం వైద్య విద్య ప్రమాణాలపై పడడంతోపాటు పీజీ సీట్లను కోల్పోయే పరిస్థితి ఎదురవుతోంది. మరీ ముఖ్యంగా 16 సూపర్ స్పెషాల్టీ విభాగాల్లో 159 ప్రొఫెసర్ల పోస్టులకుగాను 106 (66%) ఖాళీలు ఉండడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు.నిబంధనల ప్రకారం పదోన్నతుల ద్వారా ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. వివిధ విభాగాల్లో పదోన్నతికి అర్హులైన వారు లేకపోవడంతో ఖాళీలు పేరుకుపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపు అంశాన్ని ప్రభుత్వం పరిశీలించేందుకు సమగ్ర ప్రతిపాదనను రూపొందించాలని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్‌ను మంత్రి సత్యకుమార్ గురువారంనాడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలిత్రైమాసికంలో బడ్జెట్, కేంద్ర సాయం వినియోగతీరుపై ఉన్నతాధికారులతో సమగ్రంగా మూడు గంటలకుపైగా మంత్రి సమీక్షించారు.

## నాణ్యమైన వైద్య విద్య అతి కీలకం

ప్రజల ఆరోగ్యసంరక్షణకు అతికీలకమైన నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సమర్థులైన వైద్యుల అవసరం ఉన్నందున రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలతోకూడిన వైద్య విద్య అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ ప్రమాణాల మేరకు అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశానికి సంబంధించి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు కొంతమేరకు కఠినంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లో అవసరాల మేరకు బోధన వసతులు లేకున్నా ఎక్కువ సీట్లు పొందుతున్న విషయం తమ దృష్టికొచ్చిందని, ఈ అంశాన్ని నిశితంగా పరిశీలించి, ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని వసతులు ఉండేలా చూడాలని మంత్రి స్పష్టంచేశారు. ఆకస్మిక తనిఖీల ద్వారా ఆయా కళాశాలల్లో లోపాలను గుర్తించి తగు సవరణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయం అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ అంశంపై తనకు క్రమం తప్పకుండా నివేదికలు సమర్పించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని కనీసం ఐదు పూర్వ ప్రభుత్వ వైద్య కళాశాలలు బోధనపరంగా తొలి వందజాబితాలో స్థానం పొందేలాచేయాలని అధికారులకు సూచించారు

గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అదనంగా 230 ఎంబీబీఎస్, 250 పీజీ సీట్లలో ప్రవేశాలు కల్పించినట్లు



విశ్వవిద్యాలయం అధికారులు మంత్రికి తెలిపారు.

## విద్యార్థుల హాజరు విషయంలో రాజీ పడొద్దు

ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 75% హాజరు ఉన్న వైద్య విద్యార్థులు మాత్రమే వార్షిక పరీక్షలకు అర్హులని, ఈవిషయంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడొద్దని మంత్రి స్పష్టంచేశారు. విద్యార్థుల హాజరు నమోదుకు ప్రస్తుతం అమలవుతున్న వ్యవస్థపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థుల హాజరును ఆన్‌లైన్ ద్వారా నమోదుచేసే వ్యవస్థను వెంటనే ప్రవేశపెట్టేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్య కళాశాలల్లో 'బెడ్ సైడ్ ఎడ్యుకేషన్' (రోగుల పరిశీలన) ద్వారా వైద్య విద్యార్థులకు బోధించడంలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటోందని విమర్శలు వస్తున్నాయని,ఈవిషయంలో ఎటువంటి అలసత్వానికి అవకాశం ఇవ్వరాదని విశ్వవిద్యాలయం అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు. వైద్య విద్యార్థుల్లో సేవాభావం, నైతిక విలువలు పెంపొందేలా చూడాలని సూచించారు.

## కేంద్ర సాయం వినియోగం పెరగాలి

2026-27 ఆర్థిక సంవత్సరం మొత్తం వార్షిక బడ్జెట్ కేటాయింపు రూ.18,216 కోట్లు కాగా మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రూ.4,130 కోట్ల వ్యయం (22.72%) జరిగినట్లు సమీక్షా సమావేశంలో మంత్రికి ఉన్నతాధికారులు వివరించారు. ప్రతిపాదిత మొత్తం కేంద్ర సాయం రూ.2,308 కోట్లు కాగా జూన్ వరకు రూ.357కోట్ల(15.45%)ను వినియోగించినట్లు అదికారులు తెలిపారు. మొత్తం వ్యయం సరళి కొంత మేరకు బాగానే ఉన్నా కేంద్ర సాయాన్ని తక్కువ మోతాదులో వాడుకోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకుగల కారణాలపై అధికారులతో ఆయన చర్చించారు. మంజూరైన నిధుల విడుదల, వ్యయానికి సంబంధించి బిల్లుల అప్‌లోడింగ్ జాప్యం వల్ల బడ్జెటు వినియోగంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు. వీటి గురించి ఆర్థికశాఖ అధికారులతో చర్చించేందుకు సమగ్రవివరాలను అందించాలని మంత్రి ఆదేశించారు. అశించిన దానికంటే తక్కువ వ్యయాన్ని చూపించిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరేట్ ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబరు) ముగిసే నాటికి అన్ని విభాగాలతో కలిపి మంత్రిత్వ శాఖాపరంగా మొదటి ఆరునెలలకు వార్షిక బడ్జెటు, కేంద్ర సాయానికి సంబందించి, వినియోగాన్ని కనీసం 50%కు పెంచాలని మంత్రి ఆదేశించారు. ఆయా విభాగాలు, ఏపీఎస్ఎంఐడీసీ మధ్య సమన్వయాన్ని పెంచుకుని, ప్రాధాన్యతలు నిర్ధారించుకుని అమల్లో ఉన్న నిర్మాణాల పనుల్లో వేగాన్నిపెంచి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ,ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్‌రాజ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువరన్, ప్రజారోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులపై జగన్ మొసలి కన్నీరు

- పరిహారం ఇవ్వకుండా మృతులు కుటుంబాలను వేధించిన వైసీపీ
- గత ప్రభుత్వ పెండింగ్ బకాయిలు రూ.13.05 కోట్లను అధికారంలోకి రాగానే చెల్లించాం
- వైసీపీ హయాంలో మత్స్యకారులపై తీవ్ర నిర్లక్ష్యం
- విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకారుల కోసం యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు
- మత్స్యకారుల మరణాల్లోనూ రాజకీయ లబ్ధి కోసం జగన్ వెంపర్లాట నీచం
- వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం



అమరావతి (చైతన్యరథం): మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన 63 మంది మత్స్యకారుల కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, ఇతర పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేయకుండా అన్యాయం చేశారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లించి బాధితకుటుంబాలకు న్యాయం చేసిందని తెలిపారు. అలాంటి పరిస్థితులు సృష్టించిన జగన్ ఇప్పుడు మత్స్యకారుల గురించి మాట్లాడటం, తన సొంత పత్రికలో తప్పుడు రాతలు రాయించడం విడ్డూరంగా ఉందని, విమర్శలు చేసే ముందు తన ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. మత్స్యకారుల సంక్షేమం పేరుతో ప్రచారం చేసుకున్న జగన్ ప్రభుత్వం ఆచరణలోమాత్రం వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న 63 ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌లకు సంబంధించిన రూ. 3.15కోట్లను తమప్రభుత్వం వచ్చాక 2024 జూలై 8న విడుదల చేసి బాధిత కుటుంబాలకు అందజేశామని చెప్పారు. అలాగే గతప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రూ. 9.90కోట్ల డీజిల్ (ఆయిల్)సబ్సిడీ బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జూన్ నెలలో విడుదలచేసి మత్స్యకారులకు అందించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మత్స్యకారులకు ఎప్పుడుఅండగా ఉంటూ తగిన న్యాయం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం లాగా ఎటువంటి వైఫల్యాలు లేకుండా వారికి సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### విషాదాల్లోనూ రాజకీయాలేనా..

ఇటీవల విశాఖపట్నం తీరంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన విస్తృత గాలింపు చర్యలు చేపట్టిందన్నారు. భారత కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు,విశాఖపట్నం పోర్టు అథారిటీతోపాటు సంబంధిత అన్ని సంస్థల సమన్వయంతో నిరంతర గాలింపు కొనసాగించామని తెలిపారు. మత్స్యకారులు గల్లంతైన సమాచారం ప్రభుత్వానికి ఆలస్యంగా అందినప్పటికీ విషయంతెలిసిన వెంటనే యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అత్యవసర చర్యలు ప్రారంభించామని చెప్పారు. అలాగే సాంకేతిక లోపం కారణంగా ఒడిశా తీరానికి సమీపంలో సముద్ర మధ్యలో చిక్కుకుపోయిన 10మంది ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులను ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించి సురక్షితంగా రక్షించిందని మంత్రి తెలిపారు. ఒడిశా ప్రభుత్వ అధికారులతో నేరుగా సమన్వయం చేసి సంబంధిత యంత్రాంగాన్ని రంగంలోకి దింపడం ద్వారా మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడమే కాకుండా, వారికి అవసరమైన వైద్య సహాయం అందించి అనంతరం క్షేమంగా విశాఖపట్నానికి తరలించామని వెల్లడించారు. మత్స్యకారుల ప్రాణాల రక్షణ కోసం ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా పని చేస్తుంటే, అలాంటి సమయంలో కూడా గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఈఅంశాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవడం బాధాకరమని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మత్స్యకారులకు భరోసా కల్పించాల్సిన సమయంలో వారిని రెచ్చగొట్టే విధంగా వ్యవహరించటం పూర్తిగా బాధ్యతారాహిత్యమన్నారు.

### జగన్‌వి మాటలు.. మావి చేతలు

గత ప్రభుత్వం హయాంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ. 5లక్షల నుంచి రూ. 10లక్షలకు పెంచామని ప్రచారం చేసుకుందని, కానీ క్షేత్రస్థాయిలో ఆ సాయం సకాలంలో అందక బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని మంత్రి పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పాలనలో సముద్ర వేటకు వెళ్లి ఎంతమంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారనే విషయంపై ఇప్పటివరకు ఒక అధికారిక శ్వేతపత్రం కూడా విడుదల చేయలేదని మంత్రి ప్రశ్నించారు. మత్స్యకారుల ఓట్ల కోసం 'భరోసా' పేరుతో ప్రచారం చేసిన జగన్‌రెడ్డి, వేటలో మరణించిన మత్స్యకారుల ఖచ్చితమైన సంఖ్యను ప్రజలకు ఎందుకు వెల్లడించలేదని నిలదీశారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ. 10లక్షల పరిహారం ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, వచ్చిన క్లెయిమ్‌లలో అనేక దరఖాస్తులను బడ్జెట్ లేదనే కారణంతో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచిందని మంత్రి విమర్శించారు. మొదటి రెండేళ్లలో వచ్చిన 116క్లెయిమ్‌లలో 52 క్లెయిమ్‌లను సుదీర్ఘకాలం పరిష్కరించకుండా వదిలేసిన విషయాన్ని గుర్తుచేశారు. సముద్ర తీర ప్రాంతాల్లో కనీస భద్రతా చర్యలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వంఘోరంగా విఫలమైందని మంత్రి ఆరోపించారు. రిప్ కరెంట్లు, పాత బోట్ల కారణంగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అనేక ప్రమాదాలు జరిగినప్పటికీ, వాటి పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించలేదన్నారు. మరణాల సంఖ్య బయటపడితే ప్రభుత్వ వైఫల్యం బహిర్గతమవుతుందనే భయంతో అధికారిక సమాచారాన్ని ప్రజల ముందుకు తీసుకురాలేదని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మత్స్యకారుల కష్టాలను రాజకీయ ప్రచారానికి మాత్రమే పరిమితం చేసిన వైసీపీ ప్రభుత్వం, వారి సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాత్రం మాటలకే పరిమితం కాకుండా మత్స్యకార కుటుంబాలకు నేరుగా ప్రయోజనం చేకూరే నిర్ణయాలు తీసుకుంటూ వారి సంక్షేమానికి అండగా నిలుస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



## వేతన సమస్య పరిష్కారానికి కృషి

**- శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు మంత్రి కందుల దుర్గేష్ హామీ**

నిడదవోలు (చైతన్యరథం): శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల వేతనాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హామీఇచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలో గల 90 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న 'శ్రీ సత్యసాయి తాగునీటి పథకం' కార్మికులు గురువారం నిడదవోలు క్యాంపు కార్యాలయంలో మంత్రి దుర్గేష్‌ని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గత 20 ఏళ్లుగా ఐదు మండలాల్లోని సుమారు 2,90,000 మంది జనాభాకు ఈ పథకం ద్వారా నిర్విరామంగా మంచి నీరు అందుతోందని, సరైన నిధుల కేటాయింపు లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్ట్ నిర్వహణ లోపించి, ప్రజలకు నీటిసరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో గత 7 నెలలుగా జీతాలు అందక, సైట్ మెయింటెనెన్స్ నిధులు విడుదల కాక పథకంలో పనిచేస్తున్న 56మంది కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు 'ఆప్కాస్' ద్వారా ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు అందేలా శాశ్వత పరిష్కారం చూపాలని కార్మికులు మంత్రి దుర్గేష్‌ను కోరారు. గతంలో మంత్రి దుర్గేష్, నాటి కలెక్టర్ చొరవతోనే తమకు వేతనాలు అందాయని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు.

కార్మికుల వినతిపై మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందిస్తూ..లక్షలాది మందికి దాహార్తిని తీర్చే ఈప్రతిష్టాత్మక పథకం సక్రమంగా సాగేలా, సత్యసాయిబాబా ఆశయాలకు అనుగుణంగా కార్మికులవేతనాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### క్యాన్సర్ బాధితుడికి అండగా మంత్రి

నిడదవోలు మండలం మునిపల్లె గ్రామానికి చెందిన 37 ఏళ్ల మానుపాటి పెద్ద పోసియ్య బోన్ క్యాన్సర్ బారిన పడి, చికిత్సకు రూపాయి లేక దిక్కుతోచని స్థితిలో తన భార్యతో కలిసి గురువారం నిడదవోలులోని క్యాంపు కార్యాలయానికి వచ్చి మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి తమ సమస్య విన్నవించుకున్నారు. స్పందించిన మంత్రి వెంటనే హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన ఉచిత వైద్యం అందించాల్సిందిగా కోరారు. తక్షణమే అధికారిక రిఫరెన్స్ లెటర్ సిద్ధం చేయాలని తన అడిషనల్ పీఎస్‌ను ఆదేశించారు. అంతే కాకుండా, వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లేందుకు కూడా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబ పరిస్థితిని గమనించి ఆ కుటుంబానికి దారిఖర్చుల నిమిత్తం తనేస్వంతంగా కొంత నగదు సాయం అందించి మంత్రి దుర్గేష్ మానవత్వం చాటుకున్నారు.

## రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన..

# రాజముద్రతో పాస్ పుస్తకాలు

- గతంలో ప్రజల ఆస్తి పత్రాలపై జగన్ ఫొటోలు వేసుకోవడం దుర్మార్గం
- కూటమి అధికారంలోకి వచ్చాక పక్కాగా రెవెన్యూ దస్త్రాలు సిద్ధం చేశాం
- రైతుల భూముల భద్రతకు ప్రాధాన్యత
- మచిలీపట్నంలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా భూసమస్యల్ని పరిష్కరించి, ప్రజలకు వారి ఆస్తిపై పక్కాగా హక్కు కల్పించే లక్ష్యంతో పాస్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం గోకవరం గ్రామంలో 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి గురువారం పాల్గొని రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కష్టబడుతున్నారు.

ప్రజల ఆస్తికి వారు మాత్రమే యజమానులుగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా సమగ్రసర్వే నిర్వహించి పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతంలో సర్వే రాళ్లపై, పట్టాదారు పాస్ పుస్తకాలపై కూడా జగన్‌రెడ్డి తన బొమ్మలేసు కున్నారు. భూ హక్కు చట్టంపేరుతో ప్రజల ఆస్తిని కూడా కొట్టేయాలని ప్రయత్నించారు. జగన్‌రెడ్డి దుర్మార్గాలను ప్రజలు గుర్తించి.. వైసీపీకి సమాధికట్టారు. కానీ ఆ భూతాలను శాశ్వతంగా సమాధి చేయకుంటే మళ్లీ నష్టపోతాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు బిక్కు బిక్కుమంటూ బతికారు. కానీ నేడు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. గతంలో సమస్య చెప్పుకోవాలన్నా భయపడే పరిస్థితి నుండి.. స్వేచ్ఛగా గ్రీవెన్స్‌కి వచ్చి సమస్య చెప్పుకునే వెసులుబాటు కల్పించాం.



### 'రెవెన్యూ' ప్రక్షాళన

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసింది. వైసీపీ హయాంలో ఐదేళ్లు రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్థం చేశారు. కూటమివచ్చాక వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేశాం. నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజల్ని కాపాడేలా చర్యలు తీసుకున్నాం. ప్రజల భూములపై వారికే హక్కులు కల్పిస్తూ 'మీ భూమి మీ హక్కు' పేరుతో రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ప్రతి భూమికి రీసర్వే చేసి, సర్వే రాళ్లు పాతి, ఎవరి బొమ్మలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర మాత్రమే ఉండేలా పాస్ పుస్తకాలు ముద్రించి అందిస్తున్నాం. భూమి వివరాలు, యజమాని పేరు,ఫోటో, భూ హద్దులు స్పష్టంగా చూపిస్తూ పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. బందరు నార్త్ మండలంలోని ఐదు గ్రామాల్లో సుమారు 1966 మందికి, సౌత్ మండలంలో నెలకుర్రులో 851 మంది మొత్తంగా 2817 మందికి చెందిన భూములు రీ సర్వే చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించామని మంత్రి రవీంద్ర చెప్పారు.

మచిలీపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రాన్నికి ఆదర్శంగా తీర్చేలా కృషిచేస్తున్నాం. బందరు పోర్టును వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. వచ్చే ఏడాది జనవరి నాటికి ప్రారంభించుకుంటాం. బందరు పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అనేకసంస్థలు ముందుకొస్తున్నాయి. కెమికల్ పరిశ్రమలు రాబోతున్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్ పరిశ్రమలు వస్తున్నాయి. భారత్ సాల్ట్, లిథియం వంటి సంస్థలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. రాబోయే కాలంలో మచిలీపట్నాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతోపాటుగా..యువతకు, మహిళలకు ఉద్యోగ ఉపాధిఅవకాశాలు కల్పించాలని భావిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా మచిలీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు సన్నాహాలుచేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# టూరిజం హబ్‌గా పోలవరం.. తుది దశకు డిజైన్లు

- 13న ప్రాజెక్ట్ సందర్శనకు ముఖ్యమంత్రి చంద్రబాబు
- అదేరోజు డిజైన్లు ఖరారు
- సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): పోలవరాన్ని టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు సంబంధించిన డిజైన్స్ తుది దశకు చేరినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పోలవరం టూరిజం హబ్‌కు సంబందించి అధికారులు, జపాన్ దేశానికి చెందిన నిప్పాన్ కోయి ఏజెన్సీ ప్రతినిధులతో గురు వారం మంత్రి సమావేశమయ్యారు. టూరిజం హబ్ ప్రతిపాదనలను సమీక్షించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన సీఎం చంద్రబాబు పోలవరం పర్యటనకు వచ్చి, పనుల పురోగతిపై సమీక్ష చేస్తారన్నారు. అదే రోజు పోలవరం టూరిజం హబ్ కు సంబంధించిన డిజైన్స్ పరిశీలించి, ఖరారు చేస్తారన్నారు. తెలుగుతనంతోపాటు, రాష్ట్ర ఔన్నత్యం చాటేలా, పోలవరం స్పిల్‌వే ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారని మంత్రి చెప్పారు. పోలవరం ఏరియాను టూరిజం హబ్‌గా చేసేందుకు, లైడార్ సర్వే ద్వారా 10వేల ఎకరాలు గుర్తించామని వివరించారు. ఎన్‌హెచ్ -365 బీబీ నుండి ఎన్‌హెచ్-516 ఈ ని పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానం చేసేలా నేషనల్ హైవే అథారిటీతో చర్చిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నుండి పాపికొండలు మీదుగా భద్రాచలం వరకు టూరిజంహబ్‌గా మార్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. గోదావరి నది ఔన్నత్యాన్ని చాటేలా మ్యూజియం, వాటర్ స్పోర్ట్స్, టెంపుల్ టూరిజం, రిసార్ట్స్,హట్స్,ఎమ్యూజ్మెంట్ పార్క్‌లు అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి అన్నారు. సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు,ఈఎన్సీ నరసింహా మూర్తి, ఆర్కిటెక్ట్‌లు, నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దళితులు జగన్ ట్రాప్‌లో పడొద్దు

- జగన్ రెడ్డి మెప్పు కోసం పేర్ని నాని, కొడాలి నాని, అంబటి రాంబాబు రోజుకో అబద్ధం
- ఎంతమంది 'రావణ్'లను దించినా వైసీపీ దుకాణం మళ్లీ తెరుచుకునే పరిస్థితి లేదు
- జగన్ రెడ్డికి కేవలం 'టిష్యూ పేపర్'లా కొందరు వైసీపీ నేతలు
- దేశ భద్రతా చట్టం 'ఉపా'ని ఉప్మా, ఇడ్లీలతో పోల్చడం కొడాలి నాని దిగజారుడుతనానికి నిదర్శనం
- కులాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టడమే వైసీపీ అధికారిక 'ట్రేడ్ మార్క్'
- బచ్చలకూర జోసెఫ్ అలియాస్ 'ప్రశ్న రావణ్' లాంటి సంఘ విద్రోహ శక్తుల వెనుక ఉన్నది 'గొడ్డలి పార్టీ' నాయకులే
- టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు పీతల సుజాత ధ్వజం

అమరావతి(చైతన్యరథం): వైసీపీ అనే పార్టీ ఇప్పుడు మూసేసే దుకాణంలామారిపోయిందని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత విమర్శించారు. పూటకో అబద్ధం, రోజుకో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు చేసినా, ఎంతటి అసత్య ప్రచారాలు చేసినా, ఎంత మంది రావణ్‌లను రంగంలోకి దింపినా వైసీపీ అనే దుకాణం మళ్లీ తెరుచుకునే పరిస్థితి లేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు ఎదురైన చేదు అనుభవాలను ప్రజలు మర్చిపోలేదని, అందుకే వైసీపీ మాటలను నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు ఏమాత్రం లేరని స్పష్టంచేశారు. జగన్ మోహన్ రెడ్డి తనసొంత కుటుంబసభ్యులనే గౌరవించలేక పోయారని, సొంత తల్లిని, చెల్లిని ఎంతగా బాధపెట్టారో రాష్ట్ర ప్రజలందరూ చూశారని పీతల సుజాత అన్నారు. అలాంటి వ్యక్తి ప్రజల సంక్షేమం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వైసీపీలో ఉన్న కొందరు నాయకుల పరిస్థితి కూడా జగన్‌రెడ్డికి అవసరం ఉన్నంతవరకే ఉపయోగించుకుని, తర్వాత వదిలేసే టిష్యూ పేపర్‌లా మారిందన్నారు. అయినా కొందరు నాయకులు పదవుల కోసం, జగన్ మెప్పు కోసం వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. "దేశ సమగ్రతను, ప్రజల రక్షణను కాపాడే అత్యంత శక్తివంతమైన ఉపా (యూఏపీఏ- అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్, 1967)చట్టాన్ని కొడాలి నాని అనే వ్యక్తి ఉప్మా, ఇడ్లీలతో పోల్చడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం.వీళ్ళకి జైల్లో చిప్పకూడు అలవాటైపోయి, దేశ భద్రతా చట్టాలు కూడా ఉప్మా, ఇడ్లీల్లా చులకనగా కనిపిస్తున్నాయి. గతంలో దేవుళ్ళను సైతం అపహాస్యం చేసిన ఈ నాయకులకు చట్టాలను గౌరవించడం ఎలా తెలుస్తుంది? మీరు ఏ చట్టాలనైతే అవహేళన చేస్తున్నారో...అవే చట్టాలు రేపు మీ మెడకు గుదిబండలుగా మారబోతున్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పీతల సుజాత హితవు పలికారు.

## కులాల మధ్య చిచ్చుకు కుట్రలు

ఒకవైపు 76 సంవత్సరాల వయసులోనూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే ఒక్క సంకల్ప బలంతో అహర్నిశలు కష్టపడుతున్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలని, తెల్లవారుజాము నుంచే క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తూ, ప్రజలకు ఇబ్బంది లేకుండా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. మరోవైపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన శాఖల్లో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం రోడ్లు వేస్తూ అంకిత భావంతో పనిచేస్తున్నారు. అలాగే యువనేత, మంత్రి నారా లోకేష్ ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ, ఐటీ కంపెనీలను రాష్ట్రానికి రప్పించి మన బిడ్డల ఉపాధి కోసం, ఉద్యోగాల కల్పన కోసం దృఢ సంకల్పంతో శ్రమిస్తున్నారు. విద్యాశాఖలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా నారా లోకేష్ ఎంతో అద్భుతంగా విద్యారంగాన్ని, తద్వారా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతుంటే... మరోపక్క వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆయన పార్టీ నేతలు మాత్రం ఇంకా కులాల మధ్య చిచ్చు పెట్టే నీచ రాజకీయాలకే పరిమితమయ్యారని పీతల సుజాత తీవ్రస్థాయిలోధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ది చెప్పి కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌మోహన్‌రెడ్డికి ఇంకా బుద్ధిరాలేదు. దళితులు, బీసీలు, గిరిజనులు, మహిళలు, మైనారిటీల మధ్య కుల విద్వేషాలు రెచ్చగొట్టడమే వైసీపీ ట్రేడ్ మార్క్‌గా మారిపోయింది. "ఒక్క ఛాన్స్" అంటూ నమ్మిస్తే జనం జాలిపడి ఐదేళ్లు అధికారం ఇస్తే... రాష్ట్రాన్ని దోచుకోవడం, దాచుకోవడం, అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారు. మహిళలపై దారుణంగా అత్యాచారాలు జరిగినా ఒక్కడికైనా శిక్ష పడిందా? మీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అధికారం కోసం సొంత మనుషులను సైతం పావులుగా వాడుకుని వదిలేయడం జగన్‌కి వెన్నతో పెట్టిన విద్య. నాడు స్వార్థం కోసం 'కోడికత్తి డ్రామా'ఆడి, దళిత యువకుడు శ్రీను జీవితాన్ని ఐదేళ్ల పాటు జైల్లో పాలుచేసి సర్వనాశనం చేసింది నిజం కాదా? దళితులను కేవలం 'టిష్యూ పేపర్'లా వాడుకుని వదిలేయడం జగన్‌నైజం.గతంలో మీతండ్రి హయాంలో చెన్నారెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆయనను దించేసేందుకు జరిపించిన ఘోరాలు, ఆ తర్వాత తునిలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ తగలబెట్టి కాపు యువకుల జీవితాలను కోర్టుల చుట్టూ తిప్పిన కుట్రల వెనుక ఉన్నది ఎవరు? అధికారం కోసం ఎన్ని కుట్రలకైనా, ఆకృత్యాలకైనా దిగజారడం వైసీపీ నేతలకు అలవాటుగా మారింది. ప్రతిపక్షంలో ఉంటూ ఇంకా అరాచకాలు చేయాలని చూస్తే ఈ కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని సుజాత స్పష్టం చేశారు.



## దళితులపై దమనకాండ మరిచారా?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులను, మహిళలను చిత్రహింసలకు గురిచేసి, ఇప్పుడు మళ్లీ రాజకీయ స్వార్థం కోసం దళిత, క్రైస్తవ సభల పేరుతో మోసపూరిత రాజకీయాలకు జగన్‌మోహన్‌రెడ్డి తెరలేపారని పీతల సుజాత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రశ్నించే హక్కు, భావప్రకటన స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వంపై, నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడితే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు పబ్లిక్‌గా చంపి డోర్ డెలివరీ చేస్తే... అతనికి శిక్ష పడకుండా కాపాడి,పక్కనపెట్టుకుని తిరిగిన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిది కాదా? దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు ఎక్కడిది? వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అత్యాచారాలు, హత్యలతో విలవిలలాడి పోయింది. స్వాతంత్ర్యదినోత్సవం నాడే రమ్య అనే దళిత యువతిని నడిరోడ్డుపై నరికి చంపారు. జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే దళితమహిళపై అత్యాచారం జరిగింది. జగన్ నివాసమైన తాడేపల్లి ప్యాలెస్ పక్కనే బాలికపై ఘోరం జరిగితే ఏం యాక్షన్ తీసుకున్నారు? చీరాల కిరణ్ ఉదంతం,రాజమండ్రిలో మైనర్ బాలికపై అత్యాచారం, వరప్రసాద్ అనే దళిత యువకుడికి శిరోముండనం చేసిన ఘటనలు వైసీపీ అరాచక పాలనకు నిదర్శనం కాదా? భావప్రకటన స్వేచ్ఛ అనే ట్యాగ్ తగిలించుకుని సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు అబద్దాలు ప్రచారం చేస్తామంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదు. స్వేచ్ఛకు ఒక హద్దు ఉంటుంది. ఇంట్లోకి వచ్చి తంతే తన్నులు తినడానికి ఇక్కడెవరూ సిద్ధంగా లేరు. బురదజల్లి రాజకీయం చేయాలను కుంటే ఆ బురద మీకే అంటుకుంటుంది. సమాజంలో తీవ్రమైన అశాంతి సృష్టించి, దేశ సార్వభౌమత్వానికే భంగం కలిగించేలా వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారు కాబట్టే... కూటమి ప్రభుత్వం 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడానికి వెనకాడదు. దేశ రక్షణ, రాష్ట్ర శాంతిభద్రతలే మాకు ముఖ్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క వ్యక్తి కూడా స్వేచ్ఛగా బయటకు రావడానికి భయపడకూడదు. ఎవరి పని వారు ధైర్యంగా చేసుకునే వాతావరణం ఉంది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామనే నెపంతో వ్యక్తిత్వ హననం చేస్తామంటే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. సమాజాన్ని చీల్చే ఇలాంటి విద్వేషకుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. బచ్చలకూర జోసెఫ్ అలియాస్ 'ప్రశ్న రావణ్' లాంటి వ్యక్తులు సమాజంలో అశాంతి, అల్లర్లు రేపే సంఘ విద్రోహ శక్తులుగా మారిపోయారు. ఇలాంటి వారి మాటలను, వీడియోలను ఏ ఒక్కరైనా హర్షిస్తారా? ప్రజలు పూర్తిగా మర్చిపోయిన 'గొడ్డలి పార్టీ' నాయకులు... మళ్లీ ఉనికి చాటుకోవడం కోసం ఇటువంటి సంఘ విద్రోహ శక్తులను, కొంతమంది యూట్యూబర్లను పోగేసి కూటమి ప్రభుత్వంపై కుటిల బుద్ధితో నెగిటివ్ ప్రచారాలు చేయిస్తున్నారని సుజాత ధ్వజమెత్తారు.

## ఎవరినీ వదిలేది లేదు

ఐదేళ్ల పాలనా కాలంలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, మహిళలకు లేదా అగ్రకులాల పేదలకు వైసీపీ చేసింది ఏంటి? కేవలం దోచుకోవడం, దాచుకోవడం, అక్రమ కేసులు పెట్టడమే కదా! దళితుల కోసం గతంలో చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన 28 సంక్షేమ పథ కాలను రద్దు చేసిన దళిత ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి. మీహయాంలో ఎంతమంది దళితులు బలైపోయారో గుర్తు తెచ్చుకుంటే మీకు సిగ్గు అనిపించాలి. ఈ రోజున రాష్ట్ర రక్షణ కోసం ప్రయోగిస్తున్న 'ఉపా' చట్టం కేవలం అరాచకాలు సృష్టించే 'ప్రశ్న రావణ్'లాంటి వాళ్ల కోసమే కాదు. వారివెనుక ఉండి నడిపిస్తున్న వారికి, సోషల్ మీడియాలో సపోర్ట్‌చేస్తున్న వారికి,వారికి ఫండింగ్ (ఆర్థిక సహాయం) సమకూరుస్తున్న వైసీపీ పెద్దలకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది. ఇందులో ఉన్న ప్రతి ఒక్కరూ శిక్షార్హులే. పోలీసులు ఇప్పటికే ఆ పనిలో ఉన్నారు, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదు. మీకు నిజంగా ప్రజాభిమానం కావాలంటే మంచి కార్యక్రమాలు చేయండి.కూటమి ప్రభుత్వంచేస్తున్న సంక్షేమ పథకాల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే బాధ్యతగల ప్రతిపక్షంగా చెప్పండి, సరిచేసుకుంటాం. అంతేకానీ, నోరుంది కదా అని సోషల్ మీడియా వేదికగా ఇష్టమొచ్చినట్టు వాగితే... మీరు మావైపు ఒకవేలు చూపిస్తే, నాలుగు వేళ్లు మీ వైపే చూపిస్తాయని గుర్తు పెట్టుకోండి. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కష్టపడుతోంది. ప్రజలను ఇబ్బంది పెట్టేలా ఎవరు చట్టాన్ని ఉల్లంఘించినా కఠినశిక్షలు తప్పవు. తప్పు చేసిన వాడు ఎంతటివాడైనా చట్టం తనపని తానుచేసుకుని పోతుంది. వైసీపీ నేతలు ఇప్పటికైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రవర్తించాలని సుజాత హెచ్చరించారు.

చైతన్యరథం

# రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు

- పేద విద్యార్థుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి




అమరావతి(చైతన్యరథం): పేద విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని వివరించారు. సంక్షేమశాఖలపై బుధవారం జరిగిన సమీక్షలో డైట్ ఛార్జీలు 10శాతం పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం చేపట్టేందుకు పెద్దపీట వేస్తున్నామని, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో నెట్‌జీరో విధానం అమలు చేస్తామని వివరించారు. బయో డైవర్సిటీ పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ నిమిత్తం రూ.100కోట్లు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 12కి పెంచాం. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటూ ప్రతిభ కనబరిచే ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ప్రారంభిస్తామని వివరించారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను మ్యాపింగ్ చేసి నైపుణ్యం పెంచి పారిశ్రామిక అవసరాలకు వర్క్‌ఫోర్స్ సిద్ధంచేస్తాం. హాస్టళ్లు, గురుకులాలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఓ వైద్యవిభాగం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనమేరకు సంక్షేమహాస్టళ్లను ఎన్ఆర్ఐలు అడాప్ట్ చేసుకునేలా వారితో సంప్రదింపులు జరుపుతామని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు ఇంద్రధనస్సు తీసుకొచ్చారు. పీ4 ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమని స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టు తీర్పు మేరకే 'టెట్'

- విషయం తెలిసీ కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతున్న జగన్ రెడ్డి
- 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు టెట్ పాస్ కావాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ఇన్‌సర్వీసు టీచర్లకు ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి లోకేష్ హామీ
- ఆ మేరకే 'స్పెషల్ టెట్'పై జీవో విడుదల
- ఉద్యోగులు, టీచర్ల పక్షపాతి కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



అమరావతి(చైతన్యరథం): టెట్ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు విషయం తెలిసి కూడా వైసీపీ కావాలనే బురదజల్లుతోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... పులివెందుల శాసనసభ్యుడు, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు, ఆయన మానసిక పరిస్థితి రాష్ట్రప్రజలను తీవ్ర అయోమయానికి గురిచేస్తున్నాయని మండిపడ్డారు. గతంలో బాబాయి వివేకానందరెడ్డి గొడ్డలిపోటును గుండెపోటుగా మార్చి, అబద్ధపు ప్రచారంతో 2019 ఎన్నికల్లో ఏ విధంగా లబ్ధి పొందారో.. నేటికీ అదే అబద్ధాల వరవడిని జగన్ కొనసాగిస్తున్నారని విమర్శించారు. కియా ఫ్యాక్టరీ, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, కడప స్టీల్ ప్లాంట్ వంటివన్నీ తానే తెచ్చానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. చివరికి తన తాత రాజారెడ్డి పోరాటంవల్లే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవాచేశారు.

## టెట్ వివాదానికి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

గత రెండు రోజులుగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అంశంపై జగన్మోహన్‌రెడ్డి, ఆయన అనుకూల పత్రికలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రాంగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు టెట్ నిర్వహణ అనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాదని, అది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం, అంజుమన్ ఇషాత్ ఎ తలీమ్ ట్రస్ట్ మధ్య రేగిన వివాదంపై సుప్రీంకోర్టులోని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం ఒక అసాధారణ తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం ఉన్న అసాధారణ అధికారాలను ఉపయోగించి.. 2011 కంటే ముందు ఎంపికైన ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులందరూ ఖచ్చితంగా టెట్ పాస్ కావాల్సిందేనని, లేని పక్షంలో వారిని విధులనుంచి తొలగించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని వివరించారు.

## సుప్రీంకోర్టులో పోరాడింది కూటమి ప్రభుత్వమే

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. దీనిపై గత ఏడాదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సంయుక్తంగా తమిళనాడు, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, కర్ణాటక వంటి పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయని తెలిపారు. అయినప్పటికీ సర్వోన్నత న్యాయస్థానం ఈ ఏడాది మే నెలలో టెట్ నిర్వహించాల్సిందేనని పునరుద్ఘాటించిందన్నారు. ఈ సమస్యపై గతంలోనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ.. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక టెట్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కాలం కసరత్తు చేసి బుధవారం 'స్పెషల్ టెట్' ఉత్తర్వులు జారీ చేసిందని స్పష్టం చేశారు.

## జగన్‌కు దమ్ముంటే మోదీ ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వాలి

ఉపాధ్యాయులను కలిసి టెట్ రద్దుపై పోరాడతానని చెప్పిన జగన్, ఎక్స్(ట్విట్టర్) వేదికగా తప్పుడు పోస్టులు పెట్టారని మండిపడ్డారు. తాను డిమాండ్ చేసిన రెండు గంటలకే చంద్రబాబు, లోకేష్ వణికిపోయి జీవో ఇచ్చారని జగన్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. "జగన్మోహన్ రెడ్డికి నిబద్ధత ఉంటే, ప్రధాని మోదీకి 40గంటల సమయం ఇచ్చి అల్టిమేటం జారీచేయాలి. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి టెట్ రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని కూలదోస్తానని హెచ్చరించాలని రాంగోపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయులు, ఉద్యోగుల పట్ల స్నేహపూర్వక అభిమానం ఉందని.. గతంలో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా 43%ఫిట్మెంట్ ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని, అదే జగన్ 27% ఉన్న ఐఆర్‌ను 23%కి తగ్గించిన చరిత్ర హీనుడని ధ్వజమెత్తారు. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని మాట తప్పిన దద్దమ్మ జగన్ అని రాంగోపాల్ రెడ్డి విమర్శించారు.

## ఉద్యోగుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

2004కంటే ముందు నియామక పత్రాలు పొందిన 11వేల మంది ఉపాధ్యాయులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) వర్తింపజేస్తూ క్యాబినెట్‌లో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని ఎమ్మెల్సీ తెలిపారు. జగన్ ప్రభుత్వంలో రిటైర్ అయిన వారికి మూడేళ్లయినా బకాయిలు ఇవ్వని పరిస్థితి ఉంటే, నేడు కూటమి ప్రభుత్వం రిటైర్ అయిన రెండు నెలల్లోనే క్లియరెన్స్ ఇస్తోందన్నారు. జగన్ దిగిపోయేనాటికి పెట్టిన రూ.30,000కోట్ల బకాయిలలోఇప్పటికే రూ.25,000 కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీ, వివిధ కార్పొరేషన్ల ఉద్యోగుల వయోపరిమితిని 60 నుండి 62 ఏళ్లకు పెంచిన ఘనత తమదేనన్నారు.

## అధికారులను ప్రలోభపెట్టి.. ఐఏఎస్‌లను ఇరికించి శునకానందం

గత ప్రభుత్వ హయాంలో భూములు నకిలీ పారిశ్రామికవేత్తలకు పంపిణీ చేసిన వ్యవహారంలో, లిక్కర్ స్కామ్‌లో అనేకమంది అధికారులను ప్రలోభపెట్టారని రాంగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. తమకు నచ్చని వారిపై సీబీ-సీఐడీ విచారణలు, ఏసీబీ దాడులంటూ తీవ్ర వేధింపులకు గురిచేశారన్నారు. ఈ వేధింపుల ఫలితంగానే లిక్కర్ స్కామ్, రఘురామకృష్ణంరాజుని వేధించిన కేసు, భూముల కుంభకోణాల్లో అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇరుక్కుపోయారని.. వారిని ఇరికించి జగన్ శునకానందం పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే ఖచ్చితంగా శిక్షలు పడాల్సిందేనని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఇది ప్రభుత్వ దృఢమైన భావన అని రాంగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయులను వేధించిన జగన్

కరోనా కష్టకాలంలో మద్యం షాపుల దగ్గర క్యూలైన్లు నియంత్రించడానికి ఉపాధ్యాయులను జగన్ విధుల్లో పెట్టారని, ఆ సమయంలో వందలాది మంది టీచర్లు కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. వారి కుటుంబ సభ్యులు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని కోరితే, ఉపాధ్యాయులపై ఉన్న కక్షతో ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వకుండా జగన్ వేధించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన కారుణ్య నియామకాలన్నింటినీ భర్తీ చేస్తోందని ప్రకటించారు. గత ప్రభుత్వంలో ప్రవీణ్ ప్రకాష్ అనే ఐఏఎస్ అధికారిని అడ్డం పెట్టుకుని ఉపాధ్యాయులను ఎంత అవమానకరంగా వేధించారో రాష్ట్రమంతా చూసిందన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు స్వేచ్ఛా వాతావరణం

గతంలో పీఆర్సీ ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని విజయవాడ ధర్నా చౌక్‌కు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలపడానికి వచ్చిన ఉపాధ్యాయులను ఫ్యాక్షనిస్టుల లాగా చూశారని మండిపడ్డారు. ఉపాధ్యాయ, ఉద్యోగ నాయకుల ఇళ్ల ముందు పోలీసులను పెట్టి, బైండోవర్ కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేసి వేధించారన్నారు. కూటమి ప్రభుత్వంవచ్చాక ఆ అక్రమ కేసులన్నింటినీ సమీక్షించి పూర్తిగా తొలగిస్తున్నామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగనంత వరకు ఈ రాష్ట్రంలో ఎవరికైనా స్వేచ్ఛగా నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. ఈ రెండు సంవత్సరాలలోనే ఏడు ఎనిమిది సార్లు ఉద్యోగ సంఘాలు, జేఏసీలతో మంత్రులు, ముఖ్యమంత్రి సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను సానుకూలంగా విన్నారని తెలిపారు. మిగిలిన సమస్యలను కూడా ప్రభుత్వం సానుభూతితో పరిశీలిస్తోందని, ఉద్యోగుల శ్రేయస్సు కోసమే ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## హోం గార్డులపై పేర్ని నాని వ్యాఖ్యలు అహంకారపూరితం

మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలను రాంగోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హోం గార్డుల జీవితాలు 'గొర్రెపిల్ల తోక' లాగే ఉంటాయంటూ పేర్ని నాని మాట్లాడటం వారిని అవమానించడమేనన్నారు. నాని ఒక బియ్యం దొంగ అయితే, ఆయన నాయకుడు జగన్ ఒక గజదొంగ, ఖూనీకోరు అని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ని కానిస్టేబుల్ కొడుకు అని, మంత్రి లోకేష్‌ని లోకేష్ నాయుడు అని వెక్కిరిస్తున్న పేర్ని నాని ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. కానిస్టేబుల్ కొడుకు ఉన్నత స్థానానికి రాకూడదా అని ప్రశ్నించారు. 2014-19 మధ్య హోం గార్డుల జీతాన్ని రూ.300 నుండి రూ.600 లకు పెంచింది టీడీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

## హోం గార్డులకు సామాజిక భద్రత కల్పించాం

మహిళా హోం గార్డులకు మూడు నెలల ప్రసూతి సెలవులు, రూ.30 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా కల్పించిన నిబద్ధత చంద్రబాబుదేనని ఎమ్మెల్సీ కొనియాడారు. విధినిర్వహణలో సాధారణ మరణం పొందినా హోం గార్డుల కుటుంబాలకు పోలీస్‌శాఖ ద్వారా రూ.5లక్షల సహాయంఅందిస్తున్నామని,వారు కట్టాల్సిన ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు. 2012తర్వాత హోం గార్డుల నియా మకాలే జరగలేదన్న పేర్ని నాని మాటలు అబద్ధమని, జగన్ పాదయాత్రలో పాల్గొన్న 112 మందికి కడప జిల్లాలో అక్రమంగా హోం గార్డు ఉద్యో గాలు ఇచ్చినవిషయం వాస్తవంకాదా అని ప్రశ్నించారు. వేమన పద్యం "తప్పులెన్నువారు తండోప తండంబులు.." అన్నట్లు జగన్, పేర్ని నానిలు తమ తప్పులు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఇన్ సర్వీస్ టీచర్లకు 2028వరకు సమయం ఉన్నందున, రెండు మూడు స్పెషల్ టెట్లు నిర్వహించి అందరికీ న్యాయంచేస్తామని, ఉపాధ్యాయు లెవరూ జగన్ దుష్ప్ర చారాన్ని నమ్మవద్దని రాంగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# భూ కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

- వైసీపీ నేతల భూ ఆక్రమణ యత్నం
- వాటర్ ట్యాంక్‌కు స్థలమిస్తే.. మిగిలిన భూమినీ ఆక్రమించేశారు
- 21 ఏళ్లుగా సాగులో ఉన్న డీకేటీ భూమిపై దౌర్జన్యం
- సరిహద్దు రాళ్లు పీకేసి భూమి కబ్జా.. ఎదురు తిరిగితే చంపుతామంటూ బెదిరింపులు
- న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి అశోక్ బాబు



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్రకార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలు విన్నవించుకు న్నారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై సాధికారత శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్సీ,టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

పూర్వీకుల నుంచి సంక్రమించిన తమ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన మురహరిరావు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో తమకి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన స్థలం ఉంది. ఆస్థలంలో కొంత భాగాన్ని గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం ఇచ్చాం. వాటర్ ట్యాంక్ పోను మిగిలిన ఖాళీ స్థలం తమ ఆధీనంలోనే ఉండేది. అయితే, ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు కలిసి తమ స్థలంలో ఉన్న సరిహద్దులను ధ్వంసం చేశారు. అంతేకాకుండా, వాటర్ ట్యాంక్ పక్కనే ఉన్న తమ మిగతా ఖాళీస్థలాన్ని కూడా బలవంతంగా ఆక్రమించు కుని చుట్టూ గోడ కట్టేశారు. ఈ అక్రమ నిర్మాణంపై, భూ ఆక్రమణపై నిలదీయడానికి వెళ్లిన తనని సదరు వ్యక్తులు తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేస్తూ, బెది రింపులకు పాల్పడుతున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించుకు నేందుకు ప్రయత్నిస్తున్నారని నంద్యాలజిల్లా మూల సాగరం గ్రామానికి చెందిన నాగార్జున విన్నవించు కున్నారు. గ్రామంలో సర్వే నంబర్లు 635/4, 637/5, 639/4 లలో తమకి 1.95 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని కొందరు వైసీపీ నాయకులు అక్రమంగా స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఈ భూమిని దేవాదాయశాఖ పరిధిలోకి చేర్చి రక్షణ కల్పించాల్సిందిగా గతంలో ఉన్నతాధికారులను ఆశ్ర యించాం. ఈ భూమికి సంబంధించి ఎన్‌ఓసి ఇచ్చే ప్రక్రియలో భాగంగా, ఇది 'పి.కె.ఆర్ ఇనామ్' భూమి అవునా కాదా అనే అంశంపై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, రెవెన్యూశాఖల మధ్య సంప్రదిం పులు కూడా జరిగాయి. ఆలయ రికార్డులు, పాత రిజిస్టర్ల ప్రకారం ఆధారాలు ఉన్నప్పటికీ... సదరు విచారణాధికారి ప్రత్యర్థులకు అనుకూలంగా వ్యవహ రిస్తూ, తప్పుడు నివేదిక ఇచ్చారు. రికార్డులను పక్కన బెట్టి అక్రమార్కులకు లబ్ధిచేకూర్చేలా ఈ నివేదికను తయారు చేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామానికి చెందిన చాగంటి కుమారి విజ్ఞప్తి చేశారు. తనకు ముండ్లమూరు మండలం పసుపుగల్లు గ్రామం సర్వే నెం. 318/7 లో ఎ.1-00 భూమి ఉంది. 2005లో ప్రభుత్వ పంపిణీచేసిన డి.కె.టి పట్టా కింద మంజూరైన ఈ భూమిని గత 21సంవత్సరాలుగా తమ కుటుంబం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డులలో కూడా స్పష్టంగా తన పేరే నమోదై ఉంది. అయితే, పక్క పొలానికి చెందిన వ్యక్తి దౌర్జన్యంగా భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో తనను, తన తల్లిదండ్రులను సదరు వ్యక్తి కొట్టడానికి వచ్చి తీవ్రమైన బెదిరింపులకు దిగాడు. దీనిపై స్థానిక ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. పోలీసుల విజ్ఞప్తి మేరకు ముండ్లమూరు తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విలేజ్ రెవెన్యూ అధికారితో క్షేత్రస్థాయి విచారణ జరిపించారు. ఈ విచారణలో సదరు ఒక ఎకరం భూమి పూర్తిగా తన స్వాధీనంలోనే ఉందని, రికార్డుల ప్రకారం అది తమదేనని స్పష్టమైంది. అయితే సదరు వ్యక్తి ప్రభుత్వ ఉత్తర్వులను కానీ, చట్టాన్ని కానీ లెక్కచేయకుండా, పొలంలోకి వస్తే రౌడీలతో చంపేస్తానని దౌర్జన్యం చేస్తున్నాడు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

సరిహద్దు రాళ్లను ధ్వంసం చేసి తమ భూమిని దౌర్జన్యంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం దొన్నికోట గ్రామానికి చెందిన ఉతప్ప విజ్ఞప్తి చేశారు. తమ గ్రామ పరిధిలో తనకు 3.18సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. అయితే, ఇదే ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి దౌర్జన్యంగా తన భూమి సరిహద్దు రాళ్లను, గుర్తు లను అక్రమంగా పీకివేసి, ఆ భూమిని పూర్తిగా కబ్జా చేశారు. తమ భూమిని తమకు వదిలిపెట్టాలని కోరి నందుకు తనని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈ భూకబ్జా, దౌర్జన్యంపై స్థానిక తహశీల్దార్‌కి ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకో లేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఇద్దరి పేరుమీద నమోదయి ఉన్న భూమి మొత్తాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకుని వేరే వ్యక్తికి కౌలుకు ఇచ్చిన తనను అన్యాయం చేస్తున్న భాగస్వామిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట గ్రామానికి చెందిన తమ్మినీడి దొరయ్య విజ్ఞప్తి చేశారు. తనతో పాటు మరొకరి పేరు మీద ఉన్న భూమి మొత్తాన్ని సదరు వ్యక్తి ఒక్కరే దౌర్జకయంగా సొంతంచేసుకున్నారని తెలిపారు. దీనిపై ఆర్టీఐ చట్టం ద్వారా ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనల ను, జరిగిన మోసాన్ని రుజువు చేసే స్పష్టమైన ఆధారా లున్నాయి. ఈ అన్యాయంపై గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాను. అధికారులు కూడా నిందితుడికే కొమ్ముకాస్తున్నారు. తగిన చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

భూమి సర్వే నివేదిక ఇవ్వకుండా తిప్పుకుంటున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయా లని బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన ఐ.శివలక్ష్మి అభ్యర్థించారు. భట్టిప్రోలు మండలం పెద్దపులివర్రు రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 478-2 లో ఉన్న తమ భూమిని కొలవడానికి 09-06-2026న డివిజనల్ సర్వేయర్ క్షేత్రస్థాయి పరిశీలన చేసి కొలతలు తీసుకున్నారు. అయితే సర్వే జరిగి ఒక నెల కావస్తున్నా, ఇప్పటివరకు ఆ కొలతలకు సంబంధించిన ఎటువంటి అధికారిక సమాచారాన్ని గానీ, నివేదికను గానీ తమకి అందజేయలేదు. ఈ అర్జీ పరిష్కారానికి గడువు తేదీ 26-06-2026తో ముగిసిపోవాల్సి ఉండ గా నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో గడువును పొడిగించుకున్నారు. ఈ సమస్యపై రేపల్లెలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి టి. గంగాధర్ గౌడ్‌ని కలిసి ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి బాపట్ల ఏడీని, సర్వేయర్‌ను పిలిచి వివరణ కోరారు. ఆ సమయంలో... జూన్ 29న బాపట్ల కలెక్టరేట్‌లోని తన కార్యాలయానికి వస్తే నివేదిక ఇస్తానని సర్వేయర్ దుర్గారావు డీఆర్వో సమక్షంలోనే హామీ ఇచ్చారు. తీరా జూన్ 29న బాపట్ల కలెక్టరేట్ ఆఫీసుకు వెళ్లగా, "రిపోర్టు ఇంకా తయారు కాలేదు, భట్టిప్రోలు మండల సర్వేయర్ నుండి మరికొంత సమాచారం రావాల్సిఉంది, రెండు రోజుల్లో ఫోన్ చేసి పిలుస్తాం" అని చెప్పి పంపించేశారు. కానీ నేటికీ అధికారుల నుండి ఎటువంటి సమాధానం రాలేదు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తనకు చెందిన రెండు బంగారు ఉంగరాలు దొంగి లించిన వ్యక్తిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఏలూరుకు చెందిన తగరం నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. అనారోగ్య కారణాల వల్ల ఈఏడాది ఫిబ్రవరి 2 నుండి మార్చి 25 వరకు చాట్రాయి మండ లం చీపురుగూడెం పంచాయితీ పరిధిలోని మరిబంధం గ్రామంలోని తన పెదనాన్న కుమారుడు తగరం సోమయ్య ఇంట్లో ఆశ్రయం పొందాను. ఆ సమ యంలో నేను నివాసముంటున్న గదిలోనే మరో వ్యక్తి కూడా ఉన్నాడు. ఈ క్రమంలో తనకు చెందిన రెండు విలువైన బంగారు ఉంగరాలను సదరు వ్యక్తి దొంగి లించాడు. బంగారు ఉంగరాల దొంగతనంపై 17-02-2026న చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో అధికారికం గా ఫిర్యాదు చేశాను. అక్కడ ఫలితం లేకపోవడంతో నేరుగా ఏలూరు జిల్లా ఎస్పీని కలిసి గ్రీవెన్స్ సెల్ ద్వారా రెండుసార్లు దరఖాస్తులు సమర్పించాను. అయి నప్పటికీ, నేటివరకు పోలీసుల నుండి ఎలాంటి పురోగతి లేదు. తనకు న్యాయం చేయాలని కోరారు.

సర్వే కొలతల ప్రకారం తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో సరిచేయాలని తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని, తనకు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన వాసా సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ధూపాడు గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 454-ఏలో 4.09 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిపై గతంలో జిల్లా సర్వేయర్ క్షేత్రస్థాయి పరిశీలన జరిపి కొలతలు వేశారు. సర్వేయర్ కొలతల ప్రకారం సదరు భూమి సబ్-డివిజన్ల వారీగా సర్వే నెం. 454-ఏ లో 0.99 సెంట్లు, సర్వే నెం. 454-బీలో 3.08 సెంట్లు... మొత్తంగా 4.07 సెంట్లు ఉన్నట్లు అధికారికంగా తేలింది. అయితే, ఈ కొలతల ప్రకారం భూమి వివరాలను ఆన్‌లైన్ రికార్డులలో సరి చేసి నమోదు చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆశ్రయించాను. కానీ, క్షేత్రస్థాయి నివేదికలు స్పష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక అధికారులు పాత రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకురావాలంటూ ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయకుండా తనను చుట్టూ తిప్పుతూ తీవ్ర ఇబ్బంది లకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు.అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.





# వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) తయారుచేసిన మాస్టర్ ప్లాన్-2041ను ఆమోదిస్తూ దానిని అమలులోకి తీసుకువస్తున్నట్టు పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ జీఓ జారీచేసింది. వాస్తవానికి ఈ మాస్టర్ ప్లాన్ వైసీపీ హయాంలోనే తయారైంది. ఆ పార్టీ నాయకులకు లబ్ధి కలిగే విధంగా రూపొందించారని ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక దానిపై అభ్యంతరాలు ఆహ్వానించింది. దఫదఫాలుగా జరిగిన ఈ ప్రక్రియలో ఆమోదించదగిన అభ్యంతరాలను స్వీకరించి, మిగిలిన వాటిని పక్కన పెట్టి కొత్త మాస్టర్‌ప్లాన్ తయారు చేశారు. దీనిని కూడా ప్రజలకు అందుబాటులో ఉంచి అభ్యంతరాలు స్వీకరించి, తుది ఆమోదముద్ర వేశారు. ఈ ప్రక్రియలో కొత్తగా కేంద్రం నీతి ఆయోగ్ ద్వారా ప్రతిపాదించిన విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌ను కూడా మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. దానిని దృష్టిలో ఉంచుకొని ఏ ప్రాంతంలో ఏ విధమైన అభివృద్ధి చేయాలో నిర్ణయించారు.

# రైతులకు భారీ లబ్ధి - నిషేధిత భూముల జాబితా నుంచి 2074 ఎకరాలకు విముక్తి



నంద్యాల జిల్లా (చైతన్యరథం): బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామంలోని 2074 ఎకరాలను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైఎస్సార్సీపీ హయాంలో ఇబ్బందిపడిన రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలిచింది. మొత్తం 142 సర్వే నంబర్లకు చెందిన భూముల్ని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సుమారు వెయ్యిమంది రైతులకు భారీ లబ్ధి చేకూరింది. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామంలోని 2074.59 ఎకరాలను వక్ఫ్ బోర్డు నుంచి లేఖ వచ్చిందంటూ అప్పట్లో అధికారులు ఏకపక్షంగా నిషేధిత భూముల జాబితాలోకి చేర్చారు. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుటుంబ అవసరాలకు వీలుగా క్రయ విక్రయాలు చేయడానికి, కనీసం రుణం తీసుకోవడానికీ వారికి అవకాశం లేకుండా పోయింది. చివరకు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కూడా అందక తీవ్రంగా నష్టపోయారు. భూములు సాక్షాత్తూ నాడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో చక్రం తిప్పిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. పైపెచ్చు ఆయన సొంత మండలం కూడా బేతంచెర్లే. దీంతో ఆయనకు మొర పెట్టుకున్నా నమ్మకం పెట్టుకుని ఎదురుచూసినా పట్టించుకోలేదు. నిషేధిత జాబితా నుంచి తొలగింపు: కూటమి ప్రభుత్వం వచ్చాక తమ సమస్యను రైతులు మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వాస్తవాన్ని తేల్చాలని ఆయన జిల్లా కలెక్టర్, వక్ఫ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్, గ్రామ సర్వీస్ ఈనాం రిజిస్టర్, రీ సర్వే అండ్ రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్, వక్ఫ్ సర్వే కమిషనర్‌లు పరిశీలించి నిషేధిత జాబితాలో కొనసాగించాల్సిన అవసరం లేదని నివేదించారు. దీంతో ఆ జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. గూటుపల్లి గ్రామంలో మరో 613.84 ఎకరాలకు సంబంధించిన 74 సర్వే నంబర్లపైనా ఇదే వివాదం నడుస్తోంది. వాటిని మరింతగా పరిశీలించాల్సిన అవసరముందంటూ నిషేధిత జాబితాలోనే ఉంచాలని బోర్డు తీర్మానం చేసి నివేదించింది. అవి 22ఏలోనే కొనసాగనున్నాయి. ఇవే కాకుండా దేవదాయశాఖకు చెందిన భూములు ఆ శాఖ ఆస్తులుగానే 22ఏ లో కొనసాగుతాయని కలెక్టర్ నివేదించారు.

## 11,12 తేదిల్లో సర్ స్పెషల్ క్యాంపెయిన్ : విజయనగరం జిల్లా కలెక్టర్



విజయనగరం (చైతన్యరథం): ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 2002, 2025 ఓటర్ల జాబితాలను అనుసంధానించే క్రమంలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా డిజిటలైజేషన్ పురోగతి 63.93 శాతంగా ఉందని, జూలై 21న జరగనున్న ముసాయిదా ప్రచురణను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జూలై 11, 12 తేదీల్లో (శని,ఆదివారాలు) స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. శిబిరాల్లో పాల్గొనే బీఎల్వోలకు తగిన సాంకేతిక సహకారాన్ని అందించడంతో పాటు, గంటల వారీగా పురోగతిని సమీక్షించి ఏ ఒక్క ఫారం కూడా పెండింగ్లో లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ పనుల పట్ల ఎటువంటి నిర్లక్ష్యం వహించినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# వైద్య సేవలపై ఆరా తీసిన ఎమ్మెల్యే యనమల దివ్య



తుని (చైతన్యరథం): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు కెనరా బ్యాంకు సహకారంతో సుమారు రూ.30 లక్షలతో సమకూర్చిన వైద్య సామగ్రిని ఎమ్మెల్యే యనమల దివ్య, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. ఆర్థో విభాగానికి సంబంధించి ఫిజియోథెరఫీ, వివిధ రకాల పరికరాలు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఆయా వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఇబ్బందులపై ఆరా తీశారు. ఆసుపత్రిలో నూతనంగా అత్యాధునిక ల్యాబ్ అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. 100 పడకల ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయడానికి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందించామని, త్వరలోనే అప్గ్రేడ్ అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. దీంతో రోగులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం టౌన్ యూనిట్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు మరియు పెన్షనర్ల డిమాండ్లపై గురువారం పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ చంద్రకి వినతిపత్రం సమర్పించారు. పార్వతీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ జి.వి.ఆర్.ఎస్. కిషోర్, పార్వతీపురం టౌన్ చైర్మన్ సువ్వాడ దుర్గా ప్రసాద్ల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఉద్యోగుల సుదీర్ఘకాల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిల చెల్లింపు, మహిళా ఉద్యోగుల చైల్డ్ కేర్ లీవ్ వయోపరిమితి తొలగింపు, గురుకులాలు, సొసైటీల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు, మెమో 57 ప్రకారం 11 వేల మంది సిపిఎస్ ఉద్యోగులను ఓపిఎస్ పరిధిలోకి తీసుకురావడం వంటి సానుకూల నిర్ణయాలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కొత్త పీఆర్సీ కమిషన్ వేయడం, పీఆర్సీ అమలు, ఐఆర్ ప్రకటనతో పాటు నాలుగు బకాయి డీఏలు, సరెండర్ లీవ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. పెన్షనర్లకు గత ప్రభుత్వం తగ్గించిన ఎడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

**సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే:**

ఉద్యోగ సంఘాల వినతిపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సానుకూలంగా స్పందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతుగా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, కో-చైర్మన్ కె.రంగారావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సుర్ల మురళీమోహన్, పిఆర్టియు రాష్ట్ర నాయకులు, అమరాపు సూర్యనారాయణ ఏపిటిఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గూగుల్ సహకారంతో గ్రామాల్లో నీటి సంరక్షణకు అధ్యయనం



ఆనందపురం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంపొందించి తాగునీటి లభ్యతను మెరుగుపరచాలనే లక్ష్యంతో చెన్నైకి చెందిన స్పాంజ్ కొలాబరేటివ్ సంస్థ గూగుల్ సహకారంతో అధ్యయనం చేపట్టింది. ఆనందపురం మండలంలోని తర్లువాడ, సొంత్యం, ఆనందపురం, గిడిజాల, గంభీరం గ్రామపంచాయతీల్లో మూడు రోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధ్యయనం ముగింపులో గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై స్థానిక అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ వాటర్షెడ్ మేనేజ్మెంట్లో భాగంగా కాంటూర్ ట్రెంచ్లు, స్టోన్ బండింగ్, ఫార్మ్ పాండ్లు, రీఛార్జ్ బావులు, చెరువుల పూడికతీత, అనుసంధాన కాలువల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఆనందపురంలో 9, సొంత్యంలో 5, గిడిజాలలో 7, తర్లువాడలో 7 చెరువులతో పాటు గంభీరం రిజర్వాయర్ను ఎంపిక చేశారు. సమగ్ర నివేదికను గూగుల్కు సమర్పించిన అనంతరం నవనిర్మాణ సమితి, అంబుజా ఫౌండేషన్ సహకారంతో పనులు చేపట్టనున్నట్లు స్పాంజ్ కొలాబరేటివ్ డైరెక్టర్ ప్రవీణ్ రాజ్, అసోసియేట్ అర్బన్ డిజైనర్ ఆదిత్య హజారే తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో జానకి, ఉప ఎంపీడీవో సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు

అమరావతి (చైతన్యరథం): దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించాయి. ఉత్తర అరేబియా సముద్రం, రాజస్థాన్, హర్యానా, పంజాబ్‌లోని మిగిలిన ప్రాంతాలకు కూడా జూలై 9 నాటికి రుతుపవనాలు చేరుకున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథకుమార్ తెలిపారు. సాధారణంగా జూలై 8 నాటికి దేశమంతటా విస్తరించే నైరుతి రుతుపవనాలు ఈసారి ఒక రోజు ఆలస్యంగా దేశవ్యాప్తంగా విస్తరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, యానాంపై దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశల నుంచి గాలులు వీస్తున్నాయని చెప్పారు. ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో జూలై 10న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపింది.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## ఆగిరిపల్లిలో అభివృద్ధి పనులకు మంత్రి కొలుసు పార్థసారథి శంకుస్థాపన



నూజివీడు (చైతన్యరథం): నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజలు నిర్వహించి, శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రూ.27 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి పక్కన నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆగిరిపల్లి మార్కెట్ యార్డు ఆవరణలో రూ.24 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రైతు బజార్ దుకాణాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు.

## రైతుల్లో భరోసా కలిగించేలా కొత్త పాస్ పుస్తకాలు

### • గోపాలపురంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పంపిణీ



గోపాలపురం (చైతన్యరథం): రైతుల్లో నమ్మకం, భరోసా కలిగించేలా కొత్త పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వ్యాఖ్యానించారు. గురువారం ద్వారకాతిరుమల మండలం, కొమ్మర గ్రామంలో అర్హులైన రైతులకు పట్టా పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. రైతులకు భూ హక్కుల భద్రత కల్పిస్తూ, ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతుల్లో నమ్మకం, భరోసా .. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్దాలి. కొత్త పాస్ పుస్తకాలను ముద్రించే ముందుగానే గ్రామసభల్లో ఆయా రైతుల నుంచి భూ వివరాలు నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే కొత్త పాస్ పుస్తకాలను ముద్రించాలి. రికార్డులను తారుమారు చేయడానికి ఆస్కారం లేని విధంగా కొత్త పాస్ పుస్తకాలను తీర్చిదిద్దామని, ఎవ్వరూ ట్యాంపర్ చేయకుండా, నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేయకుండా పాస్ పుస్తకాలను ముద్రించడం జరుగుతుందన్నారు. పాస్ పుస్తకాల ముద్రణలో ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తలను రైతులకు అర్థమయ్యేలా చెప్పాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

### •పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



పెడన (చైతన్యరథం): నియోజకవర్గం మండలం ముచ్చిలిగుంట గ్రామంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సరి చేస్తుంది. రీ-సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించటంతో పాటు రాజముద్రతో అందించే పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు భరోసా కలిగిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రీ-సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భవిష్యత్లో రైతులు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు ఈ పాసు పుస్తకాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. గత పాలకులు వ్యవస్థలను ఎలా నాశనం చేశారో అందరికీ తెలుసన్నారు. ప్రజల ఆస్తులపై మహాత్మా గాంధీ మాదిరిగా జగన్ ఆయన ఫోటోలను ముద్రించుకొని, ప్రజాధనంతో పబ్లిసిటీ చేసుకున్నారని మండిపడ్డారు. భూ యజమానుల ఫోటోలతో కూడిన పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులు ఎంతో ఆనందంగా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు.

## విజయవాడలో మూడో అంతర్జాతీయ తెలుగు రచయితల మహాసభలు

విజయవాడ (చైతన్యరథం): మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా జులై 11, 12 తేదీలలో విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో మూడో అంతర్జాతీయ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ మహాసభల గౌరవ అధ్యక్షులు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. కేబీఎన్ కళాశాలలో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెయ్యి మంది రచయితలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ఈ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నట్టు వివరించారు. ఈ సభలు స్త్రీ సాధికారతకు, మానవ విలువలు కాపాడేందుకు సమాజాన్ని జాగృతం చేసేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

## వేస్ట్ పిక్కర్స్ గౌరవప్రదంగా జీవించేందుకు చర్యలు : కొమ్మారెడ్డి పట్టాభిరాం



గుంటూరు (చైతన్యరథం): వేస్ట్ పిక్కర్స్(వ్యర్థాలను సేకరించేవారు) సమాజంలో గౌరవప్రదంగా జీవించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. గుంటూరులోని దళిత బహుజన రీసోర్స్ సెంటర్(డీబీఆర్సీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వేస్ట్ పిక్కర్స్తో గురువారం ఆయన ముఖాముఖి మాట్లాడారు. వ్యర్థాల సేకరణ, వాటి అమ్మకాలు, ఒక రోజుకు వచ్చే ఆదాయం, రోజువారీ ఎదురయ్యే సమస్యలు వారిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ బాటిల్స్, అట్టలు, న్యూస్ పేపర్, పాత ఇనుము వంటి వాటికి వ్యాపారులు తగిన ధర ఇవ్వడంలేదని వేస్ట్ పిక్కర్స్ చెప్పారు. వర్షా కాలంలో ధరలు మరీ తక్కువగా ఇస్తారన్నారు. ఉదయాన్నే లేచి ఖాళీ వాటర్ బాటిళ్లు, పేపర్లు ఏరుకునేవారు ఎంతమంది? ఆధార్ కార్డులు ఎంతమందికి ఉన్నాయి? బ్యాంక్ అకౌంట్ ఎంతమందికి ఉంది?.. వంటి వివరాలను పట్టాభిరామ్ వేస్ట్ పిక్కర్స్ని అడిగి తెలుసుకున్నారు.

వేస్ట్ పిక్కర్స్ సేకరించే వ్యర్థాలకు వారికి వచ్చే ధర, ఆ వ్యర్థాలు రీసైక్లింగ్ కేంద్రాలకు వెళ్లే సరికి నాలుగు రెట్లు పెరుగుతుందని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. మధ్యలో దళారులు లేకుండా వారికి ఎక్కువ ధర వచ్చే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎన్యూమరేషన్ చేసి, వారి జీవన విధానం మెరుగుపరిచి, తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. అదేవిధంగా, వారు సేకరించే వ్యర్థాలను మంచి రేటుకు కొనుగోలు చేయడం ద్వారా వారి ఆదాయం పెంచే ఏర్పాట్లు చేస్తామన్నారు. నమస్తే స్కీమ్ ద్వారా వారందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చర్యలు తీసుకుంటుందని పట్టాభిరామ్ చెప్పారు. వారికి హెల్త్ ఇన్సూరెన్స్.. వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వేస్ట్ పిక్కర్స్ ఆధ్వర్యంలో త్వరలో స్టాక్ పాయింట్స్ ఏర్పాటు చేసి, వాటిని రీసైక్లింగ్ పరిశ్రమలతో అనుసంధానం చేస్తామని పట్టాభిరామ్ చెప్పారు.

చెత్త ప్రాసెసింగ్లో చెత్త సేకరించేవారికి అధిక లబ్ది చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవమానకరంగా చూసే పరిస్థితుల నుంచి వారు గౌరవంగా జీవించే విధంగా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని చెప్పారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాల తరహాలో వేస్ట్ పిక్కర్స్ గ్రూపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ గ్రూపుల ద్వారా రుణాలు అందజేసి, వారికి వాహనాలు సమకూర్చే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. చెత్త సేకరణ వ్యవస్థని మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేస్తుందన్నారు.

## గన్నవరంకు గత వైభవం తీసుకురావడమే నా లక్ష్యం : ఎమ్మెల్యే యార్లగడ్డ




గన్నవరం (చైతన్యరథం): గన్నవరంకు గత వైభవం తీసుకువస్తానని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఎయిర్పోర్ట్ అడ్వైజరీ కమిటీ కమిటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను ఎప్పుడూ ప్రైవేట్ పంచాయతీలు, సివిల్ సెటిల్మెంట్లు చేయలేదని... భూముల వ్యవహారాల్లో ఎలాంటి జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. గత 12 సంవత్సరాలుగా రైతులకు ఉచితంగా మట్టి ఇవ్వని పరిస్థితిని మార్చి, ఇప్పుడు ఉచితంగా మట్టి అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ అక్రమాలు, రికార్డుల తారుమారు, భూదోపిడీ జరిగిన అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించి విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. మాజీ ఎమ్మార్వోలు నరసింహారావు, మాధురి హయాంలో జరిగిన వ్యవహారాలపై కూడా విచారణ జరగాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. మర్లపాలెం ప్రాంత రైతుల భూములు 22-ఏ జాబితాలో చేరడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని సరిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత వైసిపి ప్రభుత్వంలో అనేక భూ సమస్యలు ఏర్పడ్డాయని, ప్రస్తుతం డబ్బు ఇచ్చే వారు కూడా వెనుకడుగు వేస్తున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. సేల్ డీడ్ చేసిన తర్వాత భూములు తిరిగి ఇవ్వని ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. భూ తాకట్టు వ్యవహారాలను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని రెవెన్యూ మంత్రిని, ముఖ్యమంత్రిని అసెంబ్లీ వేదికగా కోరినట్లు తెలిపారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ భూముల వివాదాలు, ప్రైవేట్ పంచాయతీలు, సెటిల్మెంట్లలో జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. గతంలో జరిగిన విధంగా పనికిమాలిన రాజకీయాలు, వ్యక్తిగత సెటిల్మెంట్లు తన హయాంలో ఉండవని, గన్నవరం నియోజకవర్గంలో అలాంటి వ్యవహారాలకు తావు ఉండదని యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు.

## ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండండి : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): ప్రజలకు క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో పరిశీలించి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో కూటమి అబ్జర్వర్లు, క్లస్టర్ ఇన్చార్జులుతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్ని డివిజన్లలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉంటుందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలను గమనించి అక్కడ ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్ల వరకు వెచ్చించినట్లు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల నాణ్యత, పారదర్శకతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రజలకు ఏ చిన్న అవసరం వచ్చినా తమ కార్యాలయాన్ని ఎప్పుడైనా సంప్రదించవచ్చని సూచించారు. కూటమి నాయకులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమానికి కొద్దిరోజులు మాత్రమే గడువు ఉందని, దీనికి సంబంధించి బీఎల్వోలకు కూటమి నాయకులు సహకారం అందించాలని సూచించారు.

# రామ రాజ్యనగర్ నివాసితులకు ఎంపీ కేశినేని శివనాథ్ భరోసా

**●గత వైసీపీ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు తీసుకుని ఇబ్బందుల్లో పడ్డామంటున్నా రామరాజ్య నగర్ వాసులు**

**● రైల్వే స్థలంలో స్థలాలు ఇచ్చి ఎటూ కాకుండా చేశారంటూ ఆవేదన... న్యాయం చేస్తానని వెల్లడి**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఎంపీ కార్యాలయానికి రామరాజ్యనగర్‌కు చెందిన 400 కుటుంబాల నివాసితులు ఎంపీ కేశినేని శివనాథ్‌తో భేటీ అయ్యారు. గత వైసీపీ హయాంలో రైల్వే స్థలంలో ఇళ్లపట్టాలి కేటాయించారని మరొక రెండు నెలల్లో రైల్వే అధికారులు ఆ స్థలాలలో నుండి ఇప్పుడు ఖాళీ చేయమంటున్నారని ఖాళీ చేయకపోతే పంపి వేస్తామని హెచ్చరిస్తున్నట్లు దిక్కుతోచని స్థితిలో ఎంపీ కార్యాలయానికి రావడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... గత వైసీపీ చేసిన తప్పిదం వల్ల ఇప్పుడు 400 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. రైల్వే స్థలమని తెలిసి అలాంటి చోట 400 కుటుంబాలకు వెళ్ళ పట్టాలు ఇచ్చి వారిని దిక్కుతోత్తని స్థితిలో వదిలేసారని, ఇప్పుడు రైల్వే అధికారులు వారిని ఖాళీ చేయమంటే ఎక్కడకు ఆ కుటుంబాలు వెళ్తాయని అన్నారు. జిల్లా కలెక్టర్‌తో జరిగే సమావేశంలో ఈ అంశాన్ని ప్రధానంగా లేవనెత్తి ఇచ్చిన స్థలాలు రద్దుచేసి వేరే చోట ఇచ్చే అవకాశం ఉంటే కనుక కచ్చితంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అందరి కుటుంబాలకు న్యాయం చేస్తానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావుతో కలసి ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టామని , జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉంచి సాధ్యమైనంత మేరకు కుటుంబాలన్నిటికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలియజేశారు. ఒకవేళ కలెక్టర్ ఆమోదించి మారిస్తే మంచి చోట ఇళ్ల పట్టాలి ఇప్పించి అన్ని విధాల సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేస్తానని భరోసానిచ్చారు. నిర్మాణ దశలో ఉన్న స్థలాలు వదిలి వెళ్ళమంటే ఎవరికైనా బాధగానే ఉంటుంది వైసీపీ ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు కు పాల్పడింది కాబట్టే ప్రజల ఆగ్రహానికి గురైందని ఎంపీ పేర్కొన్నారు.

# భాష్యం రామకృష్ణకు టీడీపీ సముచిత స్థానం కల్పించింది

**●చిలకలూరిపేట షిర్డీ సాయినాథునికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి, రాజ్యసభ సభ్యుడు భాష్యం ప్రత్యేక పూజలు**

**●సాయినాథునికి మొక్కులు చెల్లించుకున్న భాష్యం రామకృష్ణ**



చిలకలూరిపేట (చైతన్యరథం): నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ కలిగిన భాష్యం విద్యాసంస్థల అధినేత, భాష్యం రామకృష్ణను రాజ్యసభకు ఎంపిక చేయడం ద్వారా కూటమిప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విలువనిచ్చిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణతో కలిసి చిలకలూరిపేటలోని షిర్డీ సాయినాథుని మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఇరువురూ ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి, గురుపౌర్ణమి ప్రచార కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమాలు ముగిశాక ఎమ్మెల్యే, ఎంపీ విలేకరులతో మాట్లాడారు.

**రామకృష్ణ చేతల మనిషి : ప్రత్తిపాటి**

ప్రముఖ విద్యావేత్త భాష్యం రామకృష్ణను పెద్దల సభకు ఎంపిక చేయడం ద్వారా టీడీపీ సముచిత నిర్ణయం తీసుకుందని, ఆయన రాకతో పార్టీకి ప్రత్యేక గుర్తింపు, బలం చేకూరుతాయని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. రామకృష్ణ చేతల మనిషని, గతంలో తుపాను బాధితుల్ని ఆదుకోవడంలో ఆయనే తొలి అడుగు వేశారని ప్రత్తిపాటి చెప్పారు. తాను, రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కోటిరూపాయల ఆర్థిక సాయాన్ని తుపాను బాధితులకు అందించడం జరిగిందన్నారు. చిలకలూరిపేటపై రామకృష్ణకే ప్రత్యేక అభిమానముందని, ఇక్కడి ప్రజల్ని ఆయన తన మనుషులుగా చూస్తారని ప్రత్తిపాటి చెప్పారు.

**చిలకలూరిపేట ప్రజలతో నాకు ప్రత్యేక అనుబంధం : భాష్యం రామకృష్ణ**

రాజ్యసభకు ఎంపికైతే.. స్థానిక షిర్డీ సాయినాథుని మందిరంలో అన్నదానం చేయిస్తానని మొక్కుకున్నానని, నేడు ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి ఆ మొక్కు తీర్చుకున్నానని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గం, ప్రజలతో నాకు ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని, ఎంపీగా ఎన్నికయ్యాక నాలుగుసార్లు నియోజకవర్గానికి రావడం జరిగిందని రామకృష్ణ చెప్పారు. సాయినాథుని ఆశీస్సులతో ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరగాలని, అమరావతి, పోలవరం నిర్మాణాలు వేగంగా పూర్తై, చంద్రబాబు అభివృద్ధి ఫలాలు త్వరలోనే ప్రజలకు అందాలని రామకృష్ణ ఆకాంక్షించారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం : ఎమ్మెల్యే బొండా ఉమా

**●స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే మా బలం**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 30వ, డివిజన్ దేవినగర్ మొదటి లైన్ నందు నూతన డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పారదర్శకంగా, జవాబుదారీతనంతో పాలన అందిస్తోందని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ... 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం, సమస్యలను వెంటనే పరిష్కరించడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని... పార్టీ పదవులు అలంకారప్రాయమైనవి కావని, ప్రతి పదవీ ప్రజాసేవకు బాధ్యత అని, కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తున్నారని, సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరువవుతున్నామని, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదును ఎమ్మెల్యే కార్యాలయానికి, అవసరమైతే ఎంపీ కార్యాలయానికి పంపించి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని... ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతగా స్వీకరించి పరిష్కరిస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటివరకు సుమారు రూ. 15 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించి అనేక కుటుంబాలకు అండగా నిలిచామని అన్నారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్‌లలో బూత్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు

**●రూ.10.77 లక్షల విలువైన ఎల్ఓసీలు పంపిణీ**

**●మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**



మైలవరం (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో మందికి ప్రాణాధారంగా నిలుస్తోందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన ఐదు ఎల్ఓసీలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు దూరమయ్యే పరిస్థితి ఎవరికీ రాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి, ప్రతి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లికి చెందిన పంతగాని షాన్విత్‌కు రూ. 3,02,924, జక్కంపూడికి చెందిన జూనా సతీష్‌కు రూ. 75,000, చలపారెడ్డి ఆనంద్‌కు రూ. 1,00,000, కనిమెర్ల తండాకు చెందిన అజ్మీరా జ్యోతికి రూ. 2,00,000, దాములూరుకు చెందిన షైక్ కరీముల్లా బాజీకి రూ. 4,00,000 విలువైన ఎల్ఓసీలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అందజేశారు. మొత్తం ఐదుగురు లబ్ధిదారులకు రూ. 10,77,924ల విలువైన ఎల్ఓసీలు పంపిణీ చేశారు.ఎల్ఓసీలు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తమ వైద్య చికిత్సకు ఎంతో ఉపయోగపడే ఈ ఆర్థిక సహాయాన్ని అందించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి కుటుంబసభ్యులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో 72 అడుగుల పంచముఖ వరసిద్ధి మహాగణపతి



విజయవాడ (చైతన్యరథం) : విజయవాడ అసెంబ్లీ నియోజకవర్గం భవానిపురం సితార సెంటర్ ప్రాంతంలో డూండీ గణేష్ సేవ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు చేసే విధంగా భారీ వినాయక విగ్రహ ఏర్పాటు భూమి పూజ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు ఎంపీ కేశినేని చిన్ని ముఖ్య అతిథిగా పాల్గొని సాంప్రదాయపద్ధంగా భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ప్రతి ఏటా ఎకో ఫ్రెండ్లీ విధానంలో భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్న డూండీ గణేష్ సేవా సమితి వారికి ముందుగా అభినందనలు తెలియజేశారు. గతంలో భారీ గణేషుడి విగ్రహాన్ని చూడాలంటే హైదరాబాదులోని ఖైరతాబాద్ వరకు వెళ్లాల్సి వచ్చేదని గత ఆరు వార్షికోత్సవాల నుండి డూండీ గణేష్ సేవా సమితి వారు అత్యంత వైభవపేతంగా భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఎకో ఫ్రెండ్లీ విధానంతో విగ్రహ ఏర్పాటు విగ్రహ నిమజ్జన కార్యక్రమాలు అన్ని అందరికీ ఆదర్శవంతంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రతి ఇంట్లో మట్టి వినాయకుడిని ప్రతి ఒక్కరూ ప్రతిష్ట చేసుకొని వినాయకచవితి జరుపుకోవాలని ఎంపీ శివనాథ్ సూచించారు.

# నియోజకవర్గ పరిశీలకులతో జిల్లా పార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి సమీక్షా సమావేశం

కృష్ణజిల్లా (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆధ్వర్యంలో, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్యాలయంలో కృష్ణ జిల్లా నియోజకవర్గ పరిశీలకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో SIR (Special Intensive Revision) కార్యక్రమం, జిల్లా పార్టీ సంస్థాగత వ్యవహారాలు, My TDP యాప్ పనితీరు, SIRలో బలహీనంగా ఉన్న మండలాల పరిస్థితి, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల అమలు తదితర పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ ప్రతి పరిశీలకుడు తనకు కేటాయించిన నియోజకవర్గంలో నిరంతరం పర్యటిస్తూ పార్టీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

# చిరు వ్యాపారులకు వీపీఆర్ చేయూత

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడి



కోవూరు (చైతన్యరథం): స్వశక్తితో జీవనం సాగించే ఒంటరి మహిళలు, వృద్ధ చిరువ్యాపారుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వీపీఆర్ ఫౌండేషన్ ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు.

గురువారం సాయంత్రం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వశక్తితో తమ కాళ్లపై తాము నిలబడి చిరువ్యాపారాలు చేసుకుంటున్న ఒంటరి మహిళలు, వృద్ధులు ఉపాధి కోసం అద్దెకు తోపుడు బండ్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వచ్చే స్వల్ప ఆదాయంలో కొంత భాగాన్ని బండి అద్దెకు చెల్లించాల్సి రావడం వల్ల వారి జీవనం మరింత భారంగా మారుతోందని పేర్కొన్నారు. సొంతంగా బండ్లు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని వారికి సొంత తోపుడు బండ్లు అందిస్తే వారి ఉపాధికి తోడ్పాటు అందుతుందనే ఆలోచనతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఇప్పటికే తొలి విడతలో కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశామని, రెండో విడతలో మరో 41 మందికి అందజేస్తున్నామని ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. ప్రతి తోపుడు బండి తయారీకి సుమారు రెండు నెలల సమయం పడుతుందని, బండి కావాలని విజ్ఞప్తి చేసిన వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించిన తర్వాత నిజంగా అవసరమైన వారిని ఎంపిక చేసి వీపీఆర్ ఫౌండేషన్ తరపున అందజేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులంతా ఈ తోపుడు బండ్లను సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, వారి కుటుంబాలు సంతోషంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు.

## ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యాన శాఖ ప్రణాళిక

ఒంగోలు (చైతన్యరథం): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు ఉద్యాన శాఖ ప్రణాళిక రూపొందించింది. నేల స్వభావాన్ని పరీక్షించి అనువైన ప్రాంతాలను గుర్తించింది. మార్కాపురం జిల్లాలో 12, ప్రకాశం జిల్లాలో 4 మండలాలను ఎంపిక చేసింది. ఈ మండలాల్లో రైతులకు ప్రోత్సాహకాలు అందించనుంది. నాణ్యమైన మొక్కల సరఫరా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీ రూపంలో సాయం, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, ఎరువుల నిర్వహణ తదితర విషయాల్లో రైతులకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం అందిస్తుంది. పైగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమల్లోకి వస్తున్న రాయలసీమ హార్టికల్చర్ హబ్ ద్వారా ఉద్యాన రైతులకు మరిన్ని రాయితీలు అందనుండడంతో ఈ ఆయిల్‌పామ్ తోటల సాగు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ అభివృద్ధికి ఆసక్తి ఉన్న కంపెనీల కోసం ఉద్యానశాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కంపెనీల ఎంపిక



పూర్తి కాగానే సాగు పనులు ప్రారంభమవుతాయి.

### ఎంపికైన మండలాలు

ఆయిల్‌పామ్ తోటల సాగుకు రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 63 మండలాలు ఎంపికయ్యాయి. వాటిలో ప్రకాశం, మార్కాపురం జిల్లాలు ఉన్నాయి. ప్రకాశంలో కురిచేడు, దర్శి, ముండ్లమూరు, దొనకొండ మండలాలు ఉన్నాయి. మార్కాపురం జిల్లాలో గిద్దలూరు, అర్ధవీడు, త్రిపురాంతకం, దోర్నాల, పుల్లలచెరువు, బేస్తవారపేట, కొమరోలు, రాచర్ల, తర్లుపాడు, ఎర్రగొండపాలెం, కంభం మండలాలను ఎంపిక చేశారు. ఆ ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ తోటల సాగు చేయనున్నారు.

# మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సాయంతో అభివృద్ధి సాధిస్తున్నాం

## నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): ఆటోనగర్ లో ఉన్న నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలో చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మీడియాతో మాట్లాడారు. సవాళ్లను స్వీకరించి అభివృద్ధి వైపు నడిపిస్తున్నానన్నారు. జీరో లో ఉన్నప్పుడు బాధ్యతలు చేపట్టానని, ఇప్పుడు రాష్ట్రానికి నుడా రోల్ మోడల్‌గా నిలిచిందని వివరించారు. గతంలో అన్నమయ్య సర్కిల్‌లో ఉండే తారకరామ పార్క్, బాలాజీ నగర్‌లో ఎస్పీ బాలసుబ్రమణ్యం పార్కు ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును మంత్రి నారాయణ సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. అన్యాక్రాంతం కాకుండా ఎన్నో పార్కు స్థలాలను కాపాడామన్నారు. ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహకారం, తోడ్పాటు అందించారన్నారు. దశల వారీగా నెక్లెస్ రోడ్డును ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు తరహాలో డెవలప్ చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం నుడాను నిర్వీర్యం చేసిందన్నారు. రెండోసారి నుడా చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన సమయంలో పైసా నిధులు లేవన్నారు. జమ్మలపాలెంలో ఉండే లేఔట్ కి సంబంధించి 26 కోట్లు బిల్లులు తీసుకుని పనులు చెయ్యలేదన్నారు. 700 ప్లాట్స్ కొనుగోలు చేసినా.. మౌలిక వసతులు గత ప్రభుత్వం కల్పించలేదన్నారు. దాదాపు 19 కోట్లతో జమ్మలపాలెం లేఅవుట్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో కొందరు ఘోరమైన తప్పిదాలు చేశారని ఆరోపించారు. జమ్మలపాలెం లేఅవుట్ సమీపంలో ఉండే 21 ఎకరాల ప్రవేట్ భూమిని కూడా తీసుకునేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిపి కమిటీ వేస్తున్నాం..ఎన్ని ఇబ్బందులున్నా.. నుడా పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాలనుండి అభివృద్ధి పనులు కోసం 40 కోట్లతో టెండర్లు పిలిచామన్నారు. లేఔట్ లు అభివృద్ధి చేస్తే నుడాకు ఆదాయం వస్తుందని అభివృద్ధి చేయాలని ఉన్నప్పటికీ నుడా లో నిధులు లేవని చెప్పారు. మంత్రులు ఎమ్మెల్యేల సాయంతో స్థానికంగా ఉండే భూములు సేకరించి లేఔట్లు వేస్తున్నామన్నారు. నెక్లెస్ రోడ్డులో ఉండే విగ్రహాలకు రంగులు వేసేందుకు టెండర్ పిలిచామని, నెక్లెస్ రోడ్డులో ఎన్టీఆర్ నూతన విగ్రహాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డితో కలిసి త్వరలో శంకుస్థాపన చేస్తున్నామన్నారు. పార్కులకు రాజకీయ నేతల పేర్లు పెడుతున్నాం.. ఆనం వివేకానంద రెడ్డి, ముంగమూరు పార్కులు పూర్తి కావొస్తున్నాం.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో నుడా ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు.




# సీఎం చంద్రబాబు పాలనలో హాస్టళ్లకు మహర్దశ

నెల్లూరు లోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ నాటి సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హాస్టల్స్ గురుకులాల్లో చదివే విద్యార్థులకు దేశంలోనే మొట్ట మొదటి సారిగా చికెన్‌తో కూడిన భోజనం పెట్టడం తో పాటు హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాలు నరకానికి నకళ్ళుగా మారాయన్నారు. వైసీపీ ప్రభుత్వం హాస్టల్స్ భవనాలు శిధిలా వ్యవస్థకు చేరినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. హాస్టల్ భవనాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. కొన్ని హాస్టళ్లలో కనీసం మరుగు దొడ్లు లేక ఇబ్బందులు పడ్డ పట్టించుకోలేదన్నారు. 2024లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ఆయన వెంటనే ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు సంక్షేమం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సంక్షేమ హాస్టల్స్ లో గురుకులాల్లో సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు.

దాదాపు 500 కోట్ల వ్యయంతో, రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ హాస్టల్లో మరమత్తులు చేపట్టడం తో పాటు, అదనపు మరుగుదొడ్లు నిర్మించారన్నారు. రాష్ట్రంలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ హాస్టల్స్ గురుకులాలులో సొంతింటి కంటే మెరుగైన సౌకర్యాలు కల్పించడం, నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమన్నారు. అందులో భాగంగానే గత రెండు సంవత్సరాల లో దాదాపు రూ.500 కోట్లు ఖర్చు చేసి హాస్టల్స్ లో కనీస వసతులు కల్పించారన్నారు.10 శాతం మెస్ చేసిన ఛార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రభుత్వ హాస్టల్స్ గురుకులాలు చదువుతున్న పేద విద్యార్థులకు కార్పోరేట్ పాఠశాలలు కు దీటుగా నాణ్యమైన విద్యను, మెరుగైన సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తుంప్త్రయిఖుంయి ప్రభుత్వ హాస్టల్స్ విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకొన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

# పుంగనూరులో ఘనంగా టీడీపీ విజయోత్సవం

పుంగనూరు (చైతన్యరథం): నియోజకవర్గశీ రొంపిచర్ల మండలం నందు కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం అనే కార్యక్రమాన్ని ఎన్డీఏ, బిజెపి, జనసేన మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి ఈ కార్యక్రమంలో భారీ ర్యాలీ ద్వారా సభ వేదిక చేరుకొని రెండేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కూటమి ధర్మాన్ని పాటిస్తూ ప్రజల కోసం సూపర్ సిక్స్ పథకాలను ఏ విధంగా అమలు చేశారు ప్రజలకు వివరించి ప్రజలందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఆశీర్వదించాలని మహిళల కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చారని ఏ పథకం అమలు చేయాలన్న మహిళలకే పెద్ద పేట వేస్తున్నారని మహిళలు అందరూ కూడా గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఆశీర్వదించాలని కోరారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బిజెపి జనసేన తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.. కార్యక్రమం అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన కూటమి నాయకులకు కార్యకర్తలకు పెద్ద ఎత్తున భోజన ఏర్పాట్లను చేశారు.



# విధ్వంసమే వైసీపీ సైకోల ఏకైక లక్ష్యం

## ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే అమిలినేని



అనంతపురం (చైతన్యరథం): మడకశిర నియోజవర్గ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నివాసానికి ఎమ్మెల్యే అమిలినేని వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే రాజుతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్ర యువ నాయకుడు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పై తీవ్ర ఆరోపణలు చేసిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని డిమాండ్ చేశారు. చౌకబారుగా మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టీడీపీ యువ నేత రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పై వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుపై వైసీపీ తోపుదుర్తి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఇంటిముట్టడికి ఎమ్మెస్ రాజు పిలుపునిచ్చారు. ఆ మేరకు రాజు నివాసానికి ఎమ్మెల్యే అమిలినేని చేరుకున్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు ప్రతి విమర్శలు చేసుకోవచ్చు కానీ, రాజకీయాల్లో నైతికవిలువలు లేకుండా అనుచిత వాక్యలు చేయడమే కాకుండా రెచ్చగొట్టేలా ప్రవర్తించిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో ఎంతో మంది రాజకీయ నేతలు రాజకీయ విలువలతో పాలన సాగించారని, అలాంటిది రాజకీయ విలువలు దిగజారే విధంగా వ్యక్తిగత వ్యాఖ్యలు ఆరోపణలు చేసుకోవడం, అందులోను కుల దూషణలు చేయడం, అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాల సంస్కృతి గొడ్డలి పార్టీ నాయకులకే చెల్లుతుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంటే వైసీపీ సైకోలు పదే పదే వాటికి విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తూ, రౌడీయిజాన్ని ఫ్యాక్ష నిజాన్ని గంజాయి సంస్కృతిని పెంచి పోషిస్తున్నారన్నారన్నారు. ఎస్సీ కులానికి చెందిన మడకశిర టీడీపీ ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్మెస్ రాజుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే అమిలినేని డిమాండ్ చేశారు.



మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్ రెడ్డి మార్కాపురం పట్టణంలోని 13 మందికి స్వయంగా వారి గృహాలకు వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.



# రూ. 4 లక్షలతో జడ్పీహెచ్ పాఠశాల అభివృద్ధి

కోవూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలను ప్రాధాన్యత క్రమంలో ముందుగా అభివృద్ధి చేస్తున్నామని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు మండలం, లేగుంటపాడు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సీఎస్ఆర్, వీపీఆర్ ఫౌండేషన్ నిధులు దాదాపు రూ. 4 లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను గురువారం ఉదయం ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో 150 మంది కంటే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలను గుర్తించి, వాటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగులో, కొడవలూరు మండలం రాజుపాళెంలో పాఠశాలల అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి చేశామని, పడుగుపాడు పాఠశాలలో కూడా ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. లేగుంటపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాల గురించి మాట్లాడుతూ, దాదాపు 30 సంవత్సరాల తర్వాత ఈ పాఠశాల రూపురేఖలు మార్చడం సంతోషంగా ఉందన్నారు. ఇన్నేళ్ల కాలంలో మొదటిసారిగా పాఠశాల భవనాలకు కొత్తగా పెయింటింగ్ వేయించడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన ఆధునిక మౌలిక వసతులను కల్పించామని చెప్పారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల అభివృద్ధికి వీపీఆర్ ఫౌండేషన్ తరపున నిధులు మంజూరు చేస్తున్న నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, అలాగే సీఎస్ఆర్ ఫండ్స్ అందిస్తూ తోడ్పాటునందిస్తున్న దాతలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో ఎక్కడ ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా స్థానిక నాయకులు ఉత్సాహంగా పాల్గొని, పనులను పర్యవేక్షిస్తూ విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుధాకర్, గోపి, వేణు పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన తోపుదుర్తిని వదిలే ప్రసక్తి లేదు

## మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు హెచ్చరిక

అనంతపురం (చైతన్యరథం): దళితుడినైనా నా ఆత్మగౌరవానికి భంగం కలిగేలా మాట్లాడిన, కించపరిచిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని మడకశిర శాసనసభ్యుడు టీటీడీ పాలకమండలి సభ్యుశ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు అన్నారు. తనకు రూ.7కోట్ల విల్లా ఉందని, బెంగళూరులో ఆస్తులు ఉన్నాయని, మంత్రి నారా లోకేష్‌కి బినామీగా ఉన్నారని చేసిన అసత్య ఆరోపణలపై ఎం.ఎస్.రాజు తోపుదుర్తిపై మండిపడ్డారు. తనపై చేసిన ఆరోపణలను గురువారం సాయంత్రం 5గంటల్లోపు నిరూపించాలని ఎం.ఎస్.రాజు సవాల్ విసిరారు. తాను విసిరిన సవాల్ పై తోపుదుర్తి స్పందించకపోవడంపై ఎం.ఎస్.రాజు అనంతపురంలోని తన నివాసం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా తాను స్పందించానన్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వైసీపీలో తన ఉనికిని కాపాడుకునేందుకు మా యువనేత నారా లోకేష్, మాపై అసత్య ఆరోపణలు చేశాడన్నారు. మా ఎమ్మెల్యేలు, మా యువనేతపై ఇష్టానుసారం మాట్లాడిన వారిని వ్యతిరేకించాల్సిన అవసరం ఒక జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నాపై ఉందన్నారు. మడకశిరలోని నా పార్టీ కార్యాలయం స్థలం నాదే అని, బెంగళూరులో నాకు ఆస్తులు ఉన్నాయని, అనంతపురంలో నేను విల్లా కొన్నానని తోపుదుర్తి మాట్లాడాడు. నేను చెప్పుల షాపులో పనిచేశానని నన్ను కించపరిచేలా మాట్లాడాడు. నేను 2018లో నా తమ్ముడికి చెప్పుల షాపు పెట్టిస్తే....దానిని వక్రీకరించి నన్ను చులకనగా మాట్లాడాడు. తోపుదుర్తి అహంకారంతో మాట్లాడాడు...నేను ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేందుకు మాట్లాడాను. నేను చెప్పుల షాపు పెట్టిన రోజుల్లో తోపుదుర్తి తండ్రి చెప్పుల షాపు బయట కస్టమర్లు వదిలిన పాతచెప్పులు దొంగిలించిన చరిత్ర అన్నారు. నేను తోపుదుర్తి ఇంటికి ముష్టియుద్ధానికి వస్తానని అనలేదు. నేను ఒక సామాజికవర్గాన్ని కించపరిచేలా మాట్లాడానని తోపుదుర్తి కుటుంబం మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. అనంతపురంజిల్లాలో మాపై ఏ నాయకుడూ చిన్నచూపుచూడలేదన్నారు. ఎంతో మంది హుందాతనంగా రెడ్డి కులానికి చెందిన నాయకులు రాజకీయాలు చేశారు. కానీ తోపుదుర్తి ఇంత దిగజారి రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. నా కులాన్ని హేళన చేయడం, నా పరువుకు భంగం కలిగేలా మాట్లాడడం, నన్ను భూస్వామిగా చిత్రీకరించాలనే కుట్రపూరిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. నా ఎదుగుదలలో రెడ్డి మిత్రులు ఉన్నారు, నాకు అడుగడుగునా రెడ్డి సామాజికవర్గం వారు ఉన్నారు. వారంటే నాకు ఎంతో గౌరవం. నువ్వు అసత్య ఆరోపణలు చేసి సమాజంలో నా పరువుకు, నా ఆత్మగౌరవానికి దెబ్బతగిలేలా వ్యవహరించావు. మీ నియోజకవర్గంలో నీకు పనిచేసి ఆస్తులు పోగొట్టుకున్న రెడ్ల సంఖ్య ఎంతో నీకు తెలుసా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి? నువ్వు ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో నీకు వెన్నంటి నడిచిన రెడ్లు ఎంతో మంది చనిపోయారు, మరికొంతమంది అనారోగ్యంతో మంచం పడితే ఎవరినీ నువ్వు పరామర్శించలేదు. నేను రెడ్డి సామాజికవర్గాన్ని ఎక్కడా కించపరలేదు. నాకు ఆ ఉద్దేశం లేదు.

### హత్యారాజకీయాల తోపుదుర్తితో నాకు పోలికేంటి?

అని ప్రశ్నించారు. ఈరోజు నుండి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ప్రకాష్ అని పిలుస్తానన్నారు. నేను నా రాజకీయ చరిత్రలో నీ మాదిరి దందాలు, దౌర్జన్యాలు, దాడులు, హత్యలు చేసినట్లు ఎక్కడైనా రుజువు ఉందా? రాప్తాడు నియోజకవర్గంలోని పేద నుండి ధనిక రెడ్లు నీకు ఎంతో సహకరించారు, అండగా నిలిచారు. వారిని నువ్వు మోసం చేయలేదా? చక్రపాణి అనే అతనిని విజయవాడలో గాంధీ బజారులో కోట్లు విలువ చేసే స్థలం కోసం నలుగురు హత్య చేశారు. ఆ కేసులో నిందితుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి. ఆ రక్తపు కూడు విలువ రూ.100కోట్లు. విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఆస్తి ఉంది. ఈ నిందితుల్లో ఒకతన్ని కూడా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చంపించారు. కోట్లు విలువ చేసే ఒక భవనాన్ని తోపుదుర్తి రక్తపు మరకలతో కట్టుకున్నది కదా? హత్యలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు చేసే నీచ సంస్కృతి ఉన్న తోపుదుర్తి నన్ను విమర్శించడం ఏంటి అని నిలదీశారు. అమ్మ డైరీ పేరుతో నువ్వు ఎంతమంది మహిళలను మోసం చేశావో నీకు తెలియదా తోపుదుర్తీ వాల్మీకీల భూములను బెదిరించి, తక్కువ రేటుకు నువ్వు దోచుకోలేదా? వందల కోట్లు పోగేసుకోలేదా? 2019లో ఇల్లు లేదు అని చెప్పిన తోపుదుర్తికి నేడు కోట్లాది రూపాయల ఆస్తులు ఎక్కడినుండి వచ్చాయి? తోపుదుర్తి నీ ఆస్తుల ఖరీదు పైన, నా ఆస్తుల ఖరీదుపైన ఓపెన్ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. తెలుగుదేశంపార్టీలో మా వద్ద ఉన్న పదవులు మాల, మాదిగలకు పార్టీ మాకు ఇచ్చే గౌరవానికి నిదర్శనం. మా పదవుల గురించి నువ్వు మాట్లాడడం ఏంటి తోపుదుర్తి? నా గురించి వాడు, వీడు అన్నావ్. తేల్చుకుందాం అన్నావ్. జీవితకాలం నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు నిన్ను 100శాతం వేటాడతాను. నా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన నిన్ను వదిలిపెట్టేది లేదు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి. నీచమైన చరిత్ర కలిగిన నువ్వు నా గురించి మాట్లాడడం దుర్మార్గం. నేను కష్టపడి ఈ స్థాయికి వచ్చాను. చంద్రబాబు, లోకేష్ ఆశీస్సులు నాపై ఉన్నందున నాకు 4 పదవులు ఉన్నాయి. నాకు 5వ పదవి కూడా ఉంది. అది తెలుగుదేశంపార్టీ కార్యకర్త. నేను పసుపు సైనికుడిని అని గర్వంగా చెప్పగలను ప్రకాష్ రెడ్డి అని ఎం.ఎస్.రాజు అన్నారు. తోపుదుర్తి తన కుల దురహంకారాన్ని తగ్గించుకోకపోతే తగిన శాస్తి అనుభవిస్తాడని హెచ్చరించారు.

# తెలుగు న్యాయవాదికి అరుదైన గౌరవం

## చట్టం, మానవ హక్కుల పరిరక్షణలో డాక్టర్ శ్రీనివాస్‌రావు కావటి సరికొత్త చరిత్ర

## నెల్సన్ మండేలా అవార్డుతో పాటు నాలుగు అంతర్జాతీయ పురస్కారాలు కైవసం



అమరావతి: ప్రముఖ న్యాయవాది, కావటి లాఫామ్ ఫౌండర్, రామ్సేయర్ అండ్ అసోసియేట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రావు కావటి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. న్యాయ వ్యవస్థలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు, మానవ హక్కుల కోసం చేస్తున్న పోరాటం, అంతర్జాతీయ చట్టపరమైన వ్యవహారాల్లో ఆయన చూపిస్తున్న నాయకత్వానికి గాను పలు ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయి.

**అందుకున్న ప్రధాన అవార్డులు:**

నెల్సన్ మండేలా అవార్డు: యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో ఈ అవార్డును ప్రదానం చేశారు. సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, అందరికీ న్యాయం అందుబాటులోకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది.

ఇంటర్నేషనల్ కౌన్సిల్ లీడర్‌షిప్ అవార్డు: అంతర్జాతీయ స్థాయిలో క్లిష్టమైన చట్టపరమైన వ్యవహారాలను డీల్ చేయడంలో, వ్యాపార సంస్థలకు సలహాలివ్వడంలో ఆయన చూపుతున్న నాయకత్వ పటిమకు ఈ గౌరవం దక్కింది.

గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ లీడర్‌షిప్ అవార్డు: మానవ హక్కుల ప్రచారం, న్యాయ విద్య, అంతర్జాతీయ సహకారం కోసం ఆయన చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఈ అవార్డు లభించింది.

కెనడా లెగసీ అవార్డు: మానవతా దృక్పథంతో పేద, వెనుకబడిన వర్గాలకు న్యాయ సేవలందించడంలో చూపుతున్న అంకితభావానికి కెనడాలో ఈ పురస్కారం దక్కింది.

ప్రపంచస్థాయి గుర్తింపు...

డాక్టర్ కావటి వృత్తిపరమైన విజయాలను గుర్తించిన 'మార్క్విస్ హూ ఈజ్ హూ' సంస్థ ఆయన్ను తమ జాబితాలో చేర్చుకుంది. అలాగే లండన్‌లోని ప్రతిష్టాత్మక 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ జ్యూరిస్ట్స్'లో ఆయనకు సభ్యత్వం లభించింది. అంతర్జాతీయ సరిహద్దులు దాటి న్యాయ సేవలను అందించడంలో, ప్రపంచవ్యాప్తంగా న్యాయ వ్యవస్థలో మార్పు కోసం ఆయన చేస్తున్న కృషిని అంతర్జాతీయ సమాజం ఈ పురస్కారాల ద్వారా కొనియాడింది.





# ఆస్ట్రేలియాలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం

## ప్రవాస భారతీయుల 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన మెల్‌బోర్న్

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా): మూడు దేశాల పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ఆస్ట్రేలియా చేరుకున్నారు. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మెల్‌బోర్న్ చేరుకున్న ప్రధానికి విమానాశ్రయంలో అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం లభించింది. ఆస్ట్రేలియాలోని భారత సంతతి ప్రజలు, ప్రవాస భారతీయులు ప్రధాని మోదీకి అపూర్వ స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై', 'మోదీ.. మోదీ' నినాదాలతో విమానాశ్రయ పరిసరాలు హోరెత్తాయి. 'ఆస్ట్రేలియన్ ఇండియన్ ఆర్కెస్ట్రా' అందించిన వందేమాతరం ఆలాపన ఈ స్వాగత వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండోనేషియా పర్యటన ముగించుకుని ఆస్ట్రేలియా వచ్చిన ప్రధాని మోదీ, ఈ పర్యటన అనంతరం న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు.

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి సరికొత్త ఊపు

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో జరగబోయే ద్వైపాక్షిక చర్చలు ఇరు దేశాల 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేస్తాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం Xలో స్పందిస్తూ... 'ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో చర్చల కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇరు దేశాల బంధానికి బలమైన స్తంభాలుగా నిలుస్తున్న ప్రవాస భారతీయులతో ముచ్చటించే అవకాశం కూడా ఈ పర్యటనలో నాకు లభించనుంది.' అన్నారు.

ఈ ఉన్నత స్థాయి భేటీలో ఇరు దేశాల ప్రధానమంత్రులు రక్షణ-భద్రత, వ్యాపారం-పెట్టుబడులు, విద్య, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలతో పాటు అభివృద్ధి చెందుతున్న కీలక సాంకేతికతలు, క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్ రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

భారత్-ఆస్ట్రేలియా మధ్య వాణిజ్య సంబంధాలు గతంతో పోలిస్తే విపరీతంగా పుంజుకున్నాయి. ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ విక్టోరియా ట్రెజరర్ ప్రకాష్ గుప్తా తెలిపిన వివరాల ప్రకారం.. ఒకప్పుడు కేవలం 14 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల ద్వైపాక్షిక వ్యాపారం ప్రస్తుతం 55 బిలియన్ డాలర్లకు చేరుకుంది. రాబోయే 2030 నాటికి ఈ వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయి.

మారుతున్న ప్రపంచ స్థితిగతుల నేపథ్యంలో భారత్‌కు అవసరమైన 'యురేనియం'ను ఆస్ట్రేలియా సరఫరా చేయగలదని, అలాగే ఆస్ట్రేలియాకు ఎంతో అవసరమైన ప్రొఫెషనల్ ఐటీ నిపుణులను భారత్ అందించగలదని, దీనివల్ల ఇరు దేశాల వ్యాపారాలు మరింత విస్తరిస్తాయని ప్రవాస భారతీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ మెల్‌బోర్న్ నుంచి 'ఎక్స్'లో ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. ప్రధాని మోదీ రాకతో మెల్‌బోర్న్ నగరం మొత్తం ఒక సరికొత్త ఉత్సాహంతో ఊగిపోతోందని ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య మొదటి దశ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇప్పటికే అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని, ఈ పర్యటనతో వాణిజ్య బంధం మరింత పటిష్ఠం కానుందని ఆయన తెలిపారు. అలాగే సంస్కృతికి నిలయమైన మెల్‌బోర్న్ నగరంలో భారత్‌తో కలిసి కళలు, సాంస్కృతిక రంగాలలో మరిన్ని ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రీన్ వెల్లడించారు.



# సంస్కృతి బహ్రెయిన్ నూతన కార్యవర్గం ఎన్నిక

బహ్రెయిన్: భారతమాతకు దూరంగా అరేబియా ఎడారి దేశంలో మాతృభూమి సేవకోసం పరితపించే సంస్థ సంస్కృతి బహ్రెయిన్. భారత్‌లోని 27 రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులతో దశాబ్దకాలానికి పైగా సంస్కృతి బహ్రెయిన్ సామాజిక, సాంస్కృతిక సేవలందిస్తోంది. ఇటీవల ఈ సంఘం తన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అందులో హైదరాబాద్‌కు చెందిన దీపక్ నంద్యాల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



భారతీయ సనాతన ధర్మం, జాతీయ భావాల మధ్య విడదీయరాని బంధం ఉందని ప్రగాఢంగా విశ్వసించే దీపక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... సనాతన ధర్మం కేవలం ఒక మతం మాత్రమే కాదన్నారు. అది మానవాళికి శాంతిని, సమైక్యతను, ధర్మాన్ని బోధించే ఒక జీవన విధానమన్నారు. విదేశాల్లో భారత దేశ సంస్కృతి, జాతీయ సమగ్రతకు బలమైన పునాదిగా పనిచేస్తున్న మంత్రం సనాతనమని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో స్వచ్ఛ భారత్ మిషన్ ఆశయానికి అనుగుణంగా అరేబియా సముద్ర తీరంలో ప్రతి వారం శుభ్రతా కార్యక్రమాన్ని సంస్కృతి బహ్రెయిన్ నిర్వహిస్తోంది. ఆరోగ్య పరిరక్షణ, రక్తదాన శిబిరాలతో పాటు యాంత్రిక జీవితంలో అలసిపోయిన వారికి ప్రత్యేకంగా యోగా శిబిరాలను కూడా సంస్కృతి బహ్రెయిన్ నిర్వహిస్తోంది. ఈ సంస్థ నిర్వహించిన లిటిల్ ఇండియా కార్యక్రమం బహ్రెయిన్‌లో భారతీయ స్ఫూర్తిని రగిలించిందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. సంస్కృతి బహ్రెయిన్ కార్యవర్గానికి దీపక్ నంద్యాల అధ్యక్షుడిగా ఎన్నిక కాగా రేజు ఆండ్రూస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆనంద్.జె (ఉపాధ్యక్షుడు), హరీష్ నాయర్ (కోశాధికారి), హనుమంతరావు (సంయుక్త కార్యదర్శి), రంజిత్. పి (సభ్యత్వ కార్యదర్శి), వెంకట్‌స్వామి, ప్రేమ్‌సాగర్, రాజీష్, వినయ్ చండల్ (కార్యనిర్వాహక సభ్యులు), సురేష్‌బాబు (విదేశీ సమన్వయకర్త), ప్రవీణ్.ఎస్ (సలహాదారు), ప్రదీప్.ఎస్ (సంయోజక్) కూడా కార్యవర్గానికి ఎన్నికయ్యారు. ఆనంద్.జె స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన సమావేశం హరీష్‌నాయర్ వందన సమర్పణతో ముగిసింది. సమావేశంలో ప్రముఖులు డాక్టర్ అరుణ్‌కుమార్ ప్రహరాజ్, ప్రత్యేక అతిథులు అభిషేక్ దేవ్‌జీ, బ్రిజ్‌భూషణ్ కిషోర్ పాల్గొన్నారు.

# న్యూయార్క్‌లో రోడ్డు ప్రమాదం

## ఏపీ విద్యార్థిని అట్లూరి ప్రసన్న దుర్మరణం



న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ఒక దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతి అట్లూరి ప్రసన్న (25) ప్రాణాలు కోల్పోయింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన ప్రసన్న దుర్మరణం చెందింది. న్యూయార్క్ స్టేట్ పోలీసుల కథనం ప్రకారం.... ప్రయాణిస్తున్న కారు స్టేట్ రూట్స్ 224, 13 కూడలి వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆపకుండా ముందుకు వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో గ్రీన్ సిగ్నల్‌తో వస్తున్న బ్రయాన్ జె.వుడ్‌వర్త్ అనే వ్యక్తి నడుపుతున్న మరో వాహనం ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కారు వెనుక సీటులో కూర్చున్న ప్రసన్న అక్కడికక్కడే మరణించింది. రాబర్ట్ ప్యాకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కారులోని డ్రైవర్, మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

అయితే ప్రసన్న కుటుంబసభ్యులు, ఆమె బంధువు రవికుమార్ ఏర్పాటు చేసిన 'గోఫండ్‌మీ' పేజీలో పేర్కొన్న వివరాల ప్రకారం... ఎదురుగా వస్తున్న కారు రెడ్ లైట్ జంప్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రసన్న ఇటీవలే న్యూయార్క్‌లోని పేస్ యూనివర్సిటీ నుంచి తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని ఉద్యోగ వేటలో ఉన్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకోవడం ఆమె కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచెత్తింది. ప్రస్తుతం ప్రసన్న పార్థివదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# శుభశకునాలతో ప్రధాని మోదీ న్యూజిలాండ్ పర్యటన

## ఒక రోజు ముందే ఆ దేశ ప్రధాని లక్సన్ అనుకూల ప్రకటన



భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనకు ఒక రోజు ముందే ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడంతో న్యూజిలాండ్ నుంచి భారత్‌కు జరిగే ఎగుమతుల్లో 57 శాతం ఉత్పత్తులకు తొలిరోజే దిగుమతి సుంకం రద్దుచేస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఒప్పందంతో న్యూజిలాండ్ వాణిజ్యదారులకు భారీ ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా శుక్రవారం ప్రధాని మోదీ ఆక్లాండ్‌కు చేరుకోనున్నారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనల అనంతరం ఆయన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరగా న్యూజిలాండ్‌ను సందర్శించనున్నారు. 40 ఏళ్లలో భారత ప్రధాని అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్, న్యూజిలాండ్‌లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ డీల్‌తో ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే 95 శాతం వస్తువులపై సుంకాలను దశలవారీగా తొలగించాలి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతమయ్యే అవకాశముంది. 2024-25 ఆర్థిక ఏడాదిలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1.3 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. 2024లో ఇది 2.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో ప్రయాణం, సమాచార సాంకేతిక సేవలు, వ్యాపార రంగాలు కీలక పాత్ర పోషించాయి. మోదీ-లక్సన్ సమావేశంలో.. వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు వంటి అంతర్జాతీయ అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. భారత 'యాక్ట్ ఈస్ట్' విధానం, 'మహాసాగర్(మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అక్రాస్ ద రీజియన్స్)' దృష్టికోణం సహా స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి ఈ పర్యటన మరింత ఉపయుక్తం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు.



# అందుబాటులోకి బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్

దేశంలో నెట్‌వర్క్ రాని మారుమూల ప్రాంతాలు, కొండ కోనల్లో సైతం నిరంతరాయంగా కమ్యూనికేషన్ అందించేందుకు వీలుగా బీఎస్ఎన్ఎల్ ఓ సరికొత్త శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పన్నులతో కలిపి దీని ధరను రూ. 1,34,166గా నిర్ణయించారు. సాధారణ స్మార్ట్‌ఫోన్‌ల వలే కాకుండా, ఇది నేరుగా ఉపగ్రహాల సాయంతో పనిచేస్తుంది. మనం వాడే సాధారణ ఫోన్లు దగ్గరలోని మొబైల్ టవర్ల సిగ్నల్స్ ఆధారంగా పనిచేస్తాయి. కానీ, ఈ శాటిలైట్ ఫోన్ నేరుగా అంతరిక్షంలోని ఉపగ్రహాలతో అనుసంధానమై ఉంటుంది. దీనికోసం బీఎస్ఎన్ఎల్ సంస్థ గ్లోబల్ శాటిలైట్ నెట్‌వర్క్ ప్రొవైడర్ అయిన 'ఇన్మార్శాట్'తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మొబైల్ కవరేజ్ లేని ప్రాంతాల్లో, అత్యవసర సమయాల్లో వాయిస్ కాల్స్ చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.


## ఉద్యోగాల పేరుతో టోకరా : స్కాం రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

ఢిల్లీలో నిరుద్యోగులను విచిత్రమైన తీరులో కేటుగాళ్లు మోసం చేశారు. ఇన్‌కమ్ టాక్స్ శాఖలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఈ ముఠా లక్షల్లో టోకరా వేసింది. ఈ భారీ జాబ్ స్కాం రాకెట్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మాజీ ఉద్యోగి చిరాగ్ అగర్వాల్ కూడా ఉన్నారు. ఐటీ ఆఫీస్ లోపలే కేటుగాళ్ళు నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించి బాధితులను నమ్మించారు. ఏకంగా కార్యాలయం ప్రాంగణంలోనే నకిలీ ఇంటర్వ్యూలు, ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించడం గమనార్హం. ఢిల్లీ సివిక్ సెంటర్‌లోని ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయాన్ని వేదికగా చేసుకుని ఈ నకిలీ నియామకాల పర్వం కొనసాగింది. సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనల ద్వారా నిరుద్యోగ యువతను ఈ ముఠా ఆకర్షించింది. ఒక్కొక్కరి నుంచి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. గతంలో 15 ఏళ్ల పాటు ఐటీ శాఖలోనే పనిచేసిన అనుభవంతో బాధితులను ఆఫీస్ లోపలికి నిందితుడు చిరాగ్ తీసుకెళ్లాడు. నకిలీ వెరిఫికేషన్ ఫాంలు, సర్వీస్ బుక్‌లు చూపించి ఈ ముఠా సభ్యులు నమ్మించారు. అజ్మేరి గేట్ బాధితుడి ఫిర్యాదుతో టెక్నికల్ సర్వైలెన్స్ ద్వారా నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, బాధితుల నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి కోసం ఢిల్లీ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.



# అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యల వివరాలివ్వండి

## పలు రాష్ట్రాల అధికారులకు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు



దేశవ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు, సురక్షితంకాని భవనాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదకరంగా ఉండి, విపత్తులకు దారితీసే భవనాలను కూల్చివేయడం లేదా మూసివేయడంపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఢిల్లీ, గురుగ్రామ్, లఖ్‌నవూ, పాట్నా, తమిళనాడుకు చెందిన ఆయా మున్సిపల్ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఢిల్లీలోని సాకేత్‌లో ఇటీవల భవనం కూలిన విషాద ఘటన సహా లఖ్‌నవూ(యూపీ)లోని మాల్వీయా నగర్, అలీగంజ్‌లలో జరిగిన అగ్నిప్రమాదాలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. మే 20న కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఎలాంటి చర్యలు చేపట్టారో న్యాయస్థానం ముందుంచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆగస్టు 4న జరిగే తదుపరి విచారణకు సంబంధిత అధికారులు స్వయంగా హాజరు కావాలని పేర్కొంది.సాకేత్, మాల్వీయా నగర్, లజపత్ నగర్‌లలో కాలపరిమితితో కూడిన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించేందుకు ఐఐటీ ఢిల్లీకి చెందిన ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు, ఇద్దరు డ్రాఫ్ట్‌మెన్‌లతో కూడిన ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ బృందంలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) అధికారులు కూడా ఉంటారు. ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోకి వచ్చే సరోజినీ నగర్‌లోనూ ఇదే తరహా చర్యలు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియలో కమిటీ ఎలాంటి అలసత్వం వహించకూడదని, నిజాయతీతో కూడిన నివేదికను సమర్పించాలని కోర్టు స్పష్టం చేసింది. 'కమిటీ నిజాయతీతో కూడిన నివేదికను సమర్పించే విషయంలో ఎలాంటి అలసత్వం వహించరాదని మేం స్పష్టం చేస్తున్నాం. ఏవైనా సందేహాలు తలెత్తితే, నివేదిక నిజాయతీని నిర్ధారించేందుకు అవసరమైతే న్యాయస్థానం నుంచి ఓ ప్రత్యేక బృందాన్నీ పంపవచ్చు' అని కోర్టు పేర్కొంది. సంబంధిత అధికారులు తదుపరి విచారణ తేదీలోగా తీసుకున్న చర్యల నివేదికలను సమర్పించడంలో, కోర్టు ఆదేశాలను పాటించడంలో విఫలమైనట్లయితే.. వారిపై సుమోటోగా ధిక్కార చర్యలు చేపడతామని కూడా న్యాయస్థానం హెచ్చరించింది. గతంలో ఇచ్చిన ఆదేశాలు, కూల్చివేత ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. తదుపరి విచారణ వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తేలితే.. ఆ బాధ్యతను నేరుగా సంబంధిత అథారిటీల ముఖ్య కార్యనిర్వహణాధికారుల మీదే నిర్ధారిస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేసింది. భవనాలు కూలిపోవడం, అగ్నిప్రమాదాలు జరిగిన తర్వాత అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోని తమ సొంత అధికారులపై చర్యలకు ఉపక్రమించకుండా.. కేవలం బిల్డర్లనే అరెస్ట్ చేయడం ద్వారా అధికారులు పరువు నిలుపుకునే వైఖరిని అవలంబిస్తున్నారన్న అమికస్(కోర్టు నియమించిన న్యాయవాది) వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. సదరు వైఫల్యాలకు బాధ్యులైన వారి పేర్లను తమ నివేదికలలో పొందుపరచాలని అధికారులను ఆదేశించింది.



# శరద్ పవార్, ఏక్‌నాథ్ షిండే భేటీ : వేడెక్కిన మహారాష్ట్ర రాజకీయాలు

మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎన్‌సీపీ(ఎస్‌పీ) అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమావేశమయ్యారు. అసెంబ్లీలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇద్దరు నేతలు భేటీ అయ్యారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు వివాదంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అధ్యక్షతన అసెంబ్లీ భవనంలో గురువారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏక్‌నాథ్ షిండే హాజరయ్యారు. అదే సమయంలో శరద్ పవార్ తన పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీలోని షిండే కార్యాలయానికి వెళ్లారు. పవార్ తన కార్యాలయంలో వేచి ఉన్నారని తెలియగానే షిండే క్యాబినెట్ సమావేశాన్ని మధ్యలోనే ముగించుకుని అక్కడికి వెళ్లారు. పుష్పగుచ్ఛంతో పవార్‌కు స్వాగతం పలికిన షిండే అనంతరం ఆయనతో సుమారు 15 నిమిషాల పాటు కీలక అంశాలపై చర్చించారు. ఆ తర్వాత షిండే అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే, ఈ సమావేశంలో ఏం చర్చించారనే విషయం బయటకు రాలేదు. షిండే కార్యాలయం కూడా దీనిని కేవలం మర్యాదపూర్వక భేటీగానే పేర్కొంది. అయితే, డిప్యూటీ సీఎం వెళ్లిపోయిన తర్వాత కూడా పవార్ అదే కార్యాలయంలో తన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. దీంతో ఈ పరిణామం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇటీవల ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)కు చెందిన ఆరుగురు ఎంపీలు షిండే వర్గంలో చేరారు. ఈ పరిణామంతో మహా వికాస్ అఘాడి(ఎంవీఏ)లో ఇప్పటికే ఒడిదుడుకులకు గురవుతోంది. ఇదిలా ఉండగా శరద్ పవార్ పార్టీలోని ఓ వర్గం ఎన్డీఏలో చేరేందుకు ఆసక్తి చూపుతోందన్న ఊహాగానాలకు ఈ భేటీ మరింత ఊతమిచ్చింది. దీంతో మహారాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ సమావేశంపై ఎన్‌సీపీ(ఎస్‌పీ) మిత్రపక్షమైన శివసేన (యూబీటీ) తీవ్ర విమర్శలు చేసింది. షిండే కార్యాలయాన్ని పవార్ ఎందుకు సందర్శించారని యూబీటీ నేత సంజయ్ రౌత్ ప్రశ్నించారు. 'షిండేను ఆయన కార్యాలయంలో కలవాల్సిన అవసరం ఏమిటి? పవార్ తన పార్టీ నాయకులను కలవడానికి అసెంబ్లీలో వేరే చోటు లేదా?' అని రౌత్ ప్రశ్నించారు. ఈ చర్య ఎన్‌సీపీ(ఎస్‌పీ), శరద్ పవార్ విశ్వసనీయతను దెబ్బతీస్తుందని ఆయన అన్నారు. 'శరద్ పవార్ నిస్సందేహంగా గొప్ప నాయకుడు. అత్యంత గౌరవనీయమైన వ్యక్తి. అయితే, మన ప్రభుత్వాన్ని కూల్చివేసిన ద్రోహి సమక్షంలో పార్టీ సమావేశం నిర్వహించడం ఆయన స్థాయిని దెబ్బతీస్తుంది' అని రౌత్ వ్యాఖ్యానించారు. షిండేను ద్రోహిగా పేర్కొన్న ఆ యూబీటీ నేత.. ఆయనతో పవార్ జరిపిన సమావేశం మిత్రపక్షాలన్నింటినీ ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎంవీఏ మిత్రపక్షాలన్నీ ఏక్‌నాథ్ షిండేకు దూరంగా ఉండాలని సంజయ్ రౌత్ పిలుపునిచ్చారు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పతాకస్థాయికి ఉద్రిక్తతలు

## పాక్ ప్రభుత్వ తీరుపై నిరసనకారుల ఆగ్రహజ్వాలలు

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి. పాక్ ప్రభుత్వ తీరుపై నిరసనకారులు మండిపడుతున్నారు. తమ డిమాండ్స్‌కు పాక్ పాలకులు 48 గంటల్లోపు అంగీకరించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) సారథ్యంలో నిరసనకారులు ఈ అల్టిమేటమ్ జారీ చేశారు. మొత్తం 38 డిమాండ్స్‌ను ప్రభుత్వం ముందుంచారు. పీఓకే అభివృద్ధి కోసం పాక్ పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జేఏఏసీ ఆరోపిస్తోంది. రాజకీయంగా పీఓకేపై ఆధిపత్యం సాధించేందుకు రకరకాల కుయుక్తులను పాక్ పాలకులు పన్నుతున్నారని మండిపడుతోంది. పీఓకే అసెంబ్లీలో 12 నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థులను పాక్ పాలకులే నామినేట్ చేయడంపై జేఏఏసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పాక్ నుంచి వలసొచ్చిన 4.36 లక్షల మంది ఓటర్ల కోసం ఈ 12 సీట్లను కేటాయించడం, 33 లక్షల మంది పీఓకే ఓటర్లకు మాత్రం కేవలం 33 సీట్లే ఉండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పీఓకేను తమ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు ఈ ఎత్తుగడకు పాక్ పాలకులు తెరతీశారని జేఏఏసీ మండిపడుతోంది. ఈ 12 సీట్లకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందని ఇటీవల పాక్ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడం అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ సీట్లను రద్దు చేయాల్సిందేనని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది.

వీటితో పాటు గతంలో ప్రతిపాదించిన హైడ్రోప్రాజెక్టులపై మళ్లీ చర్చలు ప్రారంభించడం, నిత్యావసరాలపై సబ్సిడీలు పెంచడం, విద్యుత్ ధరలు తగ్గించడం వంటి 38 డిమాండ్స్ ప్రభుత్వం ముందుంచింది. ఇక జులై 27న పీఓకేలో ఎన్నికలు జరగనున్నాయి. నేటి నుంచీ అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే జేఏఏసీ తాజా అల్టిమేటమ్‌ను జారీ చేసింది.





# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## విజయవాడ విద్యార్థిని దుర్మరణం

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువ విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం విషాదాన్ని నింపింది. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రసన్న అట్లూరి (25) న్యూయార్క్ రాష్ట్రంలో జరిగిన కారు ప్రమాదంలో మరణించింది. స్నేహితులతో కలిసి ఆలయానికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ నెల 5వ తేదీన ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రసన్న తన స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తూ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో యువతి కూడా ప్రాణాలు కోల్పోగా.. ఇంకొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన ప్రసన్న అమెరికాలోని పేస్ యూనివర్సిటీలోని లుబిన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువు పూర్తి చేసింది. ఇటీవలే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రసన్న మృతదేహాన్ని భారత్‌కు తీసుకువచ్చేందుకు సహకరించాల్సిందిగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ను కుటుంబ సభ్యులు అభ్యర్థించారు.

# టెలీకాం రంగంలో గ్లోబల్ లీడర్ భారత్ : ఆస్ట్రేలియాలో ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటన నేపథ్యంలో ఇరు దేశాల బంధం మరింత బలోపేతమైంది. ఇరు దేశాలు పలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మొత్తం 18 అంశాల్లో ఇరు దేశాల మధ్య సహకారం గురించి ఆస్ట్రేలియా, భారత్ ప్రధానులు వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఇరు దేశాల మధ్య దౌత్యబంధంపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ ఎన్నారైలపై ప్రశంసలు కురిపించారు. చక్కెరతో పాలు మరింత తీయగా మారినట్టు భారతీయులు అక్కడి సమాజంలో మిళితమయ్యారని చెప్పారు. అక్కడి భారతీయుల ఇళ్లల్లో పాలు ఆస్ట్రేలియాకు చెందినవేమో గానీ టీ మాత్రం భారత్‌దేనని చమత్కరించారు.ఒకటికి ఒకటి కలిపితే రెండవుతాయంటూ భారత్‌తో తమ దేశానికి ఉన్న బంధాన్ని నిర్వచించారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం ఒకటికి ఒకటి కలిపితే 11 అంటూ హిందీ జాతీయంతో చమత్కరించారు. మానవత్వ విలువల ఆధారంగా భారత్ పొరుగు దేశాలకు సాయం అందిస్తుంటుందని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే భారత్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకం ఎక్కువని అన్నారు. భారత సైనిక సామర్థ్యాలను ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి చాటిచెప్పిందని ప్రధాని మోదీ అన్నారు. భారత రక్షణ రంగ సామర్థ్యాన్ని, విశ్వసనీయతను ప్రపంచం ప్రత్యక్షంగా చూసిందని అన్నారు. టెలికమ్ రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని చెప్పారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద 5జీ నెట్‌వర్క్ ఉన్న దేశంగా అవతరించిందని చెప్పారు. భారత్ ఆస్ట్రేలియా మధ్య క్రికెట్ దౌత్యభాషగా నిలుస్తోందని కూడా ప్రధాని వ్యాఖ్యానించారు.

# అమెరికాలో భార్య గొంతు నులిమి. చంపిన భారతీయ మృగాడు

అమెరికాలో ఓ భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహం ఫొటోను ఇండియాలో ఉన్న తన ప్రియురాలికి పంపడం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. అమెరికాలోని బెల్లేవులో నివాసముంటున్న 30 ఏళ్ల సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ అవినాష్ నార్నే, గతేడాది అక్టోబర్ 27న తన భార్య రజిత సబ్బినేని (27) బాత్‌రూమ్‌లో లాక్ చేసుకుని బయటకు రావడం లేదంటూ పోలీసులకు ఫోన్ చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా రాజిత కింద పడిపోయి ఉంది. ఆమె అప్పటికే మరణించినట్లు అధికారులు నిర్ధారించారు. తాను బయటకు వెళ్లి 40 నిమిషాల తర్వాత వచ్చేసరికి భార్య లోపల లాక్ చేసుకుందని అవినాష్ పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, అతను బయటకు వెళ్లిన సమయంలో వేరే ఎవరూ ఇంట్లోకి రాలేదని నిఘా కెమెరాల ద్వారా స్పష్టమైంది. ఆ మరుసటి రోజే కింగ్ కౌంటీ మెడికల్ ఎగ్జామినర్ ఆఫీస్ నివేదికలో రాజితది గొంతు నులిమి చేసిన హత్యేనని తేలింది. పోలీసుల దర్యాప్తులో అవినాష్‌కు సంబంధించిన విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. అవినాష్‌కు భారతదేశంలో ఒక మహిళతో చాలా ఏళ్లుగా సంబంధం ఉంది. ఆ బంధం కొనసాగుతుండగానే.. 2025 జూన్ 5న రాజితను వివాహం చేసుకున్నాడు. అవినాష్ ప్రియురాలు కూడా ఈ పెళ్లికి హాజరైంది. పెళ్లి తర్వాత కూడా వీరిద్దరూ తమ అక్రమ సంబంధాన్ని కొనసాగించారు. హత్య జరిగిన రోజున అవినాష్ తన ప్రియురాలికి కనీసం నాలుగు సార్లు ఫోన్ చేసినట్లు తెలిసింది. తన భార్య బాత్‌రూమ్‌లో చిక్కుకుపోయిందని పోలీసులకు అబద్ధం చెప్పిన సమయంలోనే, అతను తన భార్య మృతదేహానికి సంబంధించిన ఫొటోను ఇండియాలోని ప్రియురాలికి పంపినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో భాగంగా రజిత మొబైల్ ఫోన్‌ను పరిశీలించిన అధికారులకు కీలకమైన మెసేజ్‌లు లభించాయి. అవినాష్ తనకు ఇచ్చే డ్రింక్స్ ఎప్పుడూ చేదుగా ఉంటున్నాయని రజిత పలుమార్లు అతనికి మెసేజ్ చేసింది. ఆమె మరణించిన రోజున కూడా అవినాష్ తయారు చేసి ఇచ్చిన స్మూతీ మందు, దగ్గు సిరప్ లాగా రుచిగా ఉందంటూ మెసేజ్ పంపింది. దీన్ని బట్టి ఆమెపై ముందే విషప్రయోగం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం జులై 5న అవినాష్‌పై ఫస్ట్-డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. ఈ నేరానికి అతనికి జీవిత ఖైదు పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అతను 5 మిలియన్ డాలర్ల బెయిల్ బాండ్‌పై జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.



# చైనాలో ప్రకృతి వైపరీత్యాల బీభత్సం

చైనాలో ప్రకృతి వైపరీత్యాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. మైసాక్ తుపాను ధాటికి ఇప్పటికే దక్షిణ చైనా అతలాకుతలమైంది. భారీ వర్షాలు, వరదలకు ఇప్పటివరకు 39 మంది మృతిచెందగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మరోవైపు చైనాకు భారీ ప్రమాదం పొంచి ఉంది. ఆ దేశం వైపుగా భీకర టైఫూన్ 'బావి' ముంచుకొస్తోంది. గంటకు 184 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తోంది. దీంతో తైవాన్, చైనా దేశాలు అలర్ట్ అయ్యాయి. తూర్పు తీరంలో వరద సహాయక చర్యల కోసం 5,700 బోట్లు, భారీ సంఖ్యలో డ్రోన్లను అధికారులు రంగంలోకి దించారు. శనివారం నాటికి టైఫూన్ తీరం దాటే అవకాశం ఉంది. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కాగా, మైసాక్ తుపాను ఇప్పటికే భారీ నష్టాన్ని మిగిల్చింది. దక్షిణ చైనాలోని గ్వాంగ్జూ రీజియన్‌లో గత శనివారం నుంచి రికార్డు స్థాయిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వానలకు నాన్నింగ్ నగర పరిధిలోని జలాశయం నిండిపోయింది. దీంతో వరద పోటుకు ఒక్కసారిగా డ్యామ్ బద్దలైంది. ఆ వరదనీరు మొత్తం హెంగ్‌జౌ నగరాన్ని ముంచెత్తింది. దీంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వరద ఉధృతి దృష్ట్యా సుమారు 1.30 లక్షల మంది ప్రజలను ఆర్మీ సురక్షిత ప్రాంతాలకు తరలించింది. మరోవైపు గుయ్‌గాంగ్ జూ నుంచి వందలాది వన్యప్రాణులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. జూలోని పాములు వరద నీటిలోకి చేరడంతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. అలాగే వరదల్లో చిక్కుకున్న 10,000 మంది విద్యార్థులను చైనా ఆర్మీ సురక్షితంగా కాపాడింది. కాగా, చైనా మధ్య ప్రాంతం హుబేలోనూ టోర్నడోలు బీభత్సం సృష్టించగా, 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. శనివారం తీరం దాటనున్న భీకర టైఫూన్ బావితో ఇంకెంత ప్రమాదం వచ్చి పడుతుందోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# నా బ్రదర్ గొప్ప కెప్టెన్ అవుతాడు

**శ్రేయస్ అయ్యర్‌పై సోదరి శ్రేష్ఠ కామెంట్**



టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు వరుసగా పరాజయాలు ఎదురవుతున్నాయి. ఐర్లాండ్ టూర్‌తో తొలిసారి జాతీయ జట్టు పగ్గాలు అందుకున్న శ్రేయస్ వరుస ఓటములు పలకరిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో అతడికి సోదరి శ్రేష్ఠ అయ్యర్ మద్దతుగా నిలిచింది. అంతేకాక భారత క్రికెట్ లెజెండ్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సచిన్ టెండూల్కర్ కెప్టెన్సీ ఓటములను ఉదాహరణగా చూపించి.. తన సోదరుడిని విమర్శించే వారికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది.

ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శ్రేష్ఠ అయ్యర్ పలు విషయాలను వెల్లడించారు. 'సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ..వీళ్లంతా క్రికెట్ లెజెండ్స్. వీళ్లు కూడా తమ కెరీర్‌లో ఎన్నో మ్యాచ్‌లు ఓడిపోయారు. కానీ ప్రతిసారి శ్రేయస్‌నే విమర్శించడం సరికాదు. అలా చేస్తే సమస్య అతడిలో కాకుండా విమర్శించే వారిలోనే ఉండొచ్చు' అని ఆమె వ్యాఖ్యానించింది. మరోవైపు నెటిజన్లు శ్రేయస్‌ను దిగ్గజాలతో పోల్చొద్దని చెప్పినప్పటికీ.. శ్రేష్ఠ మాత్రం? తన సోదరుడిపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేసింది.

'శ్రేయస్ గొప్ప వ్యక్తిత్వం కలిగిన ఆటగాడు. అతడిలో చాలా ప్రతిభ ఉంది. సరైన సమయం వచ్చినప్పుడు అతడే భారత అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా గుర్తింపు పొందుతాడని నేను బలంగా నమ్ముతున్నాను' అని పేర్కొంది. మరోవైపు వరుస వైఫల్యాలు ఎదురైనా శ్రేయస్ అయ్యర్‌పై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు జట్టు మేనేజ్‌మెంట్ విశ్వాసం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచ కప్- 2028ను దృష్టిలో పెట్టుకుని యువ జట్టుతో కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్న నేపథ్యంలో శ్రేయస్‌కు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉందని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమ్మాయిలూ... ఆల్‌ది బెస్ట్

**లార్డ్స్‌లో తొలిసారిగా మహిళా క్రికెట్ టెస్టు**

మహిళల టీ20 ప్రపంచ కప్‌లో నిరాశపరిచిన భారత జట్టు లార్డ్స్‌లో చారిత్రాత్మక టెస్టుకు సిద్ధమవుతోంది. శుక్రవారం ఆతిథ్య ఇంగ్లండ్‌తో తలపడనున్న టీమిండియా గెలుపే లక్ష్యంగా పెట్టుకుంది. అయితే మ్యాచ్‌కు ముందే భారత్‌కు బిగ్ షాక్ తగిలింది. మిడిలార్డర్ బ్యాటర్ ప్రతీకా రావల్ గాయంతో ఏకైక టెస్టుకు దూరమైంది. గత వారం ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ప్రతీక ఇంకా కోలుకోలేదు. ఇంగ్లండ్ గడ్డపై పొట్టి వరల్డ్ కప్‌లో లీగ్ దశలోనే నిష్క్రమించిన భారత జట్టుకు సువర్ణావకాశం వచ్చింది. 150 ఏళ్ల చరిత్ర కలిగిన లార్డ్స్ మైదానంలో జరుగుతున్న మొట్టమొదటి మహిళల టెస్టులో టీమిండియా ఆడనుంది. శుక్రవారం హర్మన్‌ప్రీత్ సేన ఏకైక టెస్టులో ఆతిథ్య జట్టును ఢీకొనుంది. వరల్డ్ కప్ వైఫల్యం నుంచి బయటపడి.. విజయంతో స్వదేశం రావాలనుకుంటున్న భారత్ కీలక బ్యాటరైన ప్రతీకా రావల్ సేవల్ని కోల్పోయింది. వారం క్రితం ఇండియా-ఎ, ఇంగ్లండ్-ఎ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ప్రతీక ఇంకా కోలుకోలేదు.

'ప్రతీకకు మోకాలిపై గాయం కావడంతో కుట్లు పడ్డాయి. అందువల్లే ఆమె లార్డ్స్ టెస్టుకు దూరమైంది. ఆమె స్థానంలో ప్రియా పూనియాను స్క్వాడ్‌లోకి తీసుకున్నాం' అని ప్రధాన కోచ్ అమోల్ మజుందార్ తెలిపాడు. అయితే.. మూడో స్థానంలో ఆడే ప్రతీక బదులు.. ఎవరిని ఆడిస్తారు? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఎందుకంటే ఈ ప్లేస్ కోసం యస్తికా భాటియా, హర్లీన్ డియోల్ పోటీపడుతున్నారు.

# స్వర్ణ పోరుకు సురేఖ టీమ్

మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-4లో భారత మహిళల కాంపౌండ్ జట్టు ఫైనల్‌కు చేరుకుని స్వర్ణ పతకం ముంగిట నిలిచింది. తెలంగాణ యంగ్ ఆర్చర్ తానిపర్తి చికిత, ఏపీ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, ప్రతీక ప్రదీప్‌లతో కూడిన జట్టు బుధవారం జరిగిన సెమీఫైనల్లో 231-228 తేడాతో దక్షిణ కొరియాపై గెలిచి స్వర్ణ పోరుకు చేరుకుంది. శనివారం జరిగే తుది పోరులో టాప్ సీడ్‌తో తలపడనుంది. వ్యక్తిగత ఈవెంట్లలో పర్ణీత్ కౌర్ మినహా భారత అమ్మాయిలంతా రౌండ్-32 చేరుకుని పతక రేసులో నిలిచారు. మరోవైపు పురుషుల కాంపౌండ్ జట్టు కొద్దిలో కాంస్య పతకం కోల్పోయింది. సాహిల్ జాదవ్, గణేశ్ మణిరత్నం, తిరుమురు, కుశాల్‌తో కూడిన టాప్ సీడ్ భారత్ కాంస్య పతక ప్లే ఆఫ్ మ్యాచ్‌లో 232-233తో ఒక్క పాయింట్ తేడాతో జర్మనీ చేతిలో పరాజయం పాలైంది. అంతకు ముందు హోరాహోరీగా సాగిన సెమీస్‌లో మెక్సికో చేతిలో షూటౌట్‌లో ఓడిపోయింది.



# ఇప్పటికీ నా స్నేహితుడే

*- యోగరాజ్ సింగ్ వ్యాఖ్యలపై కపిల్‌దేవ్*



భారత క్రికెట్ చరిత్రలో కపిల్‌దేవ్.. తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. 1983లో భారత్‌కు తొలి ప్రపంచకప్ అందించి దేశంలో క్రికెట్ ముఖచిత్రాన్ని మార్చేసిన ఘనత ఆయనది. అయితే కపిల్ సమకాలీనుడైన యువరాజ్ సింగ్ తండ్రి, మాజీ క్రికెటర్ యోగరాజ్ సింగ్ మాత్రం చాలాకాలంగా కపిల్‌పై తీవ్ర అసంతృప్తితో, ద్వేషంతో రగిలిపోతున్నాడు. కపిల్‌దేవ్ వల్లే తన కెరీర్ నాశనమైందంటూ... గతంలో తుపాకీ పట్టుకుని ఆయన ఇంటికి వెళ్లానంటూ యోగరాజ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన తండ్రి చేసిన వ్యాఖ్యలకు లెజెండరీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ అప్పట్లోనే కపిల్‌కు క్షమాపణలు కూడా చెప్పాడు.

తాజాగా ఓ స్పోర్ట్స్ పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న కపిల్‌దేవ్ ఈ వివాదంపై అత్యంత హుందాగా స్పందించాడు. యోగరాజ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. 'నా మనసులో ఎలాంటి కల్మషం లేదు. ఇప్పటికీ అతడు నా స్నేహితుడే. కానీ, జీవితంలో నిరంతరం ద్వేషాన్ని నింపుకునే వ్యక్తులకు నేను దూరంగా ఉంటాను. కఠినంగా ఉండే వారిని కలిసేందుకు ఇష్టపడను' అని కపిల్‌దేవ్ స్పష్టం చేశాడు. ఇదే సమయంలో యువరాజ్ సింగ్ భారత క్రికెట్‌కు అందించిన సేవలను కపిల్ కొనియాడారు. రెండు ప్రపంచకప్‌ల్లో మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన కొడుకును చూసి యోగరాజ్ గర్వపడాలే కానీ... ఇలాంటి పాత పగలతో జీవితాన్ని వృథా చేసుకోకూడదని కపిల్ హితవు పలికాడు.

'జీవితంలో ప్రతి ఒక్కరికీ అన్నీ దొరకవు. యోగరాజ్‌కు భారత్ తరపున ఆడే అవకాశం వచ్చింది. సినిమాల్లోనూ నటించాడు. అయినా ఎందుకీ అసంతృప్తి?. ఒకవేళ ఆయన నన్ను కౌగిలించుకోవాలని వస్తే నాకేం అభ్యంతరం లేదు. మేమిద్దరం ఒకే కోచ్ (దేశ్ ప్రేమ్ ఆజాద్) వద్ద పెరిగాము. విడాకులు తీసుకున్నంత మాత్రాన గతంలోని మంచి రోజులను మర్చిపోకూడదు' అంటూ కపిల్‌దేవ్ తన పెద్దరికాన్ని చాటుకున్నారు. పగ, ప్రతీకారాల కంటే జీవితంలో ముందుకు సాగడమే ముఖ్యమని కపిల్ చెప్పిన మాటలకు క్రికెట్ ప్రియులు ఫిదా అవుతున్నారు.

# 'స్విస' సూపర్...



**72 ఏళ్ల తర్వాత క్వార్టర్స్‌కు చేరిన స్విట్జర్లాండ్**

వాన్‌కూవర్ (కెనడా): సాకర్ ప్రపంచ కప్‌లో అంచనాలే లేని దేశంగా బరిలోకి దిగి ఒక్కో మెట్టు ఎక్కుతున్న స్విట్జర్లాండ్ ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో స్విట్జర్లాండ్.. పెనాల్టీ షూటౌట్‌లో 4-3తో కొలంబియాను ఓడించి లాస్ట్-8కు చేరుకుంది. నిర్ణీత సమయంతో పాటు ఎక్స్‌ట్రా టైమ్‌లోనూ ఇరు జట్లు గోల్ కొట్టడంలో విఫలమవ్వగా పెనాల్టీ అనివార్యమైన పోరులో స్విట్జర్లాండ్ 4 గోల్స్‌తో ప్రత్యర్థిని చిత్తుచేసి 1954 తర్వాత తొలిసారి ఈ టోర్నీలో క్వార్టర్స్‌కు ప్రవేశించింది. ఈ నెల 12న డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడుతుంది.

మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు గోల్స్ కోసం తీవ్రంగా శ్రమించినా ఒక్కరూ గోల్ కొట్టలేకపోయారు. బంతిపై రెండు జట్లూ సమంగా ఆధిపత్యం ప్రదర్శించగా స్విస్‌పైకి కొలంబియా ఏకంగా 15సార్లు గోల్ కొట్టేందుకు యత్నించినా అందులో ఒక్కసారీ సక్సెస్ కాలేకపోయింది. స్విట్జర్లాండ్ సైతం ఏడుసార్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడికి దిగినా వారిదీ అదే కథ. రెండు జట్ల డిఫెండర్లతో పాటు గోల్‌కీపర్లు ప్రత్యర్థి ఆటగాళ్లకు అడ్డుగోడలా నిలబడ్డారు. గోల్ చేసేందుకు 21వ నిమిషంతో పాటు ఎక్స్‌ట్రా టైమ్ (116వ)లోనూ కొలంబియా మంచి అవకాశాలు సృష్టించుకున్నా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. స్విట్జర్లాండ్ సైతం 30, 52 నిమిషాల్లో వచ్చిన చాన్స్‌లను మిస్ చేసుకుంది. షూటౌట్ అనివార్యమైన వేళ స్విస్‌కు గ్రానిట్ జాకా, జికే అమ్డొని, సెడ్రిక్ ఇటెన్, రూబెన్ వర్గాస్ గోల్స్ చేయగా.. కొలంబియా నుంచి జువాన్ క్వింటెరో, జమింటన్ కాంపాజ్, లుయిస్ దియాజ్ గోల్స్ చేశారు.

# వావ్... జొకోవిచ్

- వింబుల్డన్ సెమీఫైనల్‌కు సెర్బియా దిగ్గజం
- 5.15 గంటల సుదీర్ఘ పోరులో మూడో సీడ్‌పై విజయం

లండన్: వయసు మీద పడుతున్నా తన ఆటలో ఇంకా పదును ఏమాత్రం తగ్గలేదని నిరూపిస్తూ తనకు అచ్చొచ్చిన వింబుల్డన్‌లో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరోసారి సత్తాచాటాడు. కెరీర్ 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న అతడు.. 5 గంటల 15 నిమిషాల పాటు సుదీర్ఘంగా సాగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో 7-6 (12/10), 3-6, 6-3, 6-7 (4/7), 7-6 (10/4)తో కెనడాకు చెందిన మూడో సీడ్ ఫెలిక్స్ అలియాసిమ్‌ను ఓడించి ఈ టోర్నీలో రికార్డు స్థాయిలో 15వసారి సెమీస్‌కు చేరాడు. వింబుల్డన్ చరిత్రలో ఇదే సుదీర్ఘమైన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కావడం విశేషం. మూడు టైబ్రేక్‌లకు దారితీసిన రసవత్తర పోరులో విజయం కోసం 25 ఏళ్ల కుర్రాడితో 39 ఏళ్ల జొకో ఎక్కడా తగ్గకుండా పోరాడాడు. నీకో సెట్, నాకో సెట్ అన్నట్టుగా సాగిన పోరులో సుదీర్ఘమైన ర్యాలీలు, బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లు, కోర్టులో పాదరసంలా కదులుతూ జొకో, ఫెలిక్స్ చేసిన విన్యాసాలు అభిమానులకు 'పైసా వసూల' మజాను అందించాయి. చెరో రెండు సెట్లు నెగ్గాక విజేతను నిర్ణయించే ఫైనల్ సెట్ సైతం టైబ్రేక్‌కు దారితీయగా ఓటమి అంచుల్లోకి వెళ్తున్నా మూడో సీడ్ ఫెలిక్స్ పోరాటాన్ని ఆపలేదు.

22 షాట్ల ర్యాలీ అనంతరం అతడు చేసిన తప్పిదంతో జొకో విజయం ఖరారైంది. మ్యాచ్ అనంతరం జొకో స్పందిస్తూ.. 'ఇలాంటి క్షణాల కోసమే నేను ఇంకా టెన్నిస్ ఆడుతున్నాను. నాకంటే 15 ఏళ్లు చిన్నవాడైన కుర్రాడితో సమానంగా నేను పోరాడగలుగుతున్నాను. నా కెరీర్‌లో ఆడిన అత్యుత్తమ మ్యాచ్‌ల్లో ఇదొకటి' అని చెప్పడం గమనార్హం. సెమీస్‌లో జొకో.. వచ్చే ఆదివారం టాప్‌సీడ్ సినర్‌తో తాడోపేడో తేల్చుకోనున్నాడు.



చైతన్య రథం

# సినిమా

శుక్రవారం 10 జూలై 2026 X

## 24న వస్తున్నాడు...

# 'జన నాయకన'

**సెన్సార్ బోర్డు క్లియరెన్స్...**

**'ఎ' సర్టిఫికెట్ జారీ**



తమిళనాడు సీఎం విజయ్ నటించిన చిత్రం జన నాయకనపై కొత్త అప్డేట్ వచ్చింది. ఆఫిల్మ్‌కు సెన్సార్ బోర్డు క్లియరెన్స్ ఇచ్చింది. 183 నిమిషాల (3 గంటల 3 నిమిషాలు)నిడివితో ఉన్న ఈ సినిమాకు 'ఎ' సర్టిఫికెట్ జారీ చేసినట్టు సీబీఎఫ్‌సీ చెప్పింది. అయితే ఈ సినిమా సెన్సార్ కోసం జరిగిన కట్స్ గురించి మాత్రం వెబ్ సైట్‌లో పెట్టలేదు. వాస్తవానికి ఈ ఫిల్మ్ పొంగల్ పండుగ సందర్భంగా జనవరి 9న రిలీజ్ కావాల్సి ఉంది. కానీ సెన్సార్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో నిలిచి పోయింది. 2025 డిసెంబర్‌లో ఈ సినిమా సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీన్ కట్ చేస్తే.. ప్రస్తుతం తమిళనాడు సీఎంగా విజయ్ బాధ్యతలు స్వీకరించారు.

తాజా సమాచారం ప్రకారం 'జన నాయకన' ప్రపంచవ్యాప్తంగా ఈనెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. విదేశీ డిస్ట్రిబ్యూటర్లకు కూడా ఇదే రిలీజ్ డేట్‌ను అధికారికంగా తెలియజేసినట్టు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మేకర్స్‌నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ సినిమా విజయ్ సినీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో ఒకటిగానిలవనుంది. నటుడిగా ఆయన చివరి చిత్రం కావడం వల్ల అభిమానుల్లో భారీ అంచనాలు నెల కొన్నాయి. రాజకీయ, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం విజయ్‌కు గ్రాండ్ ఫేర్‌వెల్ మూవీగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రంలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటి స్తోంది. యువ నటి మమితా బైజు కూడా కీలక పాత్రలో కనిపించనుండగా బాలీవుడ్ నటుడు బాబీ డియోల్,దర్శకుడు -నటుడు గౌతమ్‌వాసుదేవ్ మీనన్, సీనియర్ నటుడు ప్రకాశ్‌రాజ్, ప్రియమణి, నరైన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమా కథపై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఈచిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మి స్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవి చందర్ సంగీతం అందిస్తున్నారు. విజయ్ -అనిరుధ్ కాంబినేషన్‌లో వచ్చిన గత చిత్రాల పాటలు,బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిన నేపథ్యంలో 'జన నాయకన' సంగీతం పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

## యానిమేషన్ వండర్

# 'హనుమత్ సుందరకాండ'



భారతీయ యానిమేషన్ రంగంలో సరికొత్త వండర్ సృష్టించేందుకు 'హనుమత్ సుందరకాండ' చిత్రం సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో పాటు అత్యాధునిక వీఎఫ్ఎక్స్, హై-ఎండ్ యానిమేషన్ సాంకేతికతను ఉపయోగించి ఈచిత్రాన్ని అద్భుత దృశ్య కావ్యంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మేరకు చిత్ర బృందం తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారికపోస్టర్‌ను విడుదల చేసింది. అయింద్రి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాతలు నిశ్చిత సేతు, హరినాథ్ దేవర సంయుక్తంగా ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. అరుణ్‌కుమార్ రాపోలు దర్శకత్వం వహిస్తున్నారు. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్స్, భావోద్వేగభరితమైన కథాంశంతో భారతీయ యానిమేషన్ రంగంలోనే ఇదొక మైలు రాయిగా నిలిచేలా చిత్రవర్గాలు దీనిని తీర్చిదిద్దుతున్నాయి. తాజాగా విడుదలైన పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

## 'బోల్డ్ కంటెంట' ఆశించేవారు

## సబ్‌స్క్రైబ్ చేసుకోవద్దు!



గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో సెలబ్రిటీల ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ ఫీచర్ హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. తాజాగా టాలీవుడ్ నటి పాయల్ రాజ్‌పుత్ కూడా తన అకౌంట్‌కు ఈసబ్‌స్క్రిప్షన్ ఫీచర్‌ను ఎనేబుల్ చేశారు. అయితే దీనిపై కొందరు నెటిజన్లు ఆమెను ట్రోల్‌చేయడం ప్రారంభించారు. ఈ ట్రోల్స్‌కు పాయల్ గట్టిగా సమాధానమిస్తూ సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్ట్‌ను షేర్ చేశారు. తన సబ్‌స్క్రిప్షన్ ఛానల్‌లో ఎలాంటి కంటెంట్ ఉండబోతోందో పాయల్ రాజ్‌పుత్ స్పష్టతనిచ్చారు. 'హాట్ పిక్స్', 'బోల్డ్ కంటెంట' కోసం ఆశించేవారెవరూ తన ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవద్దని ఆమె తెగేసి చెప్పారు. తెరవెనుక ఉండే తన నిజమైన జీవితాన్ని, దైనందిన కార్యకలాపాలను చూడాలనుకునే వాళ్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని కోరారు. ఈ ఛానల్‌లో కేవలం తన వ్యక్తిగత అభి ప్రాయాలు, ఆలోచనలు మాత్రమే ఉంటాయని.. అంతకుమించి మరేమీ ఆశించ వద్దని క్లారిటీ ఇచ్చారు. "నా ఛానల్‌లో ఎలాంటికంటెంట్ షేర్ చేయ బోతున్నా నసే దానిపై చాలా మంది మెసేజ్‌లు చేస్తున్నారు. ఒకవేళ మీరు బోల్డ్ కంటెంట్ ఆశించి సబ్‌స్క్రైబ్ చేసుకోవాలనుకుంటే, మీకు ఇది సరైన ఛానల్ కాదు. నా వ్యక్తిగత పరిధిని గౌరవిస్తున్నందుకు ధన్యవాదాలు" అని పాయల్ పేర్కొన్నారు.

# 'వదలా'... అంటున్న జగపతిబాబు

## 17న ప్రేక్షకుల ముందుకు




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదలా' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి.కృష్ణ తీర్చిదిద్దిన ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథా నాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరో వైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె.నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతీ సన్నివేశానికీ అదనపు థ్రిల్‌ను జోడించింది.

# "అదే నీవు అదే నేను"

## టీజర్ రిలీజ్ చేసిన దిల్ రాజు

"కమిటీ కుర్రోళ్లు"మూవీ ఫేమ్ త్రినాథ్‌వర్మ, యశ్వంత్ పెండ్యాల,"సిద్ధార్థ్ రాయ"సినిమా ఫేమ్ తన్వీ నేగి హీరో, హీరోయిన్స్‌గా నటిస్తున్న సినిమా "అదే నీవు అదే నేను". ఈచిత్రాన్ని శ్రీలక్ష్మీవీరభద్ర క్రియేషన్స్‌బ్యానర్‌పై గోవిందు కాంట్రేగుల నిర్మిస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో యువ దర్శకుడు కొండల్ రూపొందిస్తున్నారు. "అదే నీవు అదే నేను" సినిమా త్వరలో గ్రాండ్‌థియేట్రికల్ రిలీజ్‌కు రెడీఅవుతోంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు రిలీజ్ చేశారు. ఇది ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ ప్రేక్షకుల్నిఆకట్టుకుంటోంది.

డైరెక్టర్ కొండల్ మాట్లాడుతూ... 'మా సినిమాను రొమాంటిక్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందించాం. మనం వేసే ఒక తప్పటడుగు, ఆవేశంలో చేసే నేరం జీవితాన్ని ఎలా తలకిందులు చేస్తుందో ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించాం. ప్రేక్షకుల ఊహకు అందకుండా మా సినిమా సాగుతుంది. ముఖ్యంగా యూత్ ను ఆకట్టుకునే చిత్రమిది. ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా మా సినిమాను ఎంజాయ్ చేస్తారు. సెకండాఫ్ మామూలుగా ఉండదు. మీరు ఎక్స్‌పెక్ట్ చేయని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ట్విస్ట్ ఉంటాయి' అన్నారు.





## తిరుమలేశుని సన్నిధిలో శ్రీముఖి

కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధికి ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి విచ్చేశారు. ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనం ఇవ్వగా టీటీడీ అధికారులు స్వామివారి పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆమెను చూసేందుకు భక్తులు ఆసక్తి కనబర్చారు.